అనుదినం... జనస్వరం


నవతెలంగాణ

గురువారం 18-5-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 137 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు వెల : 6.50


భావ ప్రకటనా స్వేచ్ఛకు తీవ్ర ముప్పు

రచయిత సల్మాన్ రష్దీ హెచ్చరిక



లండన్ : వేదికపై ప్రసంగిస్తుండగా, కత్తిపోట్లకు గురై తీవ్రంగా గాయపడిన రచయిత సల్మాన్ రష్దీ తొమ్మిది మాసాల తర్వాత మళ్ళీ ప్రసంగం చేశారు. పశ్చిమ దేశాల్లో భావ ప్రకటనా స్వేచ్ఛ గతంలో ఎన్నడూ లేనంత తీవ్ర ముప్పును ఎదుర్కొంటోందని హెచ్చరించారు. బ్రిటీష్ బుక్ అవార్డ్స్ కార్యక్రమానికి రష్దీ వీడియో సందేశం పంపారు. సోమవారం సాయంత్రం ఈ కార్యక్రమంలో రష్దీకి అవార్డు ఇచ్చారు. 'ఎన్ని ముప్పులు, బెదిరింపులు ఎదుర్కొంటున్నా రచయితలు, ప్రచురణకర్తలు, పుస్తక విక్రేతలు అందరూ కృత నిశ్చయంతో అసహనానికి వ్యతిరేకంగా వైఖరి తీసుకుంటున్నారనీ, దాన్ని గుర్తిస్తూనే ఈ గౌరవం' అని ఈ సందర్భంగా నిర్వాహకులు పేర్కొన్నారు. రష్దీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, పశ్చిమ ...5లో

వైద్యుల భద్రతకు కేరళ ప్రభుత్వం ఆర్డినెన్స్



తిరువనంతపురం : ఆస్పత్రుల్లో వైద్యుల భద్రతకు సంబంధించిన ఆర్డినెన్స్‌ను కేరళ ప్రభుత్వం బుధవారం ఆమోదించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో కేరళ హెల్త్ కేర్ సర్వీస్ వర్కర్స్, హెల్త్ కేర్ సర్వీస్ ఇన్‌స్టిట్యూషన్స్ (హింస నివారణ, ఆస్తులకు నష్టం) ఆర్డినెన్స్ సవరణ, 2012ను ఆమోదించింది. ఈ ఆర్డినెన్స్ ప్రకారం... ఆస్పత్రుల్లో హింసాత్మక చర్యలకు పాల్పడినా, ప్రయత్నించినా, ప్రేరేపించినా.. ఆ వ్యక్తికి కనీసం ఆరునెలలు నుంచి ఐదు సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించవచ్చు. అలాగే రూ.50,000 నుంచి రూ.2 లక్షల వరకు జరిమానా విధించవచ్చని తెలిపింది. ఆరోగ్య కార్యకర్తపైనకానీ, లేదా వైద్యునిపైన కానీ దాడికి పాల్పడితే కనీసం ఏడాది నుంచి ఏడేండ్ల పాటు జైలు శిక్ష విధించవచ్చు. రూ. లక్ష నుంచి అయిదు లక్షల వరకు జరిమానా విధించవచ్చు. తాత్కాలికంగా నమోదైన వారితో పాటు మెడికల్ ప్రాక్టీషనర్లు, నర్సులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, పారామెడికల్ విద్యార్థులను కూడా ఈ సవరించిన ఆర్డినెన్స్‌లో చేర్చింది. గతవారం కొట్టారకర తాలూకా ఆస్పత్రిలో వైద్యురాలు ...5లో

భయం సృష్టించకండి

ఛత్తీస్‌గఢ్ మద్యం కేసులో ఈడీకి సుప్రీంకోర్టు చురక



న్యూఢిల్లీ : ఛత్తీస్‌గఢ్ మద్యం కుంభకోణం కేసు విచారణ సందర్భంగా భయ వాతావరణం సృష్టించవద్దని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి సుప్రీంకోర్టు చురక వేసింది. కేంద్ర దర్యాప్తు సంస్థ అత్యుత్సాహం ప్రదర్శిస్తోందని, కుంభకోణానికి ముడిపెట్టి ముఖ్యమంత్రి భూపేష్ బాఘెల్‌ను మనీ లాండరింగ్ కేసులో ఇరికించేందుకు ప్రయత్నిస్తోందని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తంచేస్తోంది. ముఖ్యమంత్రిని ఇరికించే ఉద్దేశంతో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ అధికారులు, వారి కుటుంబసభ్యులను అరెస్టు చేస్తామని బెదిరిస్తున్నదని ఆరోపించింది. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. ఈడీ దర్యాప్తును సవాలు చేస్తూ ఇద్దరు వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ ఎ అమానుల్లాతో కూడిన సుప్రీం ధర్మాసనం విచారిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వ వాదనలను ఈడీ తోసిపుచ్చింది. రెండు ...5లో

సందిగ్ధంలో కర్నాటకం

ఇంకాతేలని సీఎం ఎంపిక


- కొనసాగుతున్న కాంగ్రెస్ మార్క్ రాజకీయం
- సీఎం కుర్చీ సిద్ధూదేనని.. డీకేకు బుజ్జగింపులని వార్తలు
- పుకార్లను నమ్మవద్దంటున్న రణదీప్ సూర్జేవాలా






బెంగళూరులో సిద్ధరామయ్య మద్దతుదారుల ఆనందోత్సాహాలు...

న్యూఢిల్లీ/బెంగళూరు : కర్నాటక తదుపరి ముఖ్యమంత్రిని త్వరలోనే ప్రకటిస్తామని కాంగ్రెస్ నేత, ఆ పార్టీ కర్నాటక ఎన్నికల ఇన్‌చార్జి రణదీప్ సూర్జేవాలా అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇంకా సంప్రదింపులు జరుగుతున్నాయనీ, ఒక నిర్ణయానికి రాగానే వెంటనే తెలియచేస్తామనీ, ఆ తర్వాత 48-72 గంటల్లోగా కొత్త ప్రభుత్వం కొలువుదీరుతుందని చెప్పారు. 18న ప్రమాణస్వీకారం అంటూ వస్తున్న వార్తలపై స్పందిస్తూ.. అవన్నీ నమ్మవద్దని కోరారు. ప్రమాణస్వీకార తేదీని ఇంకా నిర్ణయించలేదనీ, ముఖ్యమంత్రిగా ఎంపికైనవారే ఆ తేదీని నిర్ణయిస్తారని చెప్పారు. సీఎం ఎంపికపై వస్తున్న పుకార్లను పట్టించుకోవద్దనీ, బీజేపీ తప్పుడు వార్తలను ప్రచారం చేస్తోందని విమర్శించారు. అయితే, కర్నాటక ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్యను కాంగ్రెస్ అధిష్టానం ఎంపిక చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ముఖ్యమంత్రి పదవి కోసం చివరి నిమిషం వరకూ తీవ్రంగా ప్రయత్నించిన పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌ను బుజ్జగించి ఒప్పించినట్టు సమాచారం. ముఖ్యమంత్రి పదవిని చెరికొంత కాలం పంచుకునే విషయంపై ఓ ఫార్ములాను రూపొందించారని తెలిసింది. దీని ప్రకారం సిద్ధరామయ్య ...5లో







గుజరాత్ మోడల్ ఓ బోగస్

మోడీ దేశాన్ని మోసం చేసిండు...

- కులం, మతం మీద ఏ పార్టీ గెల్వదు..
- అందర్నీ కాపాడుకోవాలంటూ నేతలకు దిశా నిర్దేశం
- 95 నుంచి 105 సీట్లు గెలుస్తాం : బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గుజరాత్ మోడల్ అనేది ఓ బోగస్ అని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ విమర్శించారు. ఈ క్రమంలో దేశానికి తెలంగాణ మోడల్ అనివార్యమని ఆయన తెలిపారు. ప్రధాని మోడీ దేశాన్ని మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కులం, మతం ప్రాతిపదికన ఏ పార్టీ గెలవబోదని స్పష్టం చేశారు. అందువల్ల ప్రజలతో అనున్యితం మమేకం కావాలని సూచించారు. 'పిల్లల కోడి లెక్కుండాలి..తద్వారా అందర్నీ కాపాడుకోవాలి...' అని ప్రజా ప్రతినిధులకు దిశా నిర్దేశం చేశారు. వచ్చే ఎన్నికల్లో 95 నుంచి 105 సీట్లను గెలవబోతున్నామంటూ ఆయన ధీమా వ్యక్తం చేశారు. సర్వేలన్నీ బీఆర్ఎస్‌కే అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. తాను చెప్పినట్టు అందరూ కలిసికట్టుగా పనిచేస్తే ప్రతీ ఒక్కరికీ 50 వేలకన్నా ఎక్కువ మెజారిటీ వస్తుందని వివరించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. మంత్రులు, బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మెన్లతోపాటు అన్ని స్థాయిల్లోని ప్రజా ప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మెన్లు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్ రానున్న ఎన్నికలు, రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు, ఈ పదేండ్ల కాలంలో సాధించిన ప్రగతి తదితరాంశాలపై సుదీర్ఘంగా ప్రసంగించారు. తెలంగాణ అనేది వజ్రపుతునక అని సీఎం ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. స్వరాష్ట్రం సాధించుకుని అద్భుతంగా ముందుకు సాగుతున్నామని ఆయన తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ (దశాబ్ది) ఉత్సవాలను జూన్ 2 నుంచి 21 వరకు ఘనంగా నిర్వహించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌తో జరజాగ్రత్త...

విస్తృతస్థాయి సమావేశం సందర్భంగా ఇటీవల వెలువడిన కర్నాటక ఎన్నికల ఫలితాలను సీఎం ప్రస్తావించినట్టు తెలిసింది. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను తక్కువగా అంచనా వేయొద్దంటూ ఆయన ఈ సందర్భంగా నేతలకు సూచించారు. కర్నాటక ఫలితాల నేపథ్యంలో ఆ పార్టీ మాంచి జోష్‌లో ఉందనీ, ...5లో

కేసీఆర్ చేసిన సూచనలు...

- దశాబ్ది ఉత్సవాలను దేశమంతా దద్దరిల్లేలా ఘనంగా నిర్వహించాలి
- ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులందరూ ఉత్సవాల్లో భాగస్వాములు కావాలి
- విషయ ప్రాతిపదికన రాజకీయాలు చేయాలి తప్ప చిల్లర మల్లర అంశాలు, కుత్సిత మనసుతో పని చేయొద్దు
- అత్యధికంగా సిట్టింగులకే ఈసారి సీట్లు
- ప్రతీ అంశాన్ని నేనే స్వయంగా పర్యవేక్షిస్తున్నా.. అందువల్ల ఏ ఒక్కరూ ఎలాంటి తప్పుకూ ఆస్కారమివ్వొద్దు
- కల్తీ విత్తనాలపై సీరియస్‌గా ఉండాలి. వాటిని అమ్మే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి. రైతులను మోసం చేసే వారిని ప్రభుత్వం వదిలిపెట్టబోదనే సంకేతాలను ఇవ్వాలి
- దశాబ్ది ఉత్సవాల్లో ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, దేశపతి శ్రీనివాస్ సేవలను విరివిగా వినియోగించుకోవాలి
- కవి సమ్మేళనాలు నిర్వహించాలి. వీటికి ఎమ్మెల్యేలే నేతృత్వం వహించాలి

పల్నాడులో ఘోర రోడ్డు ప్రమాదం

దామరచర్లకు చెందిన ఆరుగురు కూలీలు మృతి

- మిరపకాయలు ఏరేందుకు వెళ్తుండగా ఘటన
- బాధితులకు ఎమ్మెల్యే భాస్కరరావు, జూలకంటి పరామర్శ
- ఆర్థిక సాయం అందజేత
- మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు ప్రకటించిన సీఎం కేసీఆర్



నవతెలంగాణ-దామరచర్ల

పొట్ట తిప్పల కోసం పక్కనే ఉన్న మరో జిల్లాకు మిరపకాయలు ఏరేందుకు వెళ్లిన మహిళా కూలీలను రోడ్డు ప్రమాదం మింగేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా పొందుగుల ...5లో

పేదల నివాసాలను క్రమబద్ధీకరించాలి

- కంటోన్మెంట్, కేంద్ర సంస్థల భూములపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సీపీఐ(ఎం) బహిరంగ లేఖ



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన భూముల్లోని పేదల ఇండ్లను జీవో 58 ప్రకారం రెగ్యులరైజేషన్ చేస్తున్న మాదిరిగానే కంటోన్మెంట్, కేంద్ర ప్రభుత్వ సంస్థల భూముల్లోని బస్తీలు, కాలనీల నివాసాలను సైతం క్రమబద్ధీకరించాలని సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ ...5లో

నేడు నవతెలంగాణ నూతన వెబ్‌సైట్ ప్రారంభం..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నవతెలంగాణ దినపత్రిక నూతన వెబ్‌సైట్‌ను గురువారం హైదరాబాద్‌లోని ఎమ్‌హెచ్ భవన్‌లో ప్రారంభించనున్నారు. సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఈ వెబ్‌సైట్‌ను ప్రారంభి స్తారు. అనంతరం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభను నిర్వహిస్తామని నవతెలంగాణ సీజీఎం పి.ప్రభాకర్ ఒకప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



ఎండలకు సలసల

రాష్ట్రవ్యాప్తంగా హడలెత్తిస్తున్న వడగాడ్పులు

- 46 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- మొండి కేస్తున్న ఏసీలు.. కూలర్లు
- నిర్మానుష్యంగా రోడ్లు.. జంకుతున్న జనం..!



రోజురోజుకూ వేసవి భానుడి ప్రతాపం తీవ్ర స్థాయికి చేరింది. ప్రతి సంవత్సరం లాగానే వేసవి కాలం ఎండలు భగభగ లాడుతుంటాయి. ఈ ఏడాది మాత్రం కాస్త ముదిరి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వేసవి కాలం ప్రారంభం నుండి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదు అవుతున్నాయి. మూడు రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులు.. ఇతర ప్రాంతాల నుంచి వీస్తున్న వేడి గాలుల వల్ల కొత్తగూడెం పట్టణం, పరిసర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరాయి. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి ఉంది. 46 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత్తలకు పైగా నమోదవుతున్నాయి. వడదెబ్బకు పలువురు మృతిచెందుతున్నారు. ఉదయం 8 గంటలకే సూర్యతాపం చూపిస్తుంది. సాయంత్రం 6 గంటల వరకు వేడి వాతావరణం ఏమాత్రం తగ్గడంలేదు.



నవతెలంగాణ-కొత్తగూడెం

వేసవి కాలం వచ్చిందంటే కొత్తగూడెం పట్టణంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. సింగరేణి కోల్ మైనింగ్ ప్రాంతం కావడంతో మూడు దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో వేసవి వాతావరణంలో పెద్ద ఎత్తున మార్పులు చోటు చేసుకున్నాయి. సింగరేణి ఓపెన్ కాస్ట్ మైనింగ్ కారణంగా అడవులు నరికి వేయడం వల్ల, ఉపరితలం నుంచి బొగ్గు నిక్షేపాలు వెలికి తీసే ప్రక్రియ మొదలు కావడంతో వేడి వాతావరణం రికార్డు నమోదు అవుతుంది.

ఈ ఏడాది కూడా ఇప్పటికే 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కోల్ మైనింగ్ కారణంగా అడవులు నరికివేశారు. అదే స్థాయిలో స్థానికంగా మొక్కల పెంపకం జరగని కారణంగా ఓపెన్ కాస్ట్ నుంచి వేడిగాలులు నేరుగా వీస్తున్న క్రమంలో ఈ ప్రాంత ప్రజలకు వేసవి కాలం తీవ్ర భయాందోళనకు గురిచేస్తుంది. ఇదిలా ఉండగా.. ఈ తరుణంలో కొత్తగూడెంలో 48 డిగ్రీల స్థాయికి వేడి పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడులో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయింది. కొత్తగూడెం పట్టణంలో 45.4, పాల్వంచలో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మొండి కేస్తున్న ఏసీలు, కూలర్లు

ఎండ తీవ్రతను తట్టుకోలేక, బయటకు రాలేక ఇండ్లకే పరిమితమవుతున్న ప్రజలకు అత్యధిక ఉష్ణోగ్రతలు వెంటాడుతున్నాయి. ఇండ్లల్లో ఫ్యాన్లు, కూలర్లు, ...5లో

వడదెబ్బకు నలుగురు మృతి

- ముగ్గురు కూలీలు, ఒక మత్స్యకారుడు..

నవతెలంగాణ-బయ్యారం/తొర్రూర్ రూరల్/నార్సింగి

పెరుగుతున్న ఎండలకు తట్టుకోలేక ఇద్దరు రైతు కూలీలు, మత్స్యకారుడు మృతి చెందిన ఘటనలు మహబూబాబాద్ జిల్లా, మెదక్ జిల్లాల్లో బుధవారం జరిగాయి. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కోడిపుంజుల తండాకు చెందిన ఇస్లావత్ సీతారాం(55) మామిడి తోటలో కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, ఎండల తీవ్రత, వడగాలులకు తట్టుకోలేక వడదెబ్బకు గురై మృతిచెందాడు. ఇతనికి ఒక్క కొడుకు ఉండగా, బతుకు దెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. మృతునికి 20 గుంటలు భూమి ఉన్నా దానికి పట్టా లేక పోవడం వల్ల రైతు బీమా, రైతు బంధు రావడం లేదు. పింఛన్‌నూ రాని పరిస్థితి. దాంతో ...5లో

బిజినెస్

మహిళల పొదుపు పథకంపైనా పన్ను



న్యూఢిల్లీ : మోడీ సర్కార్ ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన మహిళల పొదుపు పథకంపైనా వడ్డీ బాదాలని నిర్ణయించింది. మహిళల కోసం ఉద్దేశించిన మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ స్కీమ్‌లో వచ్చే వడ్డీపైనా పన్ను చెల్లించాల్సిందేనని సీబీడీటీ స్పష్టం చేసింది. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఈ పథకాన్ని ప్రకటించింది. ఇది 2023 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. చిన్న మొత్తంలో పొదుపు చేసుకోవాలని భావిం చే మహిళలకు ఇది మంచి స్కీమ్ అని బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఈ స్కీమ్‌లో పొదుపు చేసిన వారికి పన్ను లాభాలు ఉంటాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. తాజాగా కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) చేసిన ప్రకటనతో చిన్న మొత్తంలో పొదుపు చేసుకోవాలని భావించిన పేద, మధ్య తరగతి మహిళలకు షాక్ ఇచ్చినట్లయ్యింది. దీని వల్ల పొదుపుపై మహిళల ఆశలు సన్నగిల్లినట్లయ్యి ంది. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 194ఎ కింద మహిళా సమ్మాన్ సేవింగ్స్ స్కీమ్‌పై వచ్చే వడ్డీ మొత్తంపై టీడీఎస్ చెల్లించాల్సి ఉంటుందని సీబీడీటీ స్పష్టం చేస్తూ.. ఉత్తర్వులు జారీ చేసింది. మహిళా సమ్మాన్ పథకంలో ఒక ఆర్థిక సంవత్సరంలో వడ్డీ రూపంలో రూ.40,000 పైన రాబడి ఉంటే అప్పుడు సెక్షన్ 194ఎ కింద టీడీఎస్ చెల్లించాల్సి ఉంటుం ది. అలాగే పోస్టాఫీసు, బ్యాంకుల్లో డిపాజిట్ చేసిన మొత్తం కూడా ఈ సెక్షన్ పరిధి కిందకే వస్తుంది. సీనియర్ సిటిజన్లకు ఈ పరిమితి రూ. 50,000 ఉంటుంది. పరిమిత కాలం వరకే ఈ పథకం అందు బాటులో ఉంటుంది. ప్రస్తుతం ఈ పథకంలో చేరిన వారికి 7.5 శాతం వరకు వడ్డీ లభిస్తోంది. ఈ స్కీమ్‌లో కనిష్టంగా రూ.1000, గరిష్టం గా రూ.2 లక్షల వరకు పొదుపు చేసుకోవడానికి వీలుంది. ఈ పథకంలో వచ్చే ఏడాది చివరి వరకు చేరవచ్చు. ఇప్పటికే అనేక చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీ రేట్లను కేంద్ర ఆర్థిక శాఖ తగ్గించింది. ఎంతో ఆశగా మహిళా సమ్మాన్‌లో చేరి పొదుపు చేసుకున్న వారికి తాజా షరతు ఆందోళన కలిగిస్తోంది.

ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్ 425 శాతం డివిడెండ్



న్యూఢిల్లీ : ప్రముఖ గృహ రుణాల జారీ సంస్థ ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రతీ రూ.2 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేర్‌పై ఏకంగా రూ. 8.50 లేదా 425 శాతం డివిడెండ్‌ను ప్రకటించింది. దీనికి సంస్థ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం)లో అనుమతి లభించాల్సి ఉంటుంది. 2023 మార్చితో ముగిసిన త్రైమాసికంలో ఆ సంస్థ లాభాలు 5.5 శాతం పెరిగి రూ.1,180.3 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1,118.6 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.5,299 కోట్లుగా ఉన్న సంస్థ రెవెన్యూ.. క్రితం త్రైమాసికంలో 20.83 శాతం వృద్ధితో రూ.6,415.17 కోట్ల రెవెన్యూ ఆర్జించింది. 2023 మార్చి 31 నాటికి ఎల్ఐసి హైసింగ్ ఫైనాన్స్ నికర విలువ రూ.24,674.98 లక్షల కోట్లకు చేరింది. సంస్థ స్థూల నిరర్థక ఆస్తులు 4.41 శాతంగా, నికర ఎన్‌పీఏలు 2.50 శాతంగా నమోద య్యాయి. బుధవారం బీఎస్ఈలో ఈ సంస్థ షేర్ 6.37 శాతం తగ్గి రూ.369.60 వద్ద ముగిసింది.

2024లో భారత వృద్ధి 6.7 శాతం

- ఐక్యరాజ్య సమితి అంచనా



న్యూఢిల్లీ: వచ్చే ఏడాది భారత వృద్ధి రేటు 6.7 శాతంగా ఉండొచ్చని ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది. దేశీయ డిమాండ్ జీడీపీకి ప్రధాన మద్దతును అందించనుందని విశ్లేషించింది. 2023 మధ్యస్థానికి సంబంధించిన ప్రపంచ ఆర్థిక పరిస్థితి, అంచనా రిపో ర్ట్‌ను విడుదల చేసింది. 2023లో 5.8 శాతం వృద్ధి ఉండొచ్చని అంచనా వేసింది. అధిక వడ్డీ రేట్లు, విదేశీ డిమాండ్‌లో తగ్గుదల ఉన్నప్పటికీ 2023లో పెట్టుబడులు, ఎగుమతులు మెరుగ్గానే ఉండొచ్చని పేర్కొంది. భారత ద్రవ్యోల్బణం సూచీ 5.5 శాతంగా నమోదు కావొచ్చని తెలిపింది.

డిజిటల్ ప్రకటనల్లోనే అధిక ఉల్లంఘనలు

- గేమింగ్‌లో భారీగా పెరుగుదల :ఆస్కీ రిపోర్ట్

న్యూఢిల్లీ : డిజిటల్ ప్రకటనల రంగంలోనే అత్యధిక ఉల్లంఘనలు చోటు చేసుకుంటున్నాయని అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆస్కీ) ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. 2022-23కు సంబంధించిన వార్షిక ఫిర్యాదుల నివేదికను ఆస్కి విడుదల చేసింది. ఈ ఏడాది కాలంలో ప్రింట్, డిజిటల్, టెలివిజన్‌తో సహా వివిధ మాధ్యమాలలో 7,928 ప్రకటనలను ఆస్కీ సమీక్షించింది. డిజిటల్ ప్రకటనలు కేవలం ఉల్లంఘనల్లో టాప్‌లో ఉండటంతో పాటుగా నిబంధనలను అతి తక్కువగా పాటిస్తున్నాయి. 92 శాతం గేమింగ్ ప్రకటనలు ఉల్లంఘనలకు పాల్పడ్డాయని ఆస్కీ తెలిపింది. "మార్గదర్శకాలను ఉల్లంఘించే ప్రకటనల విషయంలో డిజిటల్ మాధ్యమం ముందుంది. ఇది ఆన్‌లైన్ వినియోగదారు భద్రత, విశ్వాసం గురించి ముఖ్యమైన ఆందోళనలను లేవనెత్తుతుంది. వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేందుకు ఈ సమస్యను అత్యవసర ప్రాతిపదికన పరిష్కరించడానికి ప్రకటనకర్తలు, కంటెంట్ సృష్టికర్తలు, ప్లాట్‌ఫామ్‌లు కలిసి రావాలి. మార్గదర్శకాలను ఉల్లంఘించే గేమింగ్ ప్రకటనల సంఖ్య గణనీయంగా పెరగడాన్ని కూడా పరిశ్రమ తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉంది." అని ఆస్కీ సీఈఓ, సెక్రెటరీ జనరల్ మనీషా కపూర్ పేర్కొన్నారు.

రెండో రోజూ మార్కెట్ల నేల చూపులు

- సెన్సెక్స్ 372 పాయింట్ల పతనం



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ నష్టాలు చవి చూశాయి. అమెరికా లో రుణ సంక్షోభం చోటు చేసుకో నుందనే అంచనాలు మార్కెట్లను ఒత్తిడికి గురి చేశాయి. ఈ నేపథ్యంలోనే బుధవారం బిఎస్ఇ సెన్సెక్స్ 372 పాయింట్లు కోల్పోయి 61,561కు పడిపోయింది. రెండు సెషన్లలో ఈ సూచీ దాదాపు 900 పాయింట్ల మేర నష్టపోయింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 105 పాయింట్ల నష్టంతో 18,115 వద్ద ముగిసింది. సెన్సెక్స్-30లో ఆసియన్ పెయింట్స్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్ షేర్లు అధికంగా 1-2 శాతం వరకు నష్టపోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మిడ్‌క్యాప్ సూచీ 0.2 శాతం తగ్గగా.. స్మాల్ క్యాప్ 0.3 శాతం పెరిగింది.

'ధరణి'..దగా..





పరిష్కారాల కంటే వివాదాలే ఎక్కువ

11అంశాలు..2.65లక్షల వివాదాలు

పరిష్కరించని రెవెన్యూ శాఖ

అధికారుల తప్పులకు అన్నదాతలు బలి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ధరణితో భూసమస్యలకు చెల్లుచీటీ.. పరిష్కారం. రైతులు ఏ అధికారి దగ్గరకు వెళ్లకుండానే సమస్యలు పరిష్కరించుకుంటారు' అని రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా ప్రకటించింది. కానీ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. సమస్యల పరిష్కారాల కంటే వివాదాలే ఎక్కువగా ఉన్నాయి. 2,65,653 వివాదాలతో 'ధరణి' దడ పుట్టిస్తోంది. దద్దరిల్లుతోంది. చిన్న చిన్న సమస్యలు కూడా పరిష్కారం కావడంలేదని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రతి సమస్యకూ సీసీఎల్ఏ కార్యాలయానికి రావాలంటే భారంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు చేసిన తప్పులను సవరించడానికి రైతుల నుంచి ఫీజులు వసూలు చేయడమంటే దగా చేయడమేనని బాధితులు మండిపడుతున్నారు.

అధికారుల తప్పులకు అన్నదాతలు బలి

ధరణి పోర్టల్‌లో 2022 ఏప్రిల్ 29న 11రకాల సమస్యలను పరిష్కరించడానికి, పాసుపుస్తకంలో సవరణలు చేయడానికి ఒక మాడ్యూల్‌ను రూపొందించారు. దీనిలో అధికారులు చేసిన తప్పిదాలకు అన్నదాతలు మూల్యం చెల్లించుకోవాల్సివస్తున్నది. అధికారులు చేసిన తప్పులను సవరించేందుకు రైతుల దగ్గర అదనంగా ఫీజులు వసూలు చేయడం శోచనీయమని రైతులు వాపోతున్నారు. ఈ మాడ్యూల్ కింద 11 రకాల సమస్యల పరిష్కారం దరఖాస్తుదారులు ప్రభుత్వానికి వెయ్యి రూపాయలు ఫీజు చెల్లించాలి. మీ-సేవలో అదనంగా రూ.650 వసూలు చేస్తున్నారు. దీంతోపాటు ఈ మాడ్యూల్‌లోని అంశాలను సవరిం చాలంటే విడిగా వెయ్యి రూపాయలు చెల్లించాలి. ఎన్ని అంశాలను సవరించాలంటే అన్ని వేల రూపాయలు చెల్లించాల్సిందే. ఈ 11 అంశాల్లో పేరు, జెండర్, భూమి కేటగిరి, ఆధార్ నెంబర్, భూమి పట్టా, సీలింగ్, భూదాన్, అసైన్డ్ వంటివి తప్పుగా నమోదైతే సరిదిద్దాలి. భూమి వర్గీకరణ(మెట్ట, మాగాణి), భూమి రకం(ఏ రకంగా సంక్రమించిందో) వివరాలు, ల్యాండ్ ఎంజాయిమెంట్ (సొంతమా? వారసత్వమా? ఎవరు అనుభవిస్తున్నారు), పరిధి దిద్దుబాటు, వాస్తవ విస్తీర్ణం కన్నా పాస్‌బుక్‌లో తప్పుగా నమోదైతే చేయడం, మిస్సింగ్ సర్వే నెంబర్లు, పాసుపుస్తకంలో కనిపించని సర్వే నెంబర్లు తిరిగి రాయడం వంటివాటిని సరిచేయాలి. కానీ వీటిల్లో ఏదీ సరిగ్గా జరగడంలేదు.

2,65,653వివాదాలు...

ధరణి వెబ్‌సైట్ అమల్లోకొచ్చిన తర్వాత ప్రభుత్వం చేసిన లోపాలన్నీ ఒక్కొక్కటిగా బయటికొచ్చాయి. ఒక వ్యక్తి మరణించినా ఆయన పేరుమీద పట్టాదారు పాసు పుస్తకం వచ్చిందంటే ధరణి తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీనిపై 37,828 వివాదాలు ఉన్నాయి. పాసుపుస్తకంలో తక్కువ విస్తీర్ణం రాసినవి 45,803, ఎక్కువ విస్తీర్ణం ఉన్నట్టు రాసినవి 37,998 ఉన్నాయి. ఈ రెండు వివాదాల కారణంగా రైతుల మధ్య గొడవలు పెరుగుతున్నాయి. పట్టాదారు ఫొటో తప్పుగా ఉన్నవి 18,206, పేరు తప్పుగా ఉన్నవి 17,069 ఉన్నాయి. ఫొటో తీసేది, పేరు రాసే అధికారులు కావాలనే చేస్తున్నారనే విమర్శలులేకపోలేదు. ఒకే ఖాతాను రెండు సార్లు రాసినవి 34,815, సర్వేనెంబర్లు తప్పుగా ఉన్నవి 12,682, అటవీశాఖతో వివాదాలున్న భూములకు పాసుపుస్తకాలు జారీచేసినవి 10,879, వ్యవసాయేతర భూములకు పాసుపుస్తకాలు ఇచ్చినవి 7,431, అమ్ముకున్న అసైన్డ్ భూములకు పాసుపుస్తకాలు ఇచ్చినవి 4,116 ఇలా మొత్తం 2,65,653 వివాదాలు ఉన్నాయి. ఈ 11రకాల తప్పులు చేసిన అధికారులు వాటిని సరిదిద్దేపేరుతో క్షేత్రస్థాయిలో భారీగా డబ్బులు వసూలు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ వివాదాలు ఉన్న భూములు ఎక్కువగా భాగం అధికారపార్టీకి చెందిన నాయకుల అధీనంలో ఉండడంతోనే వీటి జోలికి వెళ్లడానికి అధికారులు సాహసించడంలేదనే ఆరోపణలూ ఉన్నాయి.

సబ్‌కమిటీ చేసిందేమిటి?

రెవెన్యూ అధికారులు తప్పులు చేశారు కానీ వాటిని సవరించే అధికారం కలెక్టర్, తహశీల్దార్ తమకులేదనడంతో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు, ఆందోళనలు చేసిన విషయం తెలిసిందే. వీటికి సంబంధించి ప్రభుత్వం ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో మంత్రులు జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి,ప్రశాంత్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్ సభ్యులుగా కేబినెట్ సబ్‌కమిటీ వేసింది. ఈ కమిటీ నాలుగు సార్లు సమావేశమైనా సమస్యలు పరిష్కారం కాలేదు. కొన్ని సంస్థలు, ప్రజాప్రతినిధులు, ప్రజలను విచారించిన కమిటీ 20రకాల లోపాలను గుర్తించింది.

వీటిని ఏడు మాడ్యూల్స్‌గా విభజించింది. పట్టాదారు పేరు, వివరాలు సరిచేయడం, మిస్సింగ్ సర్వే నెంబర్లను సరిచేయడం తదితర అంశాలను సరిచేయడానికి కలెక్టర్లకు బాధ్యత అప్పగించాలని సబ్‌కమిటీ సిఫార్సు చేసింది. మిస్సింగ్ సర్వే నెంబర్లకు సంబంధించి 34,666 ఫిర్యాదులు వచ్చినట్టు తెలిసింది. ఈ అంశానికి ప్రత్యేక మాడ్యూల్ రూపొందించాలని ప్రభుత్వానికి సూచించింది. భూ విస్తీర్ణం సరిచేయడానికి 16వేల ఫిర్యాదులు వచ్చాయి. బదిలీ నిషేధిత భూముల జాబితాలో పొరపాటుగా చేర్చిన సర్వేనెంబర్లకు సంబంధించి 1,00,902 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 84,949దరఖాస్తులను కలెక్టర్లు సవరించారు. 15,953 దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. సబ్‌కమిటీ చేసిన సిఫార్సులేవీ సరిగ్గా అమలుకు నోచుకోకపోవడంతో సమస్యలు ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగానే ఉన్నాయని రెవెన్యూ రంగ నిపుణులు చెబుతున్నారు.

మీడియా, వినోద రంగాల్లో భారీ పెట్టుబడులు

హైదరాబాద్‌లో వార్నర్ బ్రదర్స్

- డిస్కవరీ డెవలప్‌మెంట్ సెంటర్
- 1200 మందికి ఉపాధి అవకాశాలు
- న్యూయార్క్‌లో కేటీఆర్‌కు ఎన్ఆర్ఐల బృందం ఘనస్వాగతం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మీడియా, వినోద రంగానికి చెందిన ప్రఖ్యాత సంస్థ వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ తెలంగాణలో పెట్టుబడి పెట్టబోతుంది. హెచ్‌బీఓ, హెచ్‌బీఓ మ్యాక్స్, సీఎన్ఎన్, టీఎల్‌సీ, డిస్కవరీ, డిస్కవరీప్లస్, డబ్ల్యూబీ, యూరోస్పోర్ట్, యానిమల్ ప్లానెట్, కార్టూన్ నెట్‌వర్క్, సినిమాక్స్, పోగో, టూన్‌కార్ట్, హెచ్‌జీటీవీతో పాటు క్వెస్ట్ వంటి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన టెలివిజన్, ఫిల్మ్, స్ట్రీమింగ్, కంటెంట్ బ్రాండ్‌లు, ఫ్రాంచైజీలు వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ సంస్థకు చెందినవే. గేమింగ్, స్ట్రీమింగ్‌తో పాటు ఎంటర్ టైన్‌మెంట్ రంగంలో భారత మార్కెట్‌లో ఉన్న అపార అవకాశాలను అందిపుచ్చుకునే లక్ష్యంతో హైదరాబాద్‌లో డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటుచేసేందుకు వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ ముందుకొచ్చింది. అమెరికా పర్యటనలో ఉన్న ఐటీ మంత్రి కేటీఆర్‌తో వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (ఫైనాన్స్) అలెగ్జాండ్రా కార్టర్ సమావేశమయ్యారు. తమ విస్తరణ ప్రణాళికలపై చర్చించారు. ఇండియాలో తమ మార్కెట్‌ను సుస్థిరం చేసుకునే లక్ష్యంతో డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తామని అలెగ్జాండ్రా తెలిపారు. మొదటి సంవత్సరం 1200 మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. వ్యాపారం పెరిగేకొద్దీ మరింత మందికి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ పెట్టుబడి ప్రకటనపై మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ సంస్థకు ప్రభుత్వం తరుపున సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. అంతకుముందు న్యూయార్క్‌లోని జాన్ ఎఫ్ కెనడీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మంత్రి కేటీఆర్‌కు ఎన్ఆర్ఐల బృందం ఘనంగా స్వాగతం పలికింది.

క్యాన్సర్‌తో బాధపడుతున్న డిఫెన్స్ ఉద్యోగుల సంఘం నేత గోపాల్‌రావు

- పరామర్శించిన సీపీఐ(ఎం) నేత డీజీ నరసింహారావు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

డిఫెన్స్ ఉద్యోగుల సంఘం ఆలిండియా నాయకులు జీటీ గోపాల్‌రావు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. నాలికకు శస్త్ర చికిత్స చేసి 40శాతం తొలగించారు. ఆస్పత్రి నుంచి ఆయన డిశ్చార్జ్ అయి బడంగ్‌పేటలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. బుధవారం సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి.నరసింహారావు, పట్నం రాష్ట్ర నాయకులు ప్రసాద్, నాయకులు కిషోర్ ఆయన్ను పరామర్శించారు. డిఫెన్స్ ఉద్యోగిగా నాయకుడిగా ఉద్యోగుల సమస్యల కోసం నిరంతరం పోరాడారు. ఆయన తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

ఇండ్లస్థలాల కోసం నేడే మహాధర్నా

- మంత్రివర్గంలో నిర్ణయం తీసుకోవాలి :

టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బి.బసవపున్నయ్య



నవతెలంగాణ-హైదరాబాద్

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కేటాయింపు సమస్యను పరిష్కరించా లని డిమాండ్ చేస్తూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో గురువారం మహాధర్నా జరగనుంది. హైదరాబాద్‌లో ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి జర్న లిస్టులు హాజరవుతున్నారు. ఇందిరా పార్క్ దగ్గర ఉదయం 10 గంటలకు ప్రారంభమై సాయంత్రం నాలుగు గంటలవరకు ధర్నా నిర్వహించనున్నారు. దాదాపు 35 ఏండ్లుగా ఈ సమ స్య పెండింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో జర్నలిస్టులు భారీ సంఖ్యలో మహాధర్నాలో పాల్గొనాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బవవపున్నయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య మంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. గురువారం నిర్వహించే రాష్ట్రమంత్రివర్గ సమావేశంలో జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. హైదరాబాద్ తోపాటు జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేసే జర్నలి స్టులకు ఇండ్లస్థలాలు కేటాయించాలని సూచించారు. తెలంగాణ వచ్చిన తర్వాత జర్నలిస్టులకు సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలుకావడం లేదని వివరించారు. ఇండ్లస్థలం జర్నలిస్టుల తీరని కోరిక కాకూడదని అభిప్రాయ పడ్డారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఇండ్లస్థలాల సమస్యను పరిష్కరించాని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థుల చూపంతా సిటీపైనే...

- 33 జిల్లాల నుంచి నగరానికి రాక
- డిగ్రీలో 61 శాతం మంది హైదరాబాద్‌లోనే చదువు
- నిజాం, కోఠి, బేగంపేట, సిటీ కాలేజీల్లో చేరేందుకు ప్రాధాన్యం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యార్థుల్లో ఎక్కువ మంది హైదరాబాద్ మహానగరంలోనే చదివేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అది ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ వంటి వృత్తి విద్యా కోర్సులైనా, డిగ్రీ కోర్సులైనా విద్యార్థుల చూపంతా సిటీపైనే ఉన్నది. హైదరాబాద్‌లో 33 జిల్లాల నుంచి విద్యార్థులు వచ్చి చదువుతున్నారు. ఎక్కువ మంది విద్యార్థులు నిజాం కాలేజీ, కోఠి మహిళా కాలేజీ, బేగంపేట మహిళా కాలేజీ, సిటీ కాలేజీలో చేరేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. నిజాం కాలేజీలో 915 మంది చదువుతున్నారు. వారిలో రంగారెడ్డి జిల్లా నుంచి అత్యధికంగా 128 మంది ఉన్నారు. హైదరాబాద్‌కు చెందిన వారు 120 మంది, మేడ్చల్ నుంచి 63 మంది చదువుతున్నారు. అత్యల్పంగా హన్మకొండ, రాజన్న సిరిసిల్ల నుంచి నలుగురు చొప్పున, ములుగు నుంచి ఐదుగురు ఉన్నారు. కోఠి మహిళా కాలేజీలో 1,520 మంది ప్రవేశం పొందారు. వారిలో రంగారెడ్డి నుంచి 237 మంది, హైదరాబాద్ నుంచి 199 మంది, నల్లగొండ నుంచి 114 మంది చదువుతున్నారు. బేగంపేట మహిళా కాలేజీలో 1,294 మంది విద్యార్థులున్నారు. వారిలో హైదరాబాద్ నుంచి 352 మంది, మేడ్చల్ నుంచి 350 మంది ఉన్నారు. సిటీ కాలేజీలో 1,415 మంది చదువుతున్నారు. వారిలో రంగారెడ్డి జిల్లా నుంచి 304 మంది, నారాయణపేట్ నుంచి 147 మంది, హైదరాబాద్ నుంచి 117 మంది ఉన్నారు. హైదరాబాద్‌లో అయితే ఉన్నత విద్యావకాశాలు ఎక్కువగా ఉంటాయి. వాటితోపాటు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులు అందుబాటులో ఉంటాయి. దాంతోపాటు భవిష్యత్తు బాగుంటుందని ఇక్కడ చదివేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. హైదరాబాద్ మహానగరానికి అంతర్జాతీయ ఖ్యాతి ఉండడం, చదువు పూర్తయ్యాక ఉద్యోగావకాశాలు దొరకడం గమనార్హం. కంప్యూటర్ నైపుణ్యం పెంపొందించుకోవడంతోపాటు ఇంగ్లీష్ మాధ్యమంలో చదివేందుకు ఎక్కువ అవకాశాలుంటాయి. దేశీయ, అంతర్జాతీయ బహుళజాతి సంస్థలు కూడా ఇక్కడ ఉన్నాయి. వాటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌లో చదివేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇంకోవైపు ప్రభుత్వ, ప్రయివేటు కాలేజీల్లో రాష్ట్రంలో 2022-23 విద్యాసంవత్సరంలో 1,054 డిగ్రీ కాలేజీల్లో 3,85,573 సీట్లున్నాయి. వాటిలో 2,12,188 మంది చేరారు. అయితే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో 362 డిగ్రీ కాలేజీల్లో 1,43,739 సీట్లున్నాయి. వాటిలో 81,915 (56 శాతం) మంది విద్యార్థులు చదువుతున్నారు. 61,824 సీట్లు మిగిలాయి. ఇతర 30 జిల్లాల్లో 692 కాలేజీలుంటే 2,41,834 సీట్లున్నాయి. వాటిలో 1,30,273 (54 శాతం) మంది విద్యార్థులు చేరారు. ఇక్కడ 1,11,561 సీట్లు మిగిలాయి. హైదరాబాద్‌లోనే 174 కాలేజీల్లో 83,767 సీట్లుంటే, 51,346 (61 శాతం) మంది చదువుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో 104 కాలేజీల్లో 32,490 సీట్లకుగాను 16,664 (51 శాతం) మంది చేరారు. మేడ్చల్ మల్కాజిగిరిలో 84 కాలేజీల్లో 27,482 సీట్లుంటే, 13,905 (50 శాతం) మంది విద్యార్థులు చేరారు.

విద్యార్థుల భవిత కోసనే అనేక చర్యలు : లింబాద్రి

విద్యార్థుల భవిష్యత్తు కోసమే ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి చెప్పారు. అందులో భాగంగానే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్)ను ప్రవేశపెట్టి విద్యార్థులకు డిగ్రీ ప్రవేశాన్ని సులభతరం చేశామని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని అన్ని వర్సిటీల పరిధిలో సీట్లు పొందొచ్చని వివరించారు. హైదరాబాద్‌తోపాటు అన్ని జిల్లాల్లో కాలేజీల వారీగా తిరిగి దరఖాస్తు చేసే విధానానికి స్వస్తి పలికామని చెప్పారు.

ఇంకోవైపు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని కొత్త కోర్సులను డిగ్రీలో అందుబాటులోకి తెస్తున్నామన్నారు. బీఏ (ఆనర్స్), బీకాం (ఆనర్స్), బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ (ఆనర్స్) కోర్సులను ప్రవేశపెట్టామని గుర్తు చేశారు. ఇవన్నీ విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతగానో దోహదపడతాయని అన్నారు.

రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మెన్‌గా పిట్టల రవీందర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మెన్‌గా పిట్టల రవీందర్‌ను, వైస్ చైర్మెన్‌గా దీటీ మల్లయ్యను సీఎం కేసీఆర్ నియమించారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వారు ఆయా పదవుల్లో రెండేళ్లు కొనసాగుతారు.

సుస్థిర రవాణా దినోత్సవంగా నవంబరు 26 :యూఎన్

న్యూయార్క్ : నవంబరు 26వ తేదిని ప్రపంచ సుస్థిర రవాణా దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. రవాణా దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందిగా ఐక్యరాజ్య సమితి సభ్య దేశాలకు, అనుబంధ సంస్థలకు, ప్రాంతీయ, అంతర్జాతీయ సంస్థలకు, సివిల్ సొసైటీకి అందరినీ ఆహ్వానించింది.



వచ్చే ఐదేండ్లూ మండే కాలమే..ఐరాస

జెనీవా : 2023 నుంచి ఐదేండ్ల పాటు అంటే 2027 వరకు అత్యంత వేడిగా వుండే కాలంగా నమోదు కానుందని ఐక్యరాజ్య సమితి బుధవారం హెచ్చరించింది. కాలుష్య కారక వాయువులు, ఎల్‌నినో ప్రభావం ఈ రెండూ కలిసి ఉష్ణోగ్రతలను విపరీతంగా పెంచేస్తున్నాయని పేర్కొంది. పారిస్ వాతావరణ ఒప్పందాల్లో నిర్దేశించిన మరింత బృహత్తరమైన లక్ష్యాన్ని అంతర్జాతీయంగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు త్వరలోనే అధిగమించనున్నాయి. రాబోయే ఐదు సంవత్సరాల్లో ఒక సంవత్సరం కచ్చితంగా అలా వుంటుందనడానికి మూడింట రెండు వంతుల అవకాశాలు వున్నాయని ఐక్యరాజ్య సమితి వాతావరణ సంస్థ తెలిపింది. ఇప్పటివరకు నమోదైన 8 అత్యంత వేడిమి సంవత్సరాలు 2015-2022 మధ్యలోనే వున్నాయి. అయితే, వాతావరణ మార్పులు పెరుగుతుండడం వల్ల ఉష్ణోగ్రతలు కూడా విపరీతంగా పెరుగుతాయని అంచనా వేశారు.

నేడే ఎడ్‌సెట్

- 31,725 మంది దరఖాస్తు
- 49 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీఎడ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్-2023 రాతపరీక్ష గురువారం జరగనుంది. ఈ మేరకు ఎడ్‌సెట్ కన్వీనర్ ఎ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎడ్‌సెట్‌కు 31,725 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 49 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. గురువారం మూడు విడతల్లో ఈ పరీక్షను నిర్వహిస్తామని వివరించారు. ఉదయం తొమ్మిది నుంచి 11 వరకు మొదటి విడతకు 10,565 మంది, మధ్యాహ్నం 12.30 నుంచి 2.30 గంటల వరకు రెండో విడతకు 10,584 మంది, సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల వరకు మూడో విడతకు 10,576 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తారని తెలిపారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా దళిత బంధు

- బలగం సినిమా సింగర్లు మొగిలయ్య, కొమురమ్మలకు దళిత బంధు కారు పంపిణీ చేసిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దళితులకు అండగా కేసీఆర్ ప్రభుత్వం ఎల్లవేళలా ఉంటుందనీ, ఇందుకు నిదర్శనమే బలగం సినిమాలో పాటలు పాడిన పస్తం మొగిలయ్య, కొమురమ్మ దంపతులకు దళిత బంధు పథకం కింద కారు పంపిణీ చేయడమేనని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో కారును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ, మూడేండ్లలో దళితులందరికి దళిత బంధు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. మొగిలయ్య, కొమురమ్మ దంపతులు సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమకు అన్ని విధాలుగా అండగా నిలిచిన మంత్రులు హరీశ్ రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, పెద్ది సుదర్శన్ రెడ్డి, బేడ బుడగ జంగాల జెఏసి చైర్మన్ టి.జగదీశ్వర్, వైస్ చైర్మన్ చింతల యాదగిరిలకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే బేడ బుడగ జంగాల ప్రతినిధిగా చింతల యాదగిరికి తగిన పదవి ఇచ్చి, గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, పెద్ది సుదర్శన్ రెడ్డి, సుంకె రవిశంకర్, జోగినపల్లి శ్రీనివాసరావు, బేడ బుడగ జంగాల జేఏసీ చైర్మెన్ టి.జగదీశ్వర్, వైస్ చైర్మెన్ చింతల యాదగిరి, బేడ బుడగ జంగాల జేఏసీ నేతలు చింతల దశరథ, విభూది నర్సింహులు, తిరుపాటి రామదాసు, పర్వత మధు, గోపాల్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు పర్యవేక్షణకు

విజిలెన్స్ బృందాలు

తరుగు తీస్తే క్రిమినల్ కేసులు

- మిల్లర్ అక్నాలెడ్జ్ ఇవ్వకుండా జాప్యం చేస్తే జిల్లా మేనేజర్లపై చర్యలు
- రైతులకు అన్యాయం జరిగేలా మిల్లర్లకు సహకరిస్తే ఉపేక్షించేది లేదు
- పౌరసరఫరాల సంస్థ చైర్మెన్ సర్దార్ రవీందర్ సింగ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు వచ్చిన తర్వాత తాలు పేరుతో తరుగు తీయడం చట్ట విరుద్ధమని తేమ, తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులు పెడితే ఉపేక్షించేది లేదని పౌరసరఫరాల సంస్థ చైర్మెన్ సర్దార్ రవీందర్‌సింగ్ రైస్ మిల్లర్లను హెచ్చరించారు. రైతులను ఇబ్బందులకు గురిచేసి తరుగు పేరుతో కోత విధించే మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

క్షేత్రస్థాయిలో కొంత మంది అధికారుల నిర్లక్ష్యం వల్ల తరుగు సమస్య వస్తుందన్న ఫిర్యాదులపై ఆయన ఇప్పటికే జిల్లాల వారీగా నివేదికలు తెప్పించుకున్నారు. దీనిపై మాట్లాడుతూ అధికారుల అలసత్వం వల్ల రైతులు ఇబ్బందులకు గురైతే కఠిన చర్యలు తీసుకోవడానికి ఏమాత్రం వెనకాడబోమని హెచ్చరించారు. ధాన్యం కొనుగోళ్లపై ప్రొక్యూర్మెంట్, మార్కెటింగ్, ఫైనాన్స్ అధికారులతో బుధవారం సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పౌరసరఫరాల సంస్థ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి జిల్లాల్లో ఎంత ధాన్యం కొనుగోలు చేశారు? ఓపీఎంఎస్ ఎంత నమోదు చేశారు? రెండింటికీ మధ్య ఉన్న వ్యత్యాసాలు, ఓపిఎంఎస్ నమోదులో ఎదురవుతున్న సమస్యలు, ఆలస్యానికి గల కారణాలు, కొనుగోలు చేసిన ధాన్యంలో ఎంత ధాన్యం మిల్లులకు తరలించారు? ఏ ఏ మిల్లుల్లో మిల్లర్ అక్నాలెడ్జ్ సమస్య ఉంది?, సమస్య ఉన్న మిల్లులను విధిగా సందర్శించడం, చెల్లింపుల ఆలస్యానికి కారణాలపై విశ్లేషణ, చెల్లింపులను వేగవంతం చేయడానికి చేపడుతున్న చర్య లను ఈ బృందాలు ప్రధానంగా సమీక్షిస్తాయని తెలిపారు.

ధాన్యం కొనుగోలు వివరాలను మిల్లర్లు ట్రాక్ షీట్లో నమోదు చేయడంలో జాప్యం జరుగుతున్నదని రవీందర్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలనీ, అలాగే రైస్ మిల్లర్లు కూడా ధాన్యాన్ని వెంటనే దించుకుని వివరాలను ట్రాక్ షీట్లో నమోదు చేయాలని ఆదేశించారు.

ఈ విషయంలో ఎక్కడ జాప్యం జరిగినా దాని ప్రభావం మద్దతు ధర చెల్లింపులపై పడుతుందన్న విషయాన్ని గుర్తించి అధి కారులు పని చేయలని కోరారు. దించుకున్న ధాన్యానికి మిల్లర్ అక్నాలెడ్జ్ ఇవ్వకుండా జాప్యం చేస్తే దీనికి జిల్లా మేనేజరే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం ప్రతి కొనుగోలు కేంద్రంలో రైసు మిల్లర్ ప్రతినిధి ఖచ్చితంగా ఉండాలని ఆదేశించారు. తక్షణం రైసు మిల్లర్ ప్రతినిధి ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

25 రోజులకు చేరిన రెజ్లర్ల ఆందోళన

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

బీజేపీ ఎంపీ, రెజ్లింగ్ ఫెడరేషన్ అఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షులు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలనే డిమాండ్‌తో రెజ్లర్లు చేస్తున్న ఆందోళన బుధవారం 25వ రోజు పూర్తి చేసుకుంది. బుధవారం రెజ్లర్లు హనుమాన్ ఆలయాన్ని సందర్శించారు. బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేసేందుకు ప్రధాని నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షా సహాయం అందించాలని రెజ్లర్లు కోరారు. అలాగే, రెజ్లర్ల ఆందోళనకు మద్దతుగా ప్రముఖ కేధర్నాథ్ ఆలయం వద్ద యువ రెజ్లర్లు బ్యానర్ ప్రదర్శించారు. కాగా, ఆందోళన ప్రాంగణం జంతర్ మంతర్ సమీపంలోని హనుమాన్ ఆలయాన్ని సందర్శించడంతో తమ ఆందోళనను కొనసాగించారు. బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్న రెజ్లర్లు, బంగ్లా సాహిబ్ గురుద్వారాను కూడా సందర్శించారు.

ఎంపీ బ్రిజ్ భూషణ్

పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలి

- అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం అధ్యక్షవర్గ సభ్యులు డాక్టర్ దిడ్డి సుధాకర్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

దేశంలోని అగ్రశ్రేణి మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేసి, పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం అధ్యక్షవర్గ సభ్యులు డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. ప్రధాని మోడీ మౌనమే రేపిస్టులకు రక్షణ కల్పిస్తుందని, లైంగిక నేరస్థులకు ఆశ్రయం కల్పించి బీజేపీ నీచమైన చర్యలకు పాల్పడుతున్నదని విమర్శించారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నెల రోజులుగా నిరసన తెలుపుతున్న రెజ్లర్లులకు సంఘీభావంగా బుధవారం హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై అంబేద్కర్ విగ్రహం వద్ద ఏఐపీఎస్ఓ హైదరాబాద్ జిల్లా సమితి నిరసన ప్రదర్శన నిర్వహించింది. ఈ సందర్భంగా దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ.. లైంగిక హింసకు వ్యతిరేకంగా రెజ్లర్లు చేస్తున్న ఆందోళనను కేంద్రంలోని కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోతున్నదని, దేశ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మహిళా రెజ్లర్ల కన్నీళ్లను దేశం చూస్తుందని, దేశ ప్రజలు బీజేపీని క్షమించరని చెప్పారు. శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని, లేకుంటే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. సంఘం హైదరాబాద్ నగర కమిటీ ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్ మాట్లాడుతూ.. మహిళా రెజ్లర్ల సమస్యలపై ప్రధాని మోడీ స్పందించకపోవడం దారుణమన్నారు. లైంగిక బాధితులకు న్యాయం చేయకుండా.. తమ పార్టీలో ఉన్న నేరస్తులను బీజేపీ రక్షిస్తున్నదని విమర్శించారు. ప్రధాని మోడీ మౌనం వీడి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేసేందుకు ఢిల్లీ పోలీసులకు తక్షణమే ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సంఘం హైదరాబాద్ నగర కమిటీ అధ్యక్షులు గురుబచన్ సింగ్, మహమ్మద్ మాజీద్, రఘుపాల్, ఆఫీస్ బేరర్స్ సుధావన్, ప్రేమ్ పావని, మంజుశ్రీ, రాకేష్ సింగ్, రాములు యాదవ్, మాచుకూరి వేణు, గోవింద్, జావేద్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

కోరుకున్నది ఇది కాదు కదా...

ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన అంబేద్కర్ విగ్రహం.. నూతన సచివాలయానికి రాజ్యాంగ నిర్మాత పేరు... వీటిని ఘనతలుగా చెప్పుకుంటోంది బీఆర్ఎస్ సర్కార్. వాటిని మనం అంగీకరించాల్సిందే. హుస్సేన్ సాగర్‌లోని బుద్ధుడు సమాజానికి జ్ఞాన మార్గాన్ని ప్రసాదిస్తుంటే.. ఆయనకు సమీపంలోనే ఆకాశమంత

> సెక్రటేరియట్‌కు సందర్శకుల రాకపై సర్కారు త్వరలో తీసుకోబోతున్న మరో నిర్ణయం పైన చెప్పిన వారందరికీ ఆశనిపాతంలాంటిది. అదే డిజిటల్ పాసుల జారీ. క్యూఆర్ కోడ్‌తో ఉండే... ఆ పాసుల వల్ల ఎవరెవరు సచివాలయానికి ఎన్నిసార్లు వచ్చారు..? ఎవరెవర్ని ఎన్నిసార్లు కలిశారు..? అక్కడ ఎంతసేపు గడిపారనే సమాచారాన్ని నిక్షిప్తం చేయనున్నారని అధికారిక వర్గాల భోగట్టా. పైకి భద్రతా కారణాలను బూచిగా చూపుతున్నప్పటికీ... సమాచార సేకరణకు వీల్లేకుండా.. విషయాలు బయటకు పొక్కకుండా చేయటమే ఆయా పాసుల ముఖ్యోద్దేశం.

అంబేద్కరుడు.. ప్రజాస్వామ్య సౌధానికి ఊపిరిలూదే రాజ్యాంగ విలువల గురించి ప్రబోధిస్తున్నారంటూ రాష్ట్రాధినేత ఆ మధ్య వ్యాఖ్యానించారు. ఆయన మాటలను కాదనలేంగానీ వచ్చిన చిక్కల్లా నిత్యం అంబేద్కర్ నామ స్మరణ చేస్తున్న పాలనాధీశులు, ఆయన ఉద్బోధించిన భావ ప్రకటనా స్వేచ్ఛ, పారదర్శక పాలనకు పాతరేయటం.

ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే ఎన్నుకున్న ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్య ప్రభుత్వమంటారు. అలాంటి ప్రజాస్వామ్య దేశంలో ప్రజలెన్నుకున్న ప్రభుత్వానికి సర్వాధికారాలు ఉంటాయన్నది నిజమే అయినా... తన ఇష్టారీతిన, తనకు నచ్చిన పద్ధతుల్లో పాలన సాగిస్తామనటం సహేతుకం కాదు. పైగా ప్రజాధనంతో నిర్మించిన పరిపాలనా సౌధంలోకి ఇటు ప్రజలు,ప్రజా ప్రతినిధులు, ప్రతిపక్ష నేతలను, అటు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తున్న మీడియాను రానివ్వకపోవటం అత్యంత శోచనీయం. సెక్రటేరియట్‌కు సందర్శకుల రాకపై సర్కారు త్వరలో తీసుకోబోతున్న మరో నిర్ణయం పైన చెప్పిన వారందరికీ ఆశనిపాతంలాంటిది. అదే డిజిటల్ పాసుల జారీ. క్యూఆర్ కోడ్‌తో ఉండే... ఆ పాసుల వల్ల ఎవరెవరు సచివాలయానికి ఎన్నిసార్లు వచ్చారు..? ఎవరెవర్ని ఎన్నిసార్లు కలిశారు..? అక్కడ ఎంతసేపు గడిపారనే సమాచారాన్ని నిక్షిప్తం చేయనున్నారని అధికారిక వర్గాల భోగట్టా. పైకి భద్రతా కారణాలను బూచిగా చూపుతున్నప్పటికీ... సమాచార సేకరణకు వీల్లేకుండా.. విషయా లు బయటకు పొక్కకుండా చేయటమే ఆయా పాసుల ముఖ్యోద్దేశం. అలాంటప్పుడు ఇక భావ ప్రకటనా స్వేచ్ఛ ఎలా పరిఢవిల్లుతుందనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.




రాష్ట్ర సచివాలయ పరిస్థితి ఇలా ఉంటే.. గ్రామ సచివాలయాల్లోని దుస్థితి మరో రకంగా ఉంది. వాటిల్లో విధులు నిర్వర్తిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శు(జేపీఎస్)లు... తమ డిమాండ్ల సాధన, సమస్యల పరిష్కారం కోసం ఇటీవల సమ్మెబాట పట్టిన సంగతి విదితమే. వారి సమస్యలను పరిష్కరించటం ద్వారా సమ్మెను నివారించాలంటూ ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు కోరినా సర్కారు పట్టించుకోలేదు. పైగా సమ్మె విరమించక పోతే విధుల్లోంచి తొలగిస్తామంటూ ప్రభుత్వం హుకూం జారీ చేయటం గమనార్హం. ఈ క్రమంలో ఒక మహిళా జేపీఎస్ ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వాధినేత మనసు చలించకపోవటం ప్రజాందోళనలు, ఉద్యమాల పట్ల బీఆర్ఎస్ సర్కారు అనుసరిస్తున్న తీరుకు నిదర్శనం.

ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి ప్రభుత్వాలు ప్రజాందోళనల పట్ల కర్కశంగా, నిరంకుశంగా వ్యవహరించిన దాఖలాలు కోకొల్లలు. కానీ అవి ఏ రోజు కూడా ప్రతిపక్ష నేతలకు అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా చిన్న చూపు చూడలేదు. అప్పట్లో ముఖ్యమంత్రులు సైతం ప్రజా దర్బార్లు నడిపేవారు. వాటి ద్వారా సమస్యలు పరిష్కారమైనా కాకపోయినా ప్రభుత్వాధినేతకు తమ గోడు వినిపించామన్న తృప్తి జనాలకు దక్కేది. కానీ నేడు ఆ పరిస్థితి లేకపోవటం నిజంగా ఇబ్బందికరమే. తెలంగాణ అనేది ఆత్మగౌరవం మెండుగా ఉండే సమాజం. నాటి సాయుధ పోరాట కాలం నుంచి నేటి దాకా ఆ ఆత్మగౌరవ పతాక రెపరెపలాడుతూనే ఉంది.అనేక సందర్భాల్లో అది ప్రస్ఫుటమైంది. ఈ క్రమంలో ఘనత వహించిన 'తెలంగాణాధీశులు...' ఈ వాస్తవాన్ని గ్రహించాలి. ఉద్యమాల పట్ల ఉక్కుపాదం మోపటం, వాటిని చిన్న చూపు చూడటం, సమ్మెలు, ఆందోళనలు నిర్వహించే వారికి అల్టిమేటాలు జారీ చేయటం, సచివాలయంలోకి రానివ్వకపోవటాన్ని నియంతృత్వ చర్యలుగానే మనం భావించాల్సి ఉంటుంది. తెలంగాణ సమాజం వీటిని ఎప్పుడూ కోరుకోలేదు..మున్ముందు కోరుకోదు కూడా. అందువల్ల రాజ్యాంగం కల్పించిన అవకాశంతో, ప్రజాస్వామిక పద్ధతుల్లో తెలంగాణాను సాధించామని చెప్పుకుంటున్న 'అధినేతలు...' నిజమైన ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణానికి పూనుకోవాలి. అందులో భావ ప్రకటనా స్వేచ్ఛ పరిఢవిల్లాలి. అప్పుడే రాజ్యాంగ నిర్మాత లక్ష్యాలు నెరవేరుతాయి.

మరణం ఎరుగని విప్లవ సంకేతం హో-చిమిన్

హో చిమిన్ అంటే వియత్నాం విప్లవం. విప్లవ జీవితం తప్ప వ్యక్తిగత జీవితం లేని మహోన్నత విప్లవ నేత హోచిమిన్. 80 సంవత్సరముల పాటు ఫ్రాన్స్ వలస దేశంగా, అత్యంత క్రూరంగా పరిపాలించబడ్డ దేశం వియత్నాం. అభివృద్ధి లేదు. ప్రజలు కటిక దారిద్ర్యంలో, తీవ్రమైన వెనుకబాటు తనంతో మగ్గుతున్న వియత్నాంలో అనేక విప్లవ పోరాటాలు లేవనెత్తబడ్డాయి. కానీ, ఏది విజయం సాధించలేదు. ఆ విప్లవాల నాయకుల దేశభక్తి, సామ్రాజ్యవాద వ్యతిరేకత వారి అశేష త్యాగాలు అనేక కారణాల రీత్యా ఫలితాలను ఇవ్వలేదు. అటువంటి గడ్డమీద దేశభక్తితో ప్రారంభించి, ఆ దేశాన్ని విముక్తి చేయడమే గాక దానిని సోషలిస్టు రాజ్యంగా తీర్చిదిద్దిన ఘనత ఆయనది. 18వ శతాబ్దం నుండి పెట్టుబడిదారీ వ్యవస్థ భూస్వామ్య రాచరికంపై అనేక తిరుగుబాట్లు విప్లవాలు రేపింది. పెట్టుబడిదారీ వ్యవస్థ నిలదొక్కుకునే కొద్ది దాని అసాధారణ క్రూరత్వంపై కార్మికవర్గ తిరుగుబాట్లు, విప్లవాలు ప్రారంభమైనాయి. అటువంటి విప్లవాలు జరుగుతున్నాయి. జరుగుతాయి. విప్లవ పోరాటాలు విఫలమైనా లేక విజయం సాధించినా సమాజాన్ని ముందుకే నడిపిస్తాయని మానవ చరిత్ర పదేపదే చెబుతున్నది. ఆ విప్లవాలు ప్రజా నాయకులను, త్యాగధనులను ముందుకు తెస్తాయి. అటువంటి వారిలో అత్యున్నత స్థాయికి చెందిన అంతర్జాతీయ విప్లవ నేత హోచిమిన్. ఆయన జీవితం వెనుకబాటుతనంతో కునారిల్లే మనలాంటి సాంఘిక వ్యవస్థలున్న దేశాలలో సాంఘిక విప్లవాలను నిర్మిస్తున్న ప్రతి కార్యకర్తకి గొప్ప పాఠ్యాంశం అవుతుంది.



ఆర్. రఘు

వీర వియత్నాం విప్లవం

వియత్నాం విప్లవం ప్రధానంగా రెండు దశలుగా జరిగింది. మొదటిది, 1930 నుండి 1945 వరకు. 1945 ఆగస్టులో విప్లవం జయప్రదమై ఉత్తర వియత్నాంలో ప్రజాతంత్ర రిపబ్లిక్‌ను వియత్నాం వర్కర్స్ పార్టీ స్థాపించింది. 1945 నుండి 1969 వరకు దక్షిణ ఉత్తర వియత్నాంల ఏకీకరణ, వియ త్నాంలో సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం ప్రారంభం రెండవ దశ. 1945 ఆగస్టు విప్లవంతో 80 సంవత్సరముల ఫ్రెంచి పాలన అంతరించింది. వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ముఖ్యంగా కామ్రేడ్ హోచిమిన్ నాయకత్వం, అంతర్జాతీయ సంఘీభావాన్ని కూడగట్టడంలో ఆయన కృషి ఫలితంగా 1954 జెనీవా ఒప్పందం జరిగింది. దాని ప్రకారం వియత్నాం పునరేకీకరణకు 1956లో సాధారణ ఎన్నికలు జరపాలని నిర్ణయించడం జరిగింది. వీరోచిత వియత్నాం ప్రజల విప్లవ పోరాటంతో దద్దరిల్లిన ఫ్రెంచి సామ్రాజ్యవాదం వెనక్కి తగ్గింది. కానీ సామ్రాజ్యవాద శిబిర నాయకుడు అమెరికా దక్షిణ వియత్నాంని ఆక్రమించి ఏకీకరణకు విరుద్ధంగా, దక్షిణ వియత్నాంని సామ్రాజ్యవాద శిబిరంలో నిలబెట్టడానికి శతవిధాలా ప్రయత్నించింది. కానీ కామ్రేడ్ హోచిమిన్ అసాధారణ ప్రతిభ, మార్క్సిస్టు లెనినిస్టు అవగాహన ఫలితంగా వియత్నాంలో సోషలిస్టు వ్యవస్థ అభివృద్ధి చెందింది. దక్షిణ వియత్నాంలో సామ్రాజ్యవాద వ్యతిరేక గెరిల్లా, సాయుధ ప్రజల తిరుగుబాట్లు ఫలితంగా ఎట్టకేలకు అమెరికన్ సామ్రాజ్యవాదం 20సంవత్సరాల పాటు వియత్నాం ప్రజలపై అత్యంత పాశవిక దాడి జరిపినా దాని పెత్తనం సాధ్యం కాక 1968 నవంబర్ నెలలో చేతులు ఎత్తి పారిపోయింది. వియత్నాం ప్రజలు, సాయుధ బలగాలు "మన నేలపై ఒక్క దురాక్రమణదారుడు అయినా ఉన్నంతవరకు, వాడిని సైతం తుడిచి పెట్టేదాకా మనం పోరాడాల్సిందే" అన్న హోచిమిన్ ఆదేశాలను మనస్ఫూర్తిగా పాటించి అఖండ విజయం సాధించాయి. "యుద్ధాన్ని నిలబెట్టడానికి యుద్ధం" అన్న అమెరికన్ వ్యూహాన్ని కామ్రేడ్ హోచిమిన్ నాయకత్వాన వియత్నాం ప్రజలు చావుదెబ్బ కొట్టి అమెరికన్ సామ్రాజ్య వాదాన్ని ప్రపంచం ముందు శాశ్వతంగా దోషిగా నిలబెట్టారు.

వియత్నాం ప్రజల జీవన సంకేతం ఆయన


హోచిమిన్ 1890 మే 19న వియత్నాంలోని ఒక దేశభక్త, మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. ఆయన అసలు పేర్లు గుయన్ సిన్హ్ కంగ్ / గుయన్ ఐక్వాన్. తండ్రి ఉపాధ్యాయుడు. తల్లి వ్యవసాయం చూసేది. తండ్రి ఫ్రెంచ్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వియత్నాం విముక్తి కోసం పరితపించేవాడు. ఈ క్రమంలో నైతిక విలువల గురించి ప్రత్యేకంగా తన పిల్లలకు గట్టిగా బోధించే వాడు. బహుశా అందుకే హోచిమిన్ నైతికత మీద, దాన్ని మరింత అభివృద్ధి చేసి విప్లవ నైతికత అనే గొప్ప నూతన నినాదాన్ని రూపొందించాడు. 1918 మొదటి ప్రపంచ యుద్ధానంతరం గెలిచిన దేశాల కూటమి (ఇంగ్లాండ్, ఫ్రాన్స్, అమెరికా) వర్సైల్స్‌లో ప్రపంచం కళ్ళు గప్పడానికి, మానవాళికి వారు చేసిన ద్రోహాలను కప్పిపుచ్చుకోవడానికి శాంతి సభ నిర్వహించారు. దానికి హోచిమిన్ ఎనిమిది అంశాల లేఖ రాశాడు. ఫ్రాన్స్ తను పాలించే దేశాల ప్రజలకు తమ దేశ ప్రజలతో సమానత్వం ఇవ్వాలని కోరాడు. ఇది వియత్నాంలో సంచలనం సృష్టించింది. ఆ లేఖను "సిగ్నల్ షాట్" (రాబోయే పోరాటానికి మొదటి దెబ్బ)గా అనేక పత్రికలు పేర్కొనడం జరిగింది.

తన 21వ యేట ఆయన విదేశీ పర్యటనలు ప్రారంభించాడు. 1911లో ఒక ఫ్రెంచి నౌకలో 'బా' అనే పేరిట వంటవాడిగా చేరి ఫ్రాన్స్ చేరుకున్నాడు. మూడు సంవత్సరములు సీమన్‌గా పని చేశాడు. 1915-17 లండన్‌లో గడిపాడు. 2017-23 (6 సంవత్సరాలు) తిరిగి ఫ్రాన్స్‌లో ఉన్నాడు. తోటమాలిగా, స్వీపర్‌గా, వెయిటర్‌గా ఇలా ఎన్నో వృత్తులు చేస్తూనే ఫ్రెంచి సోషలిస్టు పార్టీలో చురు కుగా పాల్గొన్నారు. ఈ క్రమంలో ఆయన ఐదు ఖండాలు తిరిగాడు. వెళ్లిన ప్రతిచోట వియత్నాం దేశభక్తులను కూడదీస్తూనే ఆయా దేశాలలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, ప్రత్యేకించి ఫ్రెంచ్ సామ్రా జ్యవాదం వియత్నాం తదితర దక్షిణాసియా దేశాల్లో సాగిస్తున్న దమనకాండకు వ్యతిరేకంగా ప్రచారం సాగించాడు. 1930లో ఇండో చైనా కమ్యూనిస్టు పార్టీని ప్రారంభించాడు. 1945 నుండి 1969 వరకు వియత్నాం దేశాధ్యక్షుడిగా ఉన్నాడు.

విప్లవ నైతికత

ఆయన నడిపిన వీరోచిత పోరాటాలకి, ఈ మహత్తర విజయాలకు, ప్రధాన కారణం ఆయన విప్లవాత్మక కార్యాచరణకి, తన నిరాడంబర జీవితానికి, నిజాయితీకి ఉన్న ఐక్యతే. ఆరు దశాబ్దాలకు పైగా విదేశాలలో, స్వదేశంలో నడిచిన ఆయన జీవితం మొత్తంగా చూసినప్పుడు విప్లవకారుల లక్షణాలను ఆయన చెక్కుచెదరకుండా కాపాడుకోగలిగాడు. జైళ్లలో భయంకరమైన జీవితాన్ని గడుపుతున్న కాలంలో కాళ్లు చేతులు కట్టివేసిన దుర్భర దినాలలో సైతం ఆ విప్లవ మూర్తి అచంచలమైన మనో నిగ్రహంతోనే ప్రవర్తించాడు. ఆయనది నిరాడంబరమైన, నిష్కల్మషమైన జీవితం. అహోరాత్రులు పనిచేసేవాడు. తనకు తానుగా చేసుకోగలిగిన ఏ పనికీ ఆయన ఇతరుల సహాయం కోరేవాడు కాదు. తన వద్దనున్న సహాయకులను ట్రోంగ్, కీ, కాంగ్, దాంత్, లోయి వంటి పేర్లు పెట్టి పిలిచేవాడు. వీటన్నింటినీ కలిపి చదివితే 'శత్రువుకి

> అవినీతి, వృథా, అధికార నియంతృత్వం అనేవి ప్రభుత్వం, సైన్యం, ప్రజల యొక్క శత్రువులు. అని ఆయన పేర్కొన్నారు. అందువలన ప్రభుత్వం నుండి సాధారణ ప్రజా సంఘాలు, ప్రజల వరకు మొత్తం దేశం గానే విప్లవాన్ని నిలబెట్టుకోవాలంటే పై మూడు రుగ్మతలను పూర్తిగా వ్యతిరేకిస్తూ ఉండాలి అని ఆయన చేసిన బోధనలను వియత్నాం ప్రజలు నేటికీ పాటిస్తున్నారు. కరోనా మహమ్మారితో పెట్టుబడిదారీ ప్రపంచం అల్లాడి పోయినా సోషలిస్టు వియత్నాం ఆ మహమ్మారిని ఎదుర్కోవడంలో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది.



వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించే వియత్నాం ప్రజల వజ్ర సంకల్పం' అనే అర్థం వస్తుంది. హెూచిమిన్ తన తోటి సహచరుల పట్ల, దేశ ప్రజల పట్ల విపరీతమైన ఆదరాభిమానాలు చూపేవాడు. ప్రతి వ్యక్తికి పోరాటంలో పని అప్పగించడం, అతని పని విధానాన్ని, అతని జీవితాన్ని అభిమానంగా పరిశీలించేవాడు. మరో గొప్ప విషయం ఏమంటే, కార్యకర్తలకు గైడెన్స్ ఇవ్వడంలో, వారి పొరపాట్లను సరిదిద్దటంలో ఆయన అనురాగాన్ని ప్రదర్శించేవాడు. "ప్రజల అండ దండలు లేకుండా అత్యంత సులభమైన పని కూడా జరగదు. ప్రజల సహకారంతో అత్యంత కష్టమైన పనిని సైతం సాధించవచ్చు" అని చెప్పేవాడు. కృషి, పొదుపరితనం, నిజాయితీ, హుందాతనం, ప్రజాప్రయోజనాల కోసం అంకితం కావడం, సంపూర్ణమైన స్వార్థరాహిత్యంలను కలిపి ఆయన "విప్లవ నైతికత" అని చెప్పేవారు. విప్లవ సాధనలో కమ్యూనిస్టు నాయకులకు ప్రత్యేకించి విప్లవ నైతికత ఉండాలని, లేకుంటే విప్లవ సాధనలో అశేష జనబాహుళ్యాన్ని సమీకరించడం, పోరాటంలో నిలబెట్టడం, వారిని త్యాగాలకు సిద్ధం చేయడం, విజయ సాధనకు సంసిద్ధం చేయడం సాధ్యం కాదని ఆయన పదేపదే బోధిస్తూ ఉండేవాడు.

సోషలిస్టు నిర్మాణం

వియత్నాంలో సోషలిస్టు వ్యవస్థని నిర్మించడం కష్ట సాధ్యమైన విషయం. దశాబ్దాల సామ్రాజ్యవాద పాలనలో సర్వనాశనమైన ఆర్థిక వ్యవస్థ. వెనుకబాటుతనంతో ఉన్న ప్రజలు. ఓ పక్క సామ్రాజ్యవాదులతో పోరాడుతూనే ఉత్తర వియత్నాంలో సోషలిస్టు విప్లవ నిర్మాణం కోసం ప్రజలను స్వచ్ఛందంగా రంగంలోకి దించాడు. సోషలిజం మాత్రమే వందల సంవత్సరాల నికృష్టమైన జీవితాలను బాగుపరచగలదని, స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను ప్రసాదించ గలదని, వేగంగా అభివృద్ధి చెందగలుగుతామని ప్రజా బాహుళ్యాన్ని ఆయన ఒప్పించగలిగాడు. అందుకు ముందుగా ఓ బలమైన ప్రజా విప్లవ పార్టీని నిర్మించాడు. వియత్నాంలో ఉన్న అనేక సాంఘిక అంతరాలను అధిగమించే కృషి చేశాడు. ప్రత్యేకించి మహిళలను ఉద్యమాలలోకి, విప్లవంలోకి తీసుకు రాగలిగాడు. అధికారంలోకి వచ్చిన తరువాత ఆయన మొత్తం దేశానికి దిశా నిర్దేశం చేసే క్రమంలో మహిళలు విముక్తి కాకపోతే మనం సగం సోషలిజాన్నే నిర్మించినట్లు అవుతుందని ప్రకటించాడు. అలాగే మహిళలకు ఆయన "ప్రభుత్వం పార్టీ ఆదేశాలు ఇచ్చేవరకు ఆగకండి, మీ పోరాటం కొనసాగించండి. హక్కుల కోసం నిలబడండి" అని బోధించేవాడు. మహిళలకి సమానత్వం రావాలంటే మనదేశంలో నాలుగు అంశాల పైన చట్టం తేవాలని ఆయన పేర్కొన్న ఫలితంగా 1959లో ప్రభుత్వం చట్టం చేసింది. 1. పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్ల (అరేంజ్డ్ మ్యారేజెస్) అనే పద్ధతి రద్దు చేయడం. 2. బహుభార్యత్వాన్ని రద్దు. 3. సమాజంలోనే కాకుండా ఇంట్లో కూడా స్త్రీ పురుషుల సమానత్వాన్ని గుర్తించడం 4. మహిళల, పిల్లల హక్కులను గుర్తించడం. ఈ చట్టం వియత్నాం సాంఘిక పరిస్థితులను విప్లవాత్మకంగా మార్చింది.

అవినీతి, వృథా, అధికార నియంతృత్వం అనేవి ప్రభుత్వం, సైన్యం, ప్రజల యొక్క శత్రువులు. అని ఆయన పేర్కొన్నారు. అందువలన ప్రభుత్వం నుండి సాధారణ ప్రజా సంఘాలు, ప్రజల వరకు మొత్తం దేశంగానే విప్లవాన్ని నిలబెట్టుకోవాలంటే పై మూడు రుగ్మతలను పూర్తిగా వ్యతిరేకిస్తూ ఉండాలి అని ఆయన చేసిన బోధనలను వియత్నాం ప్రజలు నేటికీ పాటిస్తున్నారు. కరోనా మహమ్మారితో పెట్టుబడిదారీ ప్రపంచం అల్లాడి పోయినా సోషలిస్టు వియత్నాం ఆ మహమ్మారిని ఎదుర్కోవడంలో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది.

ఎల్ల కాలాలకూ ఆయన జీవితం ఆదర్శమే

హోచిమిన్ లేకున్నా ఈ సంక్షోభ కాలంలో కూడా ముందుకు పోతున్న వియత్నాం మన కళ్ళ ముందు ఉంది. వియత్నాం విప్లవ చరిత్ర మన ముందుంది. అత్యంత బలమైన అమెరికన్, ఫ్రెంచి సామ్రాజ్యవాద దేశాలని శతాబ్దంపైగా పోరాడి, మట్టి కరిపించిన ఆ దేశ చరిత్ర మన ముందుంది. వీటన్నింటికీ పూసల్లో దారంలా మహోన్నత విప్లవ నేత హోచిమిన్ విప్లవ జీవితం మన ముందుంది. విప్లవ కార్యాచరణకి, విప్లవ నైతికతకి మధ్యనుండే విడదీయరాని బంధాన్ని కామ్రేడ్ హోచిమిన్ జీవితం మనకి కళ్ళకి కట్టినట్టు చూపిస్తున్నది. అవినీతి, స్వార్థం, వ్యక్తిగత ప్రయోజనాలు, అసంబద్ధమైన పోటీ, వ్యక్తిగత హోదాలకై పాకులాడటం వంటి దోపిడీ వర్గ లక్షణాల ప్రభావం కార్మికోద్యమం మీద, విప్లవోద్యమాలమీద విస్తారంగా ప్రభావితం చూపుతున్న నేటి తరుణంలో వీటికి వ్యతిరేకంగా మనోధైర్యాన్ని కార్యకర్తలకు కల్పించడానికి వియత్నాం ప్రజల వీరోచిత విప్లవ పోరాట చరిత్రని, దాన్ని నడిపిన కామ్రేడ్ హోచిమిన్ జీవితాన్ని తెలియజెప్పటం, తెలుసుకోవడం నేడు అత్యవసరం.

(రేపు హోచిమిన్ 133వ జయంతి)

సెల్:9490098422



జర్నలిస్టుల చిరకాల స్వప్నం నెరవేరేనా!?

ఇల్లు. జర్నలిస్టులకు చిరకాల స్వప్నం. జీవితంలో స్థిరపడ్డారని చెప్పడానికి సాధారణంగా ఇంటినే గీటురాయిగా భావిస్తాం. పరస్పరం కలిసి కరచాలనం చేసే క్రమంలోనూ 'ఇల్లు' కట్టుకున్నావా? అని అడుగుతుంటారు. ఇది అందరికీ తెలిసిందే. ఉమ్మడి రాష్ట్రంతోపాటు తెలంగాణలోనూ జర్నలిస్టులకు ఇల్లు, ఇంటిస్థలం కలే అవుతున్నది. వచ్చే జూన్ రెండు నాటికి తెలంగాణ సాకారమై తొమ్మిదేండ్లు పూర్తవుతున్నది. కాగా తెలంగాణ జర్నలిస్టులు కట్టుకుని జీవనయానాన్ని కొంతలో కొంతైన కుటుంబంతో కలిసి సంతోషంగా ఉండాలని ఓ చిన్ని ఆశ. ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర ఎనలేనిది. మరువలేనిది. ప్రాణాలకు సైతం వెరవకుండా ప్రజల ఆకాంక్షను నిజం చేయడంలో పాత్రికేయుల సాహసం అంతా ఇంతా కాదు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండే మీడియా, జర్నలిస్టుల పట్ల ప్రభుత్వాలు ఆశించిన మేర ప్రేమాభిమానాలను కనపరచడం లేదు. కానీ రాష్ట్రంలోని జర్నలిస్టులకు నివాసం నేతిబీర చందమవుతున్నది. రాష్ట్రంలో దాదాపు 60వేల మందికిపైగా జర్నలిస్టులు ఉంటే, వారిలో సగం మందికి కూడా అక్రిడిటేషన్లు లేవు. వారి కుటుంబాలతో కలిసి లక్షన్నర జనాభా ఉంది. ఇందులో సగం మందికి అక్రిడిటేషన్లు లేవు. వారంతా ఇండ్లులేక ఆర్థిక భారాన్ని మోయాల్సి వస్తున్నది. ఇక చిన్న, మధ్యతరహా పత్రికల్లో పనిచేసే జర్నలిస్టుల పరిస్థితి వర్ణనాతీతం. ఉమ్మడి రాష్ట్రంలో మూడుసార్లు జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు కేటాయించారు. 1978, 1982, 1994లో దాదాపు 850మందికి అప్పటి ప్రభుత్వాలు జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చాయి. ఆ సమయంలో ఉన్న ప్రభుత్వాలకు ఫెడరేషన్ తరపున ధన్యవాదాలు. కాగా తెలంగాణ వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కొంతమేర ప్రయత్నం చేసినా అది ఫలించలేదు.



బి. బసవపున్నయ్య

అర్హులైన జర్నలిస్టులు వేలాది మంది కండ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. హైదరాబాద్ తోపాటు జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ఈపరిస్థితి నెలకొంది. సుప్రీంకోర్టులో కేసు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదేండ్లుగా కాలయాపన చేస్తున్నది. తీర్పు వచ్చాక మాత్రం చడీచప్పుడు చేయడం లేదు. జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇవ్వడానికి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయినా, సర్కారు కనీసం తన విధానాన్ని ప్రకటించలేదు. జర్నలిస్టుల అభివృద్ధి, సంక్షేమం కోసం దీర్ఘకాలికంగా పనిచేస్తున్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీబ్ల్యూజేఎఫ్) ఏండ్ల తరబడి ఇండ్లస్థలాల కోసం పోరాటాలు చేస్తున్నది. ఉద్యమాలు నిర్వహిస్తున్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ జర్నలిస్టుల ఇండ్లస్థలాల కోసం పలుసార్లు జర్నలిస్ట్ సంఘాలతో భేటి అయ్యారు. హైదరాబాద్ శివార్లల్లో స్థలాలు వెతికారు. మీడియా అకాడమీ ద్వారా అభిప్రాయ సేకరణ చేశారు. అయినా అడుగు ముందుకు పడటంలేదు. రాష్ట్రంలో అనేక జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీలు ఉన్నాయి. అందులో సభ్యత్వం ఉన్నవారు, లేని వారూ అనేక మంది జర్నలిస్టులు ఉన్నారు. మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో జర్నలిస్టులతోపాటు హైదరాబాద్‌లోని పాత్రికేయులకు ఇండ్లస్థలాలు కచ్చితంగా ప్రభుత్వం కేటాయించాల్సిందే. అర్హులకే ఇవ్వాలని కోరుతున్నాం. ఇందుకు సంబంధించి ప్రభుత్వం తన విధానాన్ని ప్రకటించాల్సిందే. ఇండ్ల స్థలాలు ఇవ్వాల్సిందే. ఈనేపథ్యంలో ఫెడరేషన్ గత రెండు నెలలుగా నాలుగు దశల కార్యక్రమాన్ని చేపట్టింది. తొలి దశలో నియోజకవర్గాలు, జిల్లా కేంద్రాల్లో జర్నలిస్టులతో సంతకాల సేతకరణ చేపట్టింది. రెండో దశలో స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతిపత్రలు అందజేసింది. మూడో దశలో జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ల ముందు రిలే దీక్షలు చేపట్టింది. నాలుగో దశలో హైదరాబాద్లో మహాధర్నా'కు పిలుపునిచ్చింది. ఇండ్లస్థలాలు వచ్చే వరకు ఫెడరేషన్ ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతూనే ఉంటాయి. ఇవి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాదు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని అమలుచేయాలని కోరుతున్నాం. జర్నలిస్టులకు అనుకూలంగా మాత్రమే. కోరి తెచ్చుకున్న తెలంగాణలో కూడా జర్నలిస్టులు న్యాయం కోసం ఎదురుచూడాల్సి రావడం ఆవేదనాభరితమే. ఈ నేపథ్యంలో ఈనెల 18న (గురువారం) హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జరిగే 'మహాధర్నా'లో జర్నలిస్టులు భారీ సంఖ్యలో పాల్గొనడం ద్వారా తమ ఆకాంక్షను ప్రభుత్వం దృష్టికి బలంగా తీసుకెళ్లేందుకు సహకరించాలి. రండి! కదలిరండి!! వందలాదిగా తరలిరండి!!! మన ఐక్యత, శక్తిని నిరూపించుకోవడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుదాం. చిరకాల స్వప్నాన్ని నిజం చేసుకుందాం.

సెల్:9490099108

మల్లయోధలకూ తప్పని హింసల పరంపర

'ఈ దుర్యోధన దుశ్శాసన దుర్వినీత లోకంలో' అన్న సినీ కవి వాక్కులు అధికార మదాంధులకు అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ సరిపోతాయి. ఢిల్లీ నడిరోడ్డు మీద, పార్లమెంటుకు కూతవేటు దూరంలో రోజుల తరబడి మల్ల 'యోధ'లైన యువతులు చేస్తున్న పోరాటం యావత్ దేశాన్ని కదిలిస్తోంది. మొత్తం సమాజం స్పందిస్తోంది. అంతర్జాతీయ సమాజం ఏం జరుగుతుందోనని పరిశీలిస్తోంది. కానీ కనీస స్పందన లేనిది అధికార మదాంధులకు మాత్రమే. 56 అంగుళాల ఛాతీని విరుచుకోవడం తెలిసిన నేతలకు దేశం పరువు నిలబెట్టిన యువతుల పరువు కాపాడాలన్న ఇంగిత జ్ఞానం, న్యాయం చేయాలన్న 'సోయి' మాత్రం లేకపోయింది. ఇది మన ఖర్మ అని సరిపెట్టుకోవాలా? లేక కౌరవసభలో మాన మర్యాదలు కోల్పోయిన ద్రౌపది రోదన కురువంశ వినాశనానికి దారితీసిన విధంగా వీళ్ళ పాపం పండిందన్న నిర్ధారణకు రావాలా?




ఎస్. పుణ్యవతి

ఇప్పటికి నాలుగు నెలల నుండి ఆందోళన సాగుతోంది. అత్యున్నత న్యాయస్థానం మెట్లు ఎక్కాక గాని కాస్త ఫైలు కదలలేదు. ఎందుకు అధినాయకుల్లో చలనం లేదు? రాతి గుండెలు అనుకోవాలా. అదే సాధారణ వ్యక్తులైతే చిన్న చిన్న నేరాలకు మక్కిలిరగ్గొట్టి, కేసులు పెట్టి, జైళ్లలో కుక్కి ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిప్పుతారు కదా! అధికార, అర్థ బలంతో బలిసిన వాళ్లకు ఒక న్యాయం, సాధారణ పౌరులకు ఒక న్యాయమా! ఇదా ప్రజాస్వామ్యం?

ఆడపిల్లలు తమపై జరిగే ఏ అన్యాయమైనా... అది లైంగిక హింస గాని, గృహహింస గాని... పరువు పోతుందనో, పిల్లలు ఉన్నారనో, కెరీర్ నాశనం అవుతుందనో రకరకాల కారణాలతో నోరు విప్పరు. విప్పేలా చెయ్యదు ఈ సమాజం. పైగా 'నోరు మూసుకో' అని గదమాయిస్తుంది. లేకపోతే మూసుకొనేలా చేస్తుంది. గదిలో పడేసి కొడితే పిల్లి కూడా తిరగబడుతుంది. న్యాయం దొరుకుతుందో లేదో నన్న అపనమ్మకం. భయం. ఆ భయంతోనే పడి ఉంటారు. భరించ లేకపోతే నుయ్యో గొయ్యో చూసుకోవడం మామూలే కదా. ఆ భయాలతోనే కదా ఇన్నాళ్లు పడి ఉన్నారు.

స్త్రీల మంచి కోసం ఎన్నో ఉద్యమాలు నడిచాయి, నడుస్తున్నాయి. మహిళలే ఉద్యమాలు చేసినా, మగవాళ్ళ నుండి, సమాజం నుండి కూడా మద్దతు దొరికింది, దొరుకుతోంది. ఫలితంగా ఆడవాళ్లు, ఆడపిల్లలు నోరు విప్పగలుగుతున్నారు. కొన్ని భయాలు, సందేహాలు ఉన్నప్పటికీ. 'న్యాయం దొరుకుతుందో లేదో చావో రేవో కానీ! ఏదైతే అది అయ్యిందిలే తీయి' అన్నలెక్కో.

ప్రస్తుతానికి వస్తే 'పోగాట్ సిస్టర్స్'లో ఒకరైన వినేష్ ప్రధానమంత్రికే విన్నవించుకున్నదట. అంతర్జాతీయ స్థాయిలో పథకాలు తెచ్చిన వాళ్ళం కదా! కష్టాలు చెప్పుకుంటే ప్రధానమంత్రి తీరుస్తారనుకుందేమో పాపం. రాజకీయ నాయకులు గురించి, అధికార బలం గురించి తెలియదు కదా! అందునా కుస్తీ పోటీల్లో ఉన్న ఆడపిల్ల కదా! కాస్త ధైర్యం ఎక్కువే కావచ్చు. కానీ లోకం తీరు తెలియని పిల్లలు. తీరా చూస్తే న్యాయానికి బదులు అదిరింపులు, బెదిరింపులు. అందరూ జంతర్ మంతర్ దగ్గర ధర్నాలు చేస్తున్నారు కదా! మనకి మాత్రం న్యాయం జరగకపోతుందా అనుకున్నారు. ఇప్పటికి నాలుగు నెలలు గడిచాయి. సీజన్ జీరో డిగ్రీల టెంపరేచర్ నుండి 40డిగ్రీల టెంపరేచర్‌కు మారింది. న్యాయం మాత్రం దొరకలేదు. ఇలా ఉంది ప్రభుత్వాల తీరు.



అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్లకే ఇలా ఉంటే ఇక సామాన్యుల మాట చెప్పాలా.

'బలుపు, కండకావరం' వంటి పదాలు పత్రికల్లో వాడటానికి కొంచెం ఇబ్బందిగా ఉంటుంది. స్త్రీల పట్ల అనుచితంగా ప్రవర్తించడం ఒళ్ళు బలిసినతనాన్నే సూచిస్తుందనుకోవాలి. స్త్రీలను లొంగ తీసుకోవడమే మగతనం అనుకునే ధోరణి సొసైటీలో పాతుకుపోయింది. ఇక ధన బలం, అధికార బలానికి సొసైటీలో పేరు ప్రతిష్టలు తోడైతే ఇంకా హద్దు పద్దు ఉండదు. లైంగిక దాడులు, ఆ పై హత్యలు, కిరసనాయిలు పోసి కాలబెట్టడాలు వంటివి టీవీల్లోనూ, పేపర్లలోను వచ్చినప్పుడు మాత్రమే గుండెలు బాదుకుంటాం. అయితే వాటికి మూలం ఎక్కడుంది? స్త్రీలను చూసే దృష్టిలోనే ఉందనేది అర్థం కావడం లేదు చాలామందికి. ఆ 'చాలా మందిలో' కుటుంబ సభ్యులు కూడా ఉంటున్నారు.

ఈ మధ్య ఒక వ్యాసం చదివాను. భారతదేశంలో ఆడవాళ్లకు పిన్నీసులు, పక్క పిన్నులే గొప్ప ఆయుధాలంట. నిజమే. ఒంటరిగానైనా, జంటగానైనా, రాత్రి గాని, పగలుగాని, బస్సులో గాని రైల్లో గాని ప్రయాణం చేసేటప్పుడు ముక్కు మొఖం తెలియని వాళ్ళ వేధింపులకు గురికాని ఆడదంటూ మన దేశంలో లేదేమో. అపరిచితుల స్పర్శకి ఉలిక్కిపడి లేవడం, పిన్నీసులు తీసి గుచ్చటం, గమ్యం చేరే దాకా పళ్ళ బిగువున కాలం గడపటం... ఇలా ఎన్నిసార్లని చెప్పాలి. నేను కూడా ఇందుకు మినహాయింపు కాదు.

ఇప్పటి విషయానికి వద్దాం. పొగాట్ సిస్టర్లుగా పేరుపొందిన బబిత పోఘాట్, గీత, రీతు, ప్రస్తుత పోరాటంలో ఉన్న సాక్షి, సంగీత, వినేష్ పోగాట్లు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించటం, అదే అంశంపై 'దంగల్' సినిమా రావడం అందరికీ తెలిసిందే. ఆ తరువాత హర్యానా, పశ్చిమ యూపీ వంటి ప్రాంతాల్లో, గ్రామాల్లో కూడా కుస్తీ నేర్పించే అకాడమీలు పెరిగాయి. కొన్ని వందల మంది మగపిల్లలతో పాటు ఆడపిల్లలు కూడా కుస్తీ నేర్చుకుంటున్నారు. తల్లిదండ్రుల ఇష్టంతో సంబంధం లేకుండా తాను ఇష్టపడ్డ వాడిని కులం గోత్రం చూడకుండా పెళ్లి చేసుకుందని కూతుర్ని, అల్లుడిని కుల దురహంకార హత్యలు చేయించే నేల మీదే ఆడపిల్లలు కుస్తీ నేర్చుకొని పతకాలు తేవడం గొప్ప విషయమే. అందరూ మెచ్చుకునేదే. అయితే ఈ పోటీల్లో పైకి రావడం మాత్రం తల్లిదండ్రులకు శక్తికి మించిన పని. ఉన్నదంతా కర్పూరంలా కరిగిస్తే గాని మధ్యతరగతి పిల్లలు ఆ స్థితికి రాలేరు. సాక్షి మాలిక్ తల్లి ఒక ఐసిడిఎస్ సూపర్‌వైజర్. ఈ స్థితిలో ఎన్నైనా ఓర్చుకొని కొనసాగడమా లేక తిరిగి ఇంటికి వెళ్లిపోవడమా అనేది ప్రశ్న.

ఆడపిల్లలపై వేధింపులు మామూలుగా చెప్పుకునేట్లు లేవు. శృతి మించి కంట్రోల్ తప్పిన స్థితిలోనే తెగించి జంతర్మంతర్ దారి పట్టారు. ఎంతకీ న్యాయం జరగకపోవడంతో సహజంగానే హర్యానా, పంజాబ్, పశ్చిమ యూపీ ప్రాంతాల్లో గ్రామీణ రైతు స్త్రీ పురుషులు కూడా తీవ్రంగా స్పందిస్తున్నారు. గ్రామాల నుండి స్త్రీ పురుషులు ప్రతిరోజు వందల సంఖ్యలో వచ్చి మద్దతు ఇస్తున్నారు. ఆడపిల్లల్ని అక్కున చేర్చుకొని ఆశీర్వదిస్తున్నారు. అలా సాక్షి , వినేష్‌లను వాత్సల్యంతో అక్కున చేర్చుకోవడం నేను ఎన్నోసార్లు చూశాను. కారణం ఈ సమస్య తమ కుటుంబాల్లో ఉన్న పిల్లల సమస్య కూడా కావడమేమో.

'తోటకూర నాడే చెప్పకపోయావా' అని తెలుగులో సామెత. కుటుంబం గానీ, తోటి వారు గానీ, సమాజం గానీ మొదలే స్పందించి ఉంటే, నాకెందుకనో పరువు పోతుందనో భయాన్ని పక్కనపెట్టి తల ఎత్తి నోరు తెరిచి ప్రశ్నించే తత్వాన్ని మన ఆడపిల్లలకు ఇచ్చి ఉన్నట్లయితే పరిస్థితి కొంత మెరుగ్గా ఉంటుందేమో. కోర్టులు ఎన్ని తీర్పులు ఇచ్చినా ఎన్ని మొట్టికాయలు వేసినా మారాల్సింది మన సంఘం తీరు. మన రాజకీయ నాయకుల తీరు. రాజకీయాలను, నాయకులను మనం చూసే తీరు. భ్రష్టు పట్టిన నాయకులకు ఎప్పుడైతే రొమ్ము విరుచుకొని, మీసాలు మెలేసి తిరగకుండా చెప్పులతో ఎప్పుడు సత్కారాలు దొరుకుతాయో అప్పుడే ఈ సమాజం బాగుపడేది. నాయకులను దేవుళ్ళుగా ఆరాధించినన్నాళ్లు, 56 అంగుళాల ఛాతీలు విరుచుకొని తిరగనిచ్చినన్నాళ్లు మన ఖర్మ ఇంతే.



కచ్చా మ్యాంగో ఐస్ కాండిల్

కావాల్సినవి : పచ్చిమామిడికాయ - ఒకటి, పుదీనా ఆకులు - రెండు టేబుల్ స్పూన్‌లు, బ్లాక్ సాల్ట్ - అర టీ స్పూన్, పంచదార - ముప్పావు కప్పు, కార్న్ ఫ్లోర్ - ఒక టేబుల్ స్పూన్, వెనీలా ఎసెన్స్ లేదా మ్యాంగో ఎసెన్స్ - కొద్దిగా, ఐస్ మౌల్డ్స్ బాక్స్, ఐస్ ఫ్రూట్ స్టిక్స్

తయారు చేసే విధానం : మామిడికాయ పైన ఉండే తొక్కను తీసేయాలి. చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసి (ఒక కప్పు ముక్కలు), మిక్సీ జార్‌లో వేసి రెండు స్పూన్‌ల పుదీనా ఆకులు, అర టీస్పూన్ బ్లాక్ సాల్ట్ వేసుకోవాలి. ఒకటిన్నర కప్పుల నీళ్ళను పోసి మెత్తని పేస్టులా చేయాలి. దీనిని పల్చని క్లాత్‌తో ఫిల్టర్ చేసుకోని జ్యూస్‌ను పక్కన పెట్టుకోవాలి. స్టవ్ మీద ఒక బౌల్ పెట్టి అందులో ముప్పావు కప్పు పంచదార వేసి, ఒక టీ స్పూన్ కార్న్ ఫ్లోర్ వేయాలి. ఇందులోనే వడకట్టి పెట్టుకున్న జ్యూస్‌ను కూడా పోసి స్టవ్ మంటను ఎడ్జస్ట్ చేసుకుంటూ పంచదార కరిగిన తర్వాత ఒక నిమిషం పాటు మరిగించాలి. ఇందులో చివరిగా పావు టీ స్పూన్ వెనీలా ఎసెన్స్‌ని లేదా మ్యాంగో ఎసెన్స్‌నిగాని కలపాలి. ఫుడ్ కలర్ ఇష్టపడే వారు రెండు లేదా మూడు చుక్కలు కలర్ కలుపుకోవచ్చు. ఈ మిశ్రమం పూర్తిగా చల్లారాక ఐస్ మౌల్డ్స్‌లోకి పోయాలి. అందులో ఐస్ ఫ్రూట్ స్టిక్స్ పెట్టి ఎనిమిది నుంచి పది గంటల వరకు డీప్ ఫ్రిజ్‌లో పెట్టాలి. తర్వాత కొంచెం ఐస్ మౌల్డ్స్‌ను వాటర్‌లో పెట్టి తీసేస్తే ఈజీగా ఐస్ కాండిల్స్ వచ్చేస్తాయి.



పండ్లలో రారాజు ఎవరంటే ఠక్కున చెప్పేయవచ్చు మామిడి అని... వేసవి కాలం వచ్చిందంటే మామిడి కాయలను, పండ్లను రుచి చూడని వారుండరు. పచ్చికాయలను, పండ్లను ఏదోక రూపంలో ఉపయోగిస్తూనే ఉంటారు. రోజూ ఒకే మాదిరిగా తీసుకునేకంటే కొంచెం వెరైటీగా టేస్టీగా మామిడిని చల్ల చల్లగా తీసుకుంటే రుచిని ఆస్వాదించడంతో పాటు, వేసవి తాపం నుంచి కాస్త ఉపశమనం కూడా పొందవచ్చు. చల్లగా వెరైటీగా చేసుకోగలిగే ఫ్రూటీలు ఈ వారం మీ కోసం...

యమ్మీ యమ్మీగా మ్యాంగో



మ్యాంగో ఫ్రూటీ

కావాల్సినవి : మామిడి పండు - 2, మామిడికాయ - 1, పంచదార - సరిపడ

తయారు చేసే విధానం : మామిడి కాయలను తొక్క తీసేసి ముక్కలుగా కట్ చేసుకోవాలి. అన్నింటిని ఒక బౌల్‌లో వేసి ఒకటిన్నర గ్లాసు నీళ్ళు పోసి మామిడిముక్కలు మెత్త పడే వరకూ మరిగించాలి. తర్వాత అందులో మిగిలిన నీటిని ఒక గిన్నెలోకి వంసేసుకోవాలి. ముక్కలు బాగా చల్లారాక మెత్తని పేస్టులా గ్రైండ్ చేయాలి. మామిడిముక్కల నుంచి వేరు చేసిన నీటిలోకి ఈ పేస్టును వడకట్టుకోవాలి. పీచు లాంటివి ఏమైనా వుంటే వేరవుతాయి. ఇందులో రెండు లేదా రెండున్నర గ్లాసుల నీళ్ళు కలుపుకోవాలి. మొత్తం బాగా కలిపి ఒక జార్‌లో పోసుకోవాలి. ఒక వేళ తీపి తగ్గినట్లనిపిస్తే సరిపడా పంచదార వేసి కొంచెం నీళ్ళల్లో మరిగించి ఈ మిశ్రమంలో కలుపుకోవచ్చు. దీనిని రెండు గంటలపాటు ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. తర్వాత గ్లాసుల్లో పోసుకుని సర్వ్ చేసుకుంటే సరిపోతుంది.



కచ్చా మ్యాంగో ఫ్రూటీ

కావాల్సినవి: పచ్చిమామిడి కాయలు - 2, పంచదార - పావుకిలో, నిమ్మ ఉప్పు - ఒక టీ స్పూన్

తయారు చేసే విధానం : మామిడికాయలు కడిగి, ప్రెషర్ కుక్కర్‌లో కాయలు మునిగే వరకు నీళ్ళు పోసి మూత పెట్టి 5 విజిల్స్ వచ్చే వరకూ ఉడికించాలి. మామిడికాయలు కాస్త చల్లారాక తొక్కు తీసేసి గుజ్జు మొత్తాన్ని మిక్సీ జార్‌లో వేసి మెత్తని పేస్టులా చేసుకోవాలి. ఒకవేళ గట్టిగా అనిపిస్తే మామిడికాయలు ఉడికించడానికి ఉపయోగించిన నీళ్ళను మిక్సీ పట్టేపుడు ఉపయోగించుకోవచ్చు. తర్వాత ఒక గిన్నెలో పావుకేజీ పంచదార తీసుకోని కొన్ని నీళ్ళు పోసి స్టవ్ మీద పెట్టి మరిగించాలి. పంచదార కరిగిన తర్వాత మిక్సీ పట్టిన మామిడికాయ పేస్టును పంచదార పాకంలో వేసి ఉండలు కట్టకుండా గరిటతో కలుపుతూ ఐదు నిమిషాలు మరిగించుకోవాలి. తర్వాత ఒక స్పూన్ నిమ్మ ఉప్పును అందులో కలుపుకోవాలి. మరికొంచెం సేపు మరిగించి దించి, చల్లారిన తర్వాత ఏదైనా బాటిల్లో పోసి ఫ్రిజ్‌లో పదిహేను రోజుల వరకు నిల్వ ఉంచుకోవచ్చు. కచ్చా ఫ్రూటీ రెడీ అయినట్లే... తాగాలనుకున్నప్పుడు ఒక గ్లాసులో సగం వరకు ఈ జ్యూస్‌ను పోసుకుని మిగిలిన సగం చల్లని నీటిని పోసి బాగా కలిపి తాగొచ్చు.

ఇంటిని చల్లగా ఉంచండిలా..

ఎండ వేడిని తట్టుకోవాలంటే ప్రతి ఇంట్లోనూ ఫ్యాన్, ఏసీ, కూలర్ వంటివి తప్పనిసరి అయ్యాయి. అందుకే ఈ సీజన్‌లో కరెంటు బిల్లు కూడా బాగానే వస్తుంది. అయినా ఆ చల్లదనం ఆరోగ్యానికి అంత మంచిది కూడా కాదు.. కానీ తప్పనిసరి... ఈ పరిస్థితి నుంచి ఉపశమనం పొందడానికి ఇంటిలో చిన్న చిన్న మార్పులు చేసుకుంటే ఇంటిని చల్లగా ఉంచుకోవచ్చు. కరెంటు బిల్లునూ తగ్గించుకోవచ్చు. ఇంటిని సహజంగా చల్లగా ఉంచడానికి ఈ చిట్కాలు ప్రభావవంతంగా ఉంటాయి. అవేంటంటే...



- టెర్రస్, బాల్కనీల్లో మొక్కలు నాటండి. తక్కువ మొక్కలు, చెట్లు ఉన్న ప్రదేశాల్లో వేడి ఎక్కువగా ఉంటుంది. అందుకే ఇంటి చుట్టూ వీలైనంత ఎక్కువగా మొక్కలు నాటండి.. చెట్లు పెంచండి.
- మొక్కను పెంచడానికి ఉపయోగించే నేల ఇంట్లోకి వచ్చే సూర్య కిరణాలను గ్రహిస్తుంది. దాని వల్ల ఇల్లు ఎక్కువ శాతం వేడిగా ఉండదు. దీనితో పాటు మొక్కలు, చెట్లు ఉన్న పరిసరాలలో వేడి గాలుల ప్రభావం అంతగా ఉండదు. వేడిని ఇంట్లోకి రానివ్వకుండా అవి అడ్డుకుంటాయి. దీని వల్ల ఇంట్లో ఉష్ణోగ్రత కూడా తగ్గుతుంది.
- ఇంట్లో ఉపయోగించే కర్టెన్లు దుమ్మును ఇంట్లోకి రానివ్వకుండా ఆపడంతో పాటు, వేడిగాలు ఇంట్లోకి రానివ్వకుండా అడ్డుకుంటాయి. అయితే మామూలు కరెన్లకు బదులుగా వెదురు కర్టెన్లు ఉపయోగించాలి. ఇవి ఇంటిని చల్లగా ఉంచడంతో పాటు అందాన్ని కూడా పెంచుతాయి. వెదురు కర్టెన్లు ఉపయోగించే అవకాశం లేని పక్షంలో ముదురు రంగు కర్టెన్లనైనా ఉపయోగించవచ్చు.
- సూర్యోదయం అయిన కొంత సేపటి వరకు, సూర్యాస్తమయం అయిన తర్వాత కిటికీలు, తలుపులు తెరిచి ఉంచాలి. వేసవిలో సహజమైన చల్లని గాలి ఇంట్లోకి వచ్చేలా, ఇంటిని వీలైనంత వరకు తెరిచి ఉంచడం వల్ల ఇంటిలోపలి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. ఫలితంగా కూలర్ ఉపయోగించాల్సిన అవసరం ఉండదు.
- ఈ రోజుల్లో ప్రతి దానికి విద్యుత్ వస్తువుల వినియోగం బాగా పెరిగిపోయింది. ఉదాహరణకు వాషింగ్ మెషీన్, వాషింగ్ మెషీన్ డ్రయర్, ఓవెన్ వంటి వాటి వాడకం తగ్గించుకోవాలి. ఎందుకంటే ఈ వస్తువులు వేడిని ఎక్కువగా విడుదల చేస్తాయి.
- ఇంటిలో వస్తువులను చిందరవందరగా ఉంచకండి. ఇలా ఉంచడం వల్ల వేడి పెరుగుతుంది. ఇల్లంతా శుభ్రంగా సర్దుకుంటే ఎక్కువ ఖాళీ స్థలం ఏర్పడుతుంది. ఇల్లు ఎంత ఖాళీగా ఉంటే అంత చల్లదనంగా ఉన్న భావన కలుగుతుంది.
- సీలింగ్‌కు వైట్‌వాష్ ఉపయోగించడం ద్వారా ఇంటి లోపల చల్లగా ఉంటుంది. అవకాశం ఉంటే పైకప్పుపై తెల్లటి సున్నంతో పెయింట్ చేయించుకుంటే చల్లగా ఉంటుంది.

ఇలాంటి చిన్న చిన్న చిట్కాలు పాటిస్తే ఈ వేసవిలో ఇంటిని చల్లగా ఉంచుకోవచ్చు.

మట్టి కుండలోని నీటిని తాగితే?

ప్రతి ఇంట్లో ఫ్రిడ్జ్ ఉండటం సర్వసాధారణం.. అయితే ఉంది కదా అని విరివిగా వాడటం కూడా ఆరోగ్యానికి శ్రేయష్కరం కాదు. అందులో ఈ వేసవిలో ప్రతి ఒక్కరూ చల్లని నీటిని తాగాలనే ఆరాటపడుతుంటారు. అవి ఫ్రిడ్జ్ లో పెట్టిన నీరు అయితే మాత్రం ఆరోగ్యాన్ని చేజేతులారా సమస్యల్లో నెట్టుకున్నట్లే.. దానికి బదులుగా కుండలో నీటిని తాగితే ఎంతో ఆరోగ్యకరం అని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అందుకే చల్లని నీటి కోసం మట్టి కుండను ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకుందాం..



పీహెచ్ సమతుల్యత : మట్టి కుండలో నీటిని నిల్వ చేయడం వల్ల నీరు సహజంగా చల్లబడుతుంది. బంకమట్టి ఆల్కలీన్ స్వభావం కలిగి ఉండటంతో ఇది ఆమ్ల ఆహారాలతో సంకర్షణ చెందుతుంది. బంకమట్టి కుండలోని నీటి పీహెచ్‌ను సమతుల్యం చేస్తుంది. తద్వారా ఎసిడిటీ, గ్యాస్ట్రిక్ సంబంధిత సమస్యను దూరం అవుతాయి.

ఖనిజాలు : మట్టి కుండలో నిల్వ ఉంచిన నీటిలో ఖనిజాలు, పోషకాలు చెక్కుచెదరకుండా ఉంటాయి. ఈ నీటిలో ఎలాంటి రసాయనాలు ఉండవు. ప్రతిరోజూ కుండ నీటిని తాగితే జీవక్రియ పెరుగుతుంది. మట్టి కుండ నీరు వడదెబ్బను ఎదుర్కోవడంలో సహాయపడుతుంది. ఈ నీటిని తాగడం వల్ల గొంతు సంబంధిత సమస్యలు కూడా దరిచేరవు.

ఎండలకు సలసల

(మొదటిపేజీ తరువాయి)

ఏసీలు మెండికేస్తున్నాయి. తక్కువ స్పీడ్‌లోనే చల్లని గాలులు వీచే బ్రాండెడ్ కంపెనీ విద్యుత్ పరికరాలు కూడా ఎండ తీవ్రతకు మూలుగుతున్నాయి. దాంతో ఇంట్లో ఉన్న వారికి కూడా వేసవి భానుడి తాపానికి గురికాక తప్పడం లేదు. చంటి బిడ్డలు, వయో వృద్ధులు ఎండ వేడికి తట్టుకోలేక పోతున్నారు. కొన్ని పట్టణాల్లో సెల్ టవర్స్‌లో మంటలు చెలరేగుతున్నాయి.

నిర్మానుషంగా రోడ్లు.. జంకుతున్న జనం..!

ఎండ భయంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. దినసరి కార్యక్రమాలు చేసుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8 గంటలకే ఎండ తీవ్రత పెరగడంతో ప్రజలు బయట పనులు ముగించుకొని ఇండ్లకే పరిమితం అవుతున్నారు. మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుషంగా కనిపిస్తున్నాయి. చిరు వ్యాపారులు, మధ్యతరగతి వ్యాపార సముదాయాల షాపులు మూసివేసి సాయంత్రం తిరిగి ప్రారంభిస్తున్న తీరు కనిపిస్తుంది. కొబ్బరి బొండాలు, తాటి ముంజలు, జ్యూస్, ఇతర శీతలపానీయాల జోరు తీవ్రంగా ఉంది. రాత్రి వేళల్లో మాత్రమే షాపింగ్ చేయడానికి సిద్ధం అవుతున్నారు.

వడదెబ్బకు గురై నలుగురు మృతి

(మొదటిపేజీ తరువాయి)

సీతారాం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తండా వాసులు కోరుతున్నారు.

బయ్యారం మండలం రామచంద్రపురం గ్రామ పంచాయతీ చింతోని గుంపు గ్రామానికి చెందిన జోగా ఉపేంద్ర(38) వారం రోజులుగా తునికాకు సేకరణకు వెళ్లిన క్రమంలో ఎండ దెబ్బకు గురైంది. దాంతో మహబూబాబాద్‌లోని ప్రయివేటు హాస్పిటల్‌కు తీసుకువెళ్లగా.. వరంగల్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతిచెందారు.

తొర్రూర్ మండలం గుర్తూరు గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తుడు పెసర రాజు (30) గ్రామంలోని పెద్ద చెరువులో చేపల వేటకు వెళ్లిన క్రమంలో వడదెబ్బ తగలడంతో సొమ్మసిల్లి కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన తొర్రూరులోని ప్రయివేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించారు. మృతునికి భార్య శిరీష, ఇద్దరు కుమారులు, తల్లి యాకమ్మ ఉన్నారు.

మెదక్ జిల్లా నార్సింగి మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన మ్యాదరి బాలమణి (46) ఉపాధి హామీ పనులకు వెళ్లింది. పని చేస్తూనే నీరసంగా అనిపించినా.. పనిచేసి ఇంటికి తిరిగి వచ్చాక తీవ్ర అస్వస్థతకు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు.. వెంటనే బాలమణిని చికిత్స కోసం నార్సింగి పట్టణ కేంద్రంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది.

పేదల నివాసాలను క్రమబద్ధీకరించాలి

(మొదటిపేజీ తరువాయి)

సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ భూముల్లో ఉన్న పేదల ఇండ్లను క్రమబద్ధీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో 58 అమలు చేస్తున్నదన్నారు. కొందరు మురికివాడల ప్రజలు 2015లో ఈ క్రమబద్ధీకరణతో ఇండ్ల పట్టాలు పొందారని గుర్తుచేశారు. ప్రస్తుతం అనేక మంది క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని తెలిపారు. అయితే, నగరంలోని కొన్ని మురికివాడలు కంటోన్మెంట్, కేంద్ర ప్రభుత్వ సంస్థలకు చెందిన స్థలాల్లో ఏర్పడగా.. వేలాది పేద కుటుంబాలు ఈ బస్తీల్లో నివాసముంటున్నాయని పేర్కొన్నారు. దశాబ్దాలుగా నివసిస్తున్నప్పటికీ వీరికి ఇంటి స్థలం మీద ఎలాంటి హక్కులూ కల్పించడం లేదన్నారు. అనేక మురికివాడలు కంటోన్మెంట్, రైల్వే, రక్షణ, ఎయిర్‌పోర్ట్ ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థల భూముల్లో ఉన్నాయన్నారు. ఈ బస్తీల్లోని పేదల ఇండ్లను సైతం జీవో 58 మాదిరిగా క్రమబద్ధీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. రైల్వే శాఖకు చెందిన వందల ఎకరాల భూములను దీర్ఘకాలిక లీజ్ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం చౌకగా కట్టబెడుతోందన్నారు. పేదలు దశాబ్దాలుగా నివసిస్తున్నా వారికి హక్కు కల్పించకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల భూముల్లో ఏర్పడిన బస్తీలు, కాలనీల స్థలాన్ని అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించి క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించాలని మంత్రిని కోరారు.

సందిగ్ధంలో కర్నాటకం

(మొదటిపేజీ తరువాయి)

శివకుమార్‌లు చెరో రెండున్నరేండ్లు ముఖ్యమంత్రి పదవిని నిర్వహిస్తారన్న వార్తలు వస్తున్నాయి. శివకుమార్ ప్రస్తుతం ప్రభుత్వంలో చేరరు. కానీ పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతారు. అయితే అధికారాన్ని పంచుకునే విషయంపై స్పష్టమైన హామీ ఇవ్వాలని ఆయన పట్టుబడుతున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో మెజారిటీ సభ్యులు సిద్ధరామయ్యకే మద్దతు ఇస్తున్నారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. అయితే కాంగ్రెస్ విజయానికి ఎనలేని కృషి చేసిన శివకుమార్‌కు న్యాయం చేయాలని మరికొందరు నేతలు కోరుతున్నారు. మరో సమాచారం ప్రకారం శివకుమార్ కేబినెట్‌లో చేరతారని, కీలక మంత్రిత్వ శాఖలు చేపడతారని తెలుస్తోంది. నూతన ముఖ్యమంత్రి గురువారం ప్రమాణస్వీకారం చేస్తారని సమాచారం.

ఉప ముఖ్యమంత్రులుగా ఎంబీ పాటిల్ (లింగాయత్), జీ పరమేశ్వర (దళితుడు), యూటీ ఖాదర్ (ముస్లిం)లను నియమిస్తారని సమాచారం. కర్నాటక ముఖ్యమంత్రి పీఠంపై బుధవారం రోజంతా దేశ రాజధానిలో హైడ్రామా నడిచింది. ఈ పదవి కోసం పోటీ పడుతున్న సిద్ధరామయ్య, శివకుమార్‌లు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో సమావేశమై తమ వాదనలు వినిపించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో కూడా వారు చర్చలు జరిపారు. ఖర్గేతో సమాలోచనల అనంతరం శివకుమార్ తన సోదరుడు డీకే సురేష్ నివాసంలో మద్దతుదారులైన ఎమ్మెల్యేలు, ఇతర నేతలతో మంతనాలు సాగించారు.

సిద్ధరామయ్య వైపే కాంగ్రెస్ అధిష్టానం మొగ్గు చూపిందంటూ మీడియాలో వచ్చిన వార్తలతో శివకుమార్ మద్దతుదారులు తీవ్ర ఆశాభంగానికి గురయ్యారు. వారు నిరసనలకు దిగుతారేమోనన్న అనుమానంతో పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా భద్రతను పెంచారు. ఖర్గేతో చర్చల తర్వాత విలేకరులతో ముచ్చటించకుండానే డీకే వెళ్లిపోయారు. కాగా ఇంకా సంప్రదింపులు కొనసాగుతూనే ఉన్నాయని కాంగ్రెస్ నేత రణదీప్ సుర్జేవాలా చెప్పారు. మరోవైపు సిద్ధరామయ్య మద్దతుదారులు ఆయన చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. బెంగళూరులోని ఆయన నివాసానికి పెద్ద ఎత్తున కార్యకర్తలు చేరుకొని బాణసంచా పేలుస్తూ, నృత్యాలు చేశారు. తదుపరి ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య నియమితులయ్యారని వార్తలు రావడంతో ఆయన నివాసం వద్ద భద్రతను మరింత పెంచారు.

ముఖ్యమంత్రి పేరును కాంగ్రెస్ అధిష్టానం అధికారికంగా ఖరారు చేయకపోవడంపై ఆపద్ధర్మ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై వ్యంగ్యోక్తులు విసిరారు. ఆ పార్టీలో అంతర్గత పరిస్థితికి ఇది అద్దం పడుతోందని ఆయన వ్యాఖ్యానించారు.

కాగా అక్రమాస్తుల కేసులో శివకుమార్‌కు సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట లభించింది. శివకుమార్‌పై చేపట్టిన దర్యాప్తుపై కర్నాటక హైకోర్టు గతంలో మధ్యంతర స్టే మంజూరు చేసిన విషయం తెలిసిందే. దీనిని సవాలు చేస్తూ సీబీఐ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. దీనిపై విచారణను సుప్రీంకోర్టు జూలై 14వ తేదీకి వాయిదా వేసింది.

ఇంటర్ ఉద్యోగులకు బదిలీలు చేపట్టాలి : టిప్స్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్మీడియట్ విద్యలో ఉద్యోగులకు బదిలీలు చేపట్టాలని తెలంగాణ ఇంటర్ విద్యా పరిరక్షణ సమితి (టిప్స్) రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు టిప్స్ కన్వీనర్ మాచర్ల రామకృష్ణగౌడ్, సమన్వయకర్త మైలారం జంగయ్య, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్, నాయకులు శోభన్ బాబు, మంజునాయక్, బీక్యా నాయక్, వస్కుల శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, మనోహర్, సంగీత బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల (జూనియర్ అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు, లైబ్రరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లు, కార్యాలయ సిబ్బంది)కి గత ఐదేండ్లుగా సాధారణ బదిలీలు లేకపోవడం వల్ల తీవ్ర మానసిక, ఆర్థిక, శారీరక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రస్తుతం విద్యా వ్యవస్థకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని పేర్కొన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్ని ఆటంకాలు ఎదురైనా కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకుల సర్వీస్‌లను క్రమబద్ధీకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తక్షణమే సీఎం కేసీఆర్ ఇంటర్మీడియట్ విద్యలో సాధారణ బదిలీలు జరిపేందుకు ఆదేశాలివ్వాలని, విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల్లో ఉన్న కొంత మానసిక ఆందోళనను తొలిగించి ప్రశాంతత కలిగించాలని విజ్ఞప్తి చేశారు.

పల్నాడులో ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

వద్ద జరిగిన ప్రమాదంలో నల్లగొండ జిల్లా దామరచర్ల మండలానికి చెందిన ఆరుగురు కూలీలు అక్కడికక్కడే మృతిచెందారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. దామరచర్ల మండలం నర్సాపురం గ్రామానికి చెందిన 20 మంది మహిళాకూలీలు పల్నాడు జిల్లా గురుజాల మండలం పులిపాడు గ్రామంలో మిరపకాయలు ఏరడానికి వెళ్లారు. బుధవారం తెల్లవారుజామున ఆటో పులిపాడు బయల్దేరింది. ఆంధ్రా ప్రాంతం లోని పొందుగుల వద్ద ముందు నుంచి లారీ అతి వేగంతో ఢీకొంది. దీంతో ఆటోలో ఉన్న ఇస్లావత్ మంజుల (26), భూక్యా పద్మ (28) మాలోతు కవిత (30), ఇస్లావాత్ పార్వతి (44), భూక్యా సోని (48), వద్య సక్రి (49) అక్కడికక్కడే మృతిచెందారు. గాయపడిన వారిని మిర్యాలగూడ ఏరియా వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గురజాల ప్రభుత్వ వైద్యశాలకు పంపించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ప్రమాదం విషయం తెలుసుకున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు వెంటనే వెళ్లి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి 10 వేల రూపాయల చొప్పున బాధిత కుటుంబాలకు అందజేశారు. ఆయన వెంట డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ డి.నారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఏ.లలిత హాతిరాం నాయక్, రైతు బంధు నల్లగొండ జిల్లా కమిటీ మెంబర్ వీరకోటిరెడ్డి, ఎంపీటీసీ బాలలక్ష్మి సత్యనారాయణ, పాచు నాయక్ తదితరులున్నారు.

సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి

ప్రమాదంపై సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతిచెందిన వారికి సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావును సీఎం కేసీఆర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి వైద్య సేవలపై ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తున్నారు.

బాధితులకు జూలకంటి పరామర్శ

ఒక్కో కుటుంబానికి రూ.5 వేలు అందజేత

కూలీల కుటుంబాలను నర్సాపురం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పరామర్శించారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆరుగురి కుటుంబాలకు రూ.60 వేల సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమైందని.. ఈ ఘటనకు అదే కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో మంది పేదలు పొట్ట చేతబట్టుకొని ఇతర ప్రాంతాలకు పనుల కోసం వెళ్తున్నట్టు చెప్పారు. పల్నాడు జిల్లా పులిపాడులో మిర్చి ఏరేందుకు కూలీలు ఆటోలో వెళ్తుండగా లారీ ఢీకొనడంతో ఆరుగురు కూలీలు ప్రాణం కోల్పోయారని విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ అవకాశం కలిపించడంతోపాటు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. వారి పిల్లలకు పీజీ వరకు ఉచిత విద్యను అందించాలన్నారు. ఆయన వెంట సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు వీరెల్లి వెంకటేశ్వర్లు, రావు నాయక్, పాపానాయక్, మండల కార్యదర్శి వినోద్ ఉన్నారు.

రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి:సీఎం కేసీఆర్‌కు జూలకంటి లేఖ

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గం దామరచర్ల మండలం నర్సాపురం గ్రామానికి చెందిన మహిళా కూలీల ఆటోను లారీ ఢీకొట్టిన ఘటనలో ఆరుగురు మరణించారని, తొమ్మిది మందికి గాయాలయ్యాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తెలిపారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.పది లక్షలు, గాయపడిన వారికి రూ.ఐదు లక్షలు ఎక్స్‌గ్రేషియాతోపాటు ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు ఆయన బుధవారం లేఖ రాశారు.

భయం సృష్టించకండి

(మొదటిపేజీ తరువాయి)

వేల కోట్ల రూపాయల మద్యం కుంభకోణంలో ఉన్నతస్థాయి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు వ్యక్తులు, ప్రభుత్వంలోని రాజకీయ నేతల ప్రమేయం ఉందని తెలిపింది. 2019-22 మధ్యకాలంలో వీరంతా రెండు వేల కోట్ల రూపాయల నల్లధనాన్ని సృష్టించారని ఆరోపించింది. డిస్టిలరీలు ఓ ముఠాగా ఏర్పడి మార్కెట్ ధరను నిర్ణయించుకోవడానికి వీలు కల్పించేందుకు ముడుపులు తీసుకున్నారని వివరించింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టంలోని కొన్ని నిబంధనల రాజ్యాంగ చెల్లుబాటును ప్రశ్నిస్తూ ఛత్తీస్‌ఘర్ ప్రభుత్వం అన్ని రాష్ట్రాల కంటే ముందుగానే సుప్రీంకోర్టు తలుపు తట్టింది. ఇది జరిగిన సుమారు నెల రోజులకు మద్యం కుంభకోణంపై విచారణ ప్రారంభమైంది.

బీజేపీ యేతర ప్రభుత్వాలను భయపెట్టేందుకు, హింసించేందుకు, వాటి కార్యకలాపాలకు విఘాతం కలిగించేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని బాఘెల్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విమర్శించింది. ఏదైనా రాష్ట్రానికి కేంద్రంతో లేదా ఇతర రాష్ట్రాలతో వివాదాలు ఏర్పడితే ఆ రాష్ట్రం నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు వీలు కల్పించే రాజ్యాంగంలోని 131వ అధికరణను ఛత్తీస్‌ఘర్ ప్రభుత్వం సవాలు చేసింది.

వైద్యుల భద్రతకు కేరళ ప్రభుత్వం ఆర్డినెన్స్

(మొదటిపేజీ తరువాయి)

వందనాదాస్ (23)ను ఓ రోగి కత్తితో పొడిచి చంపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై ఉన్నతస్థాయి అధికారులతో సమావేశాన్ని ఏర్పాటుచేసి చట్టాన్ని సవరించి ఆర్డినెన్స్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఆర్డినెన్స్ ముసాయిదాను రూపొందించే బాధ్యతను ఆరోగ్య హోం, న్యాయ విభాగాలు, ఆరోగ్య, సైన్స్ యూనివర్సిటీల ప్రతినిధులతో కూడిన కమిటీకి అప్పగించింది.

భావ ప్రకటనా స్వేచ్ఛకు తీవ్ర ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

దేశాల్లో భావ ప్రకటనా స్వేచ్ఛకు ఇప్పుడున్న ముప్పును తన జీవిత కాలంలో ఎన్నడూ చూడలేదని, ప్రస్తుతం మనం అలాంటి కాలంలో జీవిస్తున్నామని అన్నారు.

'నేనిప్పుడు అమెరికాలో వున్నా, లైబ్రరీలు, స్కూళ్ళలో పిల్లల పుస్తకాలపై అసాధారణ రీతిలో జరుగుతున్న దాడులను చూస్తున్నా' అని రష్దీ పేర్కొన్నారు. లైబ్రరీలపై దాడి ఆలోచనే ఆందోళన కలిగిస్తోంది. వాటి పట్ల అప్రమత్తంగా వుండాల్సి వుంది. ఈ ధోరణులన్నింటిపై ధృఢంగా పోరాడాల్సి వుందని పేర్కొన్నారు. గత ఆగస్టులో న్యూయార్క్‌లో సాహితీ ఉత్సవంలో ఆయనపై దాడి జరిగింది. ఈ దాడిలో ఆయనకు ఒక కన్ను పోయింది. ఒక చేయి తీవ్రంగా దెబ్బతింది. ఆధునిక భావజాలం కోసం దశాబ్దాల నాటి పుస్తకాలను మారుస్తున్నారంటూ ప్రచురణకర్తలను రష్దీ తీవ్రంగా విమర్శించారు.

గుజరాత్ మోడల్ ఓ బోగస్

(మొదటిపేజీ తరువాయి)

రాబోయే రాజకీయ పరిణామాలను చాలా జాగ్రత్తగా అంచనా వేయాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్‌కు చెందిన కార్యకర్తలు, నాయకుల్లో ఎవరెవరు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారనే విషయాన్ని ఎప్పటికప్పుడు పసిగట్టి తనకు రిపోర్టును అందించాలని ఆదేశించారు.

పాలిసెట్‌కు 92.94 శాతం హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పాలిసెట్ రాతపరీక్ష బుధవారం ప్రశాంతంగా ముగిసింది. ఈ మేరకు రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణా మండలి (ఎస్‌బీటీఈటీ) కార్యదర్శి డాక్టర్ సి శ్రీనాథ్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 296 పరీక్షా కేంద్రాల్లో పాలిసెట్ రాతపరీక్షను నిర్వహించామని తెలిపారు. 58,520 మంది అబ్బాయిలు దరఖాస్తు చేసుకుంటే 54,700 (93.47 శాతం) మంది హాజరయ్యారని పేర్కొన్నారు. 47,222 మంది అమ్మాయిలు దరఖాస్తు చేస్తే 43,573 (92.27 శాతం) మంది పరీక్ష రాశారని తెలిపారు.

శ్రీరామ్‌నగర్‌లో బీటీ రోడ్డు పనుల పరిశీలన



నవతెలంగాణ-వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ శ్రీరామ్‌నగర్ కాలనీలో చేపట్టిన బీటీ రోడ్డు పనులను బుధవారం డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు రామ్మోహన్ గౌడ్‌లు కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రాము గౌడ్, శేఖర్, కృష్ణా రెడ్డి, ఉపేందర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, పుష్పాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలాపూర్ చౌరస్తాలో చలి వేంద్రం ఏర్పాటు



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ గ్రామానికి చెందిన అయ్యప్ప బైకు పెయింట్ అధినేత మెకానిక్ హరిబాబు గౌడ్ బాలాపూర్ చౌరస్తాలో బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికే ప్రతి సంవత్సరం తన సొంత ఖర్చుతో చలి వేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎంతో మంది బాట సారుల దాహార్తిని తీర్చడం చాలా సంతోషంగా ఉందన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



నవతెలంగాణ- ఘట్కేసర్

ఘనపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు వేముల మల్లికార్జున్ గౌడ్ నానమ్మ వేముల జంగమ్మ, ఘనపురం గ్రామ గౌడ సంఘం సభ్యులు వేముల శ్రీరాములు గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సర్పంచ్ బద్దం గోపాల్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్‌తో కలిసి బుధవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. తర్వాత వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వేముల పరమేష్ గౌడ్, మాజీ సర్పంచ్ నానావత్ రూప్ సింగ్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ వేముల సత్తయ్య గౌడ్, వార్డు సభ్యులు చిలుగురి భాస్కర్, కో - ఆప్షన్ సభ్యులు నానావత్ సురేష్ నాయక్, మాజీ వార్డు సభ్యులు వేముల శంకర్ గౌడ్, నాయకులు వేముల మహేశ్వర్ గౌడ్, వేముల పరమేష్ గౌడ్, తాటికొండ మల్లేష్ గౌడ్, వేముల శంకర్ గౌడ్, వేముల శ్యామ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే, కార్పొరేటర్



నవతెలంగాణ -వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని విజయపురి కాలనీ ఫేస్ 1లో షిరిడి సాయిబాబా ఆలయం 21వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకుల గృహ నిర్మాణం కోసం కార్పొరేటర్ తన వంతుగా రూ. 25వేల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వెంకట రెడ్డి, ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రావు, కార్యదర్శి సాయిరాం, ఆలయ చైర్మన్ సోమిశెట్టి మోహన్, ఆలయ ప్రధాన కార్యదర్శి పర్వత్ రెడ్డి, వైస్ చైర్మన్ గోపాల్ రెడ్డి, కోశాధికారి కనకరాజు, ప్రసాద్ రమణ, శైలేష్, ఆంజనేయరావు, ఎల్బీనగర్ నియోజకవర్గం ఐటీ సెల్ కన్వీనర్ శ్రీనివాస్ శర్మ, డివిజన్ కార్యవర్గ సభ్యులు మహేందర్ రెడ్డి, పాపిరెడ్డి నగర్ అధ్యక్షులు రవికుమార్, గోపాల్, శశి, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చంపాపేట్ డివిజన్

కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షుడిగా శివకుమార్



నవతెలంగాణ - సంతోష్ నగర్

ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ అధ్యక్షుడిగా చంపాపేటకు చెందిన కారుకొండ శివకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంచార్జి మల్రెడ్డి రాంరెడ్డి బుధవారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి సహకరించిన శ్రీపాల్ రెడ్డి, ఇంచార్జి మల్‌రెడ్డి రాంరెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికలలో పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సారయ్య, మాతంగి యాదగిరి, మొగలిపువ్వు నారాయణ, తోకటి కిరణ్, రేండ్ల శివ, గడ్డం వెంకటేశ్, జంగయ్య రాము యాదవ్, చింటూ, తిరుపతి, రణధీర్, మహిళా అధ్యక్షురాలు సుజాత, యాదమ్మ, మాధవి, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ జాతీయ బీమా ఏజెంట్ల

సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ -ఎల్బీనగర్

ఎల్ఐసీ జాతీయ బీమా ఏజెంట్ల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ప్రెస్ అండ్ పబ్లిసిటీ చైర్మన్ జనపల్లి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల లియాఫీ జాతీయ కార్యవర్గ సమావేశాలు న్యూ ఢిల్లీలో జరిగినట్లు ప్రెస్ అండ్ పబ్లిసిటీ చైర్మన్ జనపల్లి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో జాతీయ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. జాతీయ అధ్యక్షుడిగా శ్యామల చక్రవర్తి. లియాఫీ జాతీయ సెక్రెటరీ జనరల్‌గా సౌత్ ఇండియా హైదరాబాద్ డివిజన్ నుండి ఎస్ బి శ్రీనివాసాచారి, జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎమ్మెస్ మూర్తి, జాతీయ కోశాధికారిగా బి. శ్రీరామ్‌లను ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ దిల్‌సుఖ్ నగర్ బ్రాంచ్ లియాఫీ కార్యవర్గ అధ్యక్షుడు రాంబాబు, సెక్రటరీ రామస్వామి, కోశాధికారి పద్మావతిల ఆధ్వర్యంలో జాతీయ నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ అండ్ పబ్లిసిటీ చైర్మన్ జన్నేపల్లి శ్రీనివాస్ రెడ్డి, స్టాఫ్ యూనియన్ కార్యవర్గం, బ్రాంచ్ మేనేజర్ సత్యనారాయణ, బ్రాంచ్ సీనియర్ ఏజెంట్ నాయకులు కే సుబ్బారావు, రామ్మోహన్ సుదర్శన్, రాపోలు సుధాకర్, వెంకట్ రెడ్డి, కృష్ణారావు డివిజన్ నాయకులు కోటయ్య, సుదర్శన్, శ్యామయ్య శ్రీనివాస్ గౌడ్ గజానందు మురళీకృష్ణ పాల్గొన్నారు.

'స్పీడ్ బ్రేకర్లతో ప్రమాదాల నివారణ'



నవతెలంగాణ - చైతన్యపురి

స్పీడ్ బ్రేకర్ల వలన కొంతవరకు ప్రమాదాలను నివారించవచ్చని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నరసింహ గుప్తా అన్నారు. దిల్ సుఖ్ నగర్ బస్ డిపో పక్కన ఉన్న కూడలిలో గౌతమ్ మోడల్ స్కూల్ వద్ద స్పీడ్ బ్రేకర్లు లేనందున ప్రమాదాలు జరుగుతున్నాయని జీహెచ్‌ఎంసీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో గౌతమ్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి స్థానికులతో కలిసి బుధవారం స్పీడ్ బ్రేకర్లు వేయించారు. ఈ క్రమంలో కార్పొరేటర్ వాటిని పరి శీలించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు ప్రసాద్, శంకర్, కృష్ణ ప్రసాద్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు వినోద్ యాదవ్, రాష్ట్ర యువ మోర్చా కల్చరల్ కన్వీనర్ నవీన్ యాదవ్, ఇంచార్జి జి.రామ్మోహన్ పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడు

నర్సింహ మృతికి సంతాపం



నవతెలంగాణ-నాగోల్

ప్రజా నాయకులు ఈర్ల నర్సింహ అకాల మరణానికి చేతి వృత్తి సంఘాల రాష్ట్ర కమిటీ సభ్యులు బొడ్డు పల్లి కృష్ణ, నాయకులు, కార్యకర్తలు బుధవారం సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ .. ఈర్ల నర్సింహ తన జీవితాన్ని అన్ని రకాల చేతి వృత్తి దారులు, పేదలు, రైతులు, వ్యవసాయ కూలీల హక్కుల కోసం పోరాటాలు చేశారని కొనియడారు. అనంతరం ఆయన మృతికి శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పదిలో సత్తా చాటిన మెగాసిటీ విద్యార్థులు



నవతెలంగాణ- సిటీబ్యూరో

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మెగాసిటీ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని చైర్మన్ సుబ్బారెడ్డి, డైరెక్టర్ స్వాతి ప్రిన్సిపాల్ వాసులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా స్కూల్ నందు విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఎటువంటి మానసిక ఒత్తిడి లేకుండా, సులువైన పద్ధతిలో పాఠాలు చెబుతుంటారని వివరించారు. ప్రతి ఒక్కరిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు చెప్పారు. ఎంతో అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నట్లు తెలిపారు. పిల్లలకు కమ్యూనికేషన్ స్కిల్ డెవలప్మెంట్, ముఖ్య అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాల్లో స్థిరపడాలంటే ఇప్పటినుండే కష్టపడే తత్వం ఉండాలని తెలిపారు. మా స్కూల్ నుండి పూర్వ విద్యార్థులు మంచి స్థానాలలో ఉద్యోగాలు చేస్తుండడం మాకు గర్వంగా ఉందన్నారు. 10/10 ముగ్గురికి శ్రీ వైష్ణవి, లక్ష్మీ చైత్ర, ప్రచిత, రఘురాం, జతిన్ ప్రణయ్, 9.8 గాయత్రి, భాను ప్రసాద్, సహస్ర యాదవ్, శివ చరణ్, శశాంక్, సౌజన్య, సుమేర ధనుష్, ఉమారాణి, యోగితాలు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ స్వాతి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ మున్సిపల్ అభివృద్ధికి కృషి

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ-బడంగ్ పేట్

సీఎం కేసీఆర్ నాయకత్వంలో మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 10వ డివిజన్‌లో రూ. 40లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు బుధవారం డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్, కార్పొరేటర్ బద్రమోని రోహిణి రమేష్ ముదిరాజ్‌లతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధే మా నినాదాలు, విధానాలు అని అన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కృష్ణ మోహన్ రెడ్డి, డీఈఈలు అశోక్ రెడ్డి, జ్యోతి, నాదర్‌గుల్ ది భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం బ్యాంకు చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు సూర్లగంటి అర్జున్, పెద్దబావి శోభ ఆనంద్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చుక్క శివకుమార్, మాజీ కౌన్సిలర్ దండు గణేష్, మహేశ్వరం నియోజకవర్గం సోషల్ మీడియా ఇంచార్జి సిల్వర్ సాంబశివ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్

మంత్రిని కలిసిన వినాయక హిల్స్ కార్యవర్గ సభ్యులు



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పోరేషన్‌లోని అల్మాస్ గూడ 5వ డివిజన్ వినాయక హిల్స్ ఫేస్ 2లోని నూతన కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు కార్యదర్శి, కార్యవర్గ సభ్యులు బుధవారం డివిజన్ కార్పొరేటర్ బోయపల్లి దీపికా శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

'ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి'



నవతెలంగాణ - ఘట్కేసర్

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు నానావత్ శివాజీ నాయక్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజుల నియంత్రణ చట్టం లేకపోవడం వలన ప్రైవేటు యాజమాన్యాలు వారి ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండల, జిల్లా అధికారులు స్పందించి బ్రాంచీల పేరుతో ప్రారంభిస్తున్న పాఠశాలలపైన చర్యలు తీసుకోవాలని కోరారు. అనుమతులు లేకున్నా కానీ ముందస్తు అడ్మిషన్లు చేస్తూ, హోర్డింగ్ పెడుతున్నా కనీసం మండల అధికారులు స్పందించకపోవడం చాలా బాధాకరమైన విషయం అన్నారు. హాస్టల్ బుకింగ్ పేరిట విద్యార్థుల దగ్గర నుంచి ముందుగానే డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులకు ముందుగానే యూనిఫామ్స్, బుక్స్ తీసుకోవాలని మెసేజ్లు చేస్తూ వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైయినా అధికారులు స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

చెరువు పరిరక్షణకు న్యాయ సహాయం అందజేస్తాం

- ఆలిండియా న్యాయవాదుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొల్లి సత్యనారాయణ



నవతెలంగాణ-తుర్కయాంజల్

తుర్కయాంజల్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మాసబ్ చెరువు పరిరక్షణకు న్యామ సహాయం అందజేస్తామని ఆలిండియా న్యాయవాదుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొల్లి సత్యనారాయణ తెలిపారు. మాసబ్ చెరువు కబ్జాకు గురవుతున్న విషయం తెలుసుకున్న ఆలిండియా న్యాయవాదుల సంఘం బృందం బుధవారం చెరువు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం తుర్కయాంజల్‌లోని మాసాబ్ చెరువును సుందరీకరణ పేరుతో ఎంతో అభివృద్ధి చేస్తుంటే..అక్రమార్కులు యథేచ్ఛగా చెరువును కబ్జా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా రాత్రి సమయాల్లో చెరువులోని మట్టిని వందల కొద్ది లారీలతో తోడేస్తున్నారని ఆరోపించారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వలనే చెరువు కబ్జాకు గురవుతుందని మండిపడ్డారు. కేవలం కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పక్కదోవ పట్టిస్తూ కబ్జాదారుల కు వత్తాసు పలుకుతున్న అధికారులపై న్యాయ విచారణ చేయాలని, దీనికి కారణమైన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. చెరువును సర్వే చేసి ఎఫ్‌టీఎల్ హద్దులను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో మాసాబ్ చెరువు పరిరక్షణ సమితి సభ్యులు రొక్కం చంద్రశేఖర్ రెడ్డి, బచ్చిగళ్ల రమేష్, ప్రముఖ న్యాయవాది అరుణ్ కుమార్, రమావత్ కళ్యాణ్ నాయక్, రావుల వీరేశం, మైలారం బాబు, మహేందర్ రెడ్డి, పార్థసారథి, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, రూప పాల్గొన్నారు.

ప్రయివేటు స్కూళ్ల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వినతి



నవతెలంగాణ -సంతోష్ నగర్

విద్య పేరుతో వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. బండ్లగూడ మండలంలో ప్రైవేట్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బండ్లగూడ డిప్యూటీ డీఈవో విద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్ మాట్లాడుతూ ప్రైవేట్ స్కూళ్ల ఆగడాలు రోజురోజుకూ మితిమీరి పోతున్నాయని మండిపడ్డారు. 2023-2024 సంవత్సరం అకాడమీ ప్రారంభం కాకముందే ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పట్నం కార్యదర్శి యన్.కోటిరెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు జె. శంకర్ నాయక్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పని చేయించుకొని పైసలిస్తలేడు..

- కాంగ్రెస్ నేత కృష్ణారెడ్డి ఇంటి ఎదుట కార్మికుల ఆందోళన



నవతెలంగాణ - చైతన్యపురి

రాష్ట్రస్థాయి రాజకీయాల్లో చక్రం తిప్పగల నాయకుడు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చల్లమల్ల కృష్ణారెడ్డి.. పని చేయించుకొని పైసలిస్తలేడని కొంత మంది కార్మికులు బుధవారం ఆయన ఇంటి ఎదుట ధర్నాకు దిగ్గారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. ఆర్కేపురంలోని గ్రీన్ హిల్స్ కాలనీలో నివాసం ఉండే మునుగోడు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చల్లమల్ల కృష్ణారెడ్డి ఈనెల 6 న ఆయన కుమారుడి వివాహం జరిగిందన్నారు. పెండ్లి కోసం డెకరేషన్ చేయించుకుని డబ్బులు ఇవ్వట్లేదని ఆరోపించారు. కృష్ణారెడ్డి దాదాపు రూ.7లక్షలు ఇవ్వాల్సి ఉందని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. చేసిన పనికి డబ్బు ఇవ్వకపోగా అడిగితే 'డబ్బులు ఇవ్వను ఏం చేసుకుంటారో చేసుకోండి' అంటూ బెదిరిస్తున్నాడంటూ వారు వాపోయారు. అనంతరం కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులకు, కూలీల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న చైతన్యపురి పోలీసులు అక్కడికి చేరుకొని బాధితులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. తమకు డబ్బులు ఇప్పిస్తేనే ఇక్కడి నుంచి కదులుతామంటూ కార్మికులు భీష్మించు కూర్చున్నారు. చివరకు ఇరు వర్గాలతో పోలీసులు చర్చించి ఆందోళనను విరమింపజేశారు. కార్మికులకు అక్కడ నుంచి పంపించారు.

కాంగ్రెస్ పార్టీ కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తా

- రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



నవతెలంగాణ - మీర్ పేట్

కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు శక్తి వంచన లేకుండా పని చేస్తానని రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి చల్లా నర్సింహారెడ్డి నియామకం అయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండోసారి కూడా కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా తనను నియమించినందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత బట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి వంశీ చందర్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. రాహుల్ గాంధీ నిర్వహించిన భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కలిసి కట్టుగా పనిచేయాలని కార్యకర్తలు, నాయకులను కోరారు.

కాలనీ సమస్యలు పరిష్కరిస్తా

- కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



నవతెలంగాణ-వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధి శ్రీరామ్ నగర్ కాలనీలోని సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శ్రీరామ్ నగర్ కాలనీలో జరుగుతున్న రోడ్డు పనులను బుధవారం కాలనీ సభ్యులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ సమస్యలు త్వరలోనే పరిష్కారం అవుతాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రిక్ సిటీ ఏఈ రణధీర్, కాలనీ అధ్యక్షులు రాము గౌడ్, శేఖర్, జ్ఞానేశ్వర్, ఉపేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, హనుమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా

రెండోసారి నర్సింహారెడ్డి నియామకం



నవతెలంగాణ-బడంగ్‌పేట్

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీ అధ్యక్షుడిగా చల్లా నర్సింహారెడ్డి రెండోసారి నియామకమయ్యాడు. ఈ మేరకు బుధవారం ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. రంగా రెడ్డి జిల్లాతో పాటు మరో 8 జిల్లాలకు కూడా నూతన జిల్లా అధ్యక్షులను కాంగ్రెస్ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ, ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నాయని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. అనంతరం పలువురు చల్లా నర్సింహారెడ్డిని కలిసి పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

కామ్రేడ్ గోపాల్‌రావుకు

సీపీఐ(ఎం) నాయకుల పరామర్శ



నవతెలంగాణ - బడంగ్‌పేట్

డిఫెన్స్ ఉద్యోగుల సంఘం ఆలిండియా నాయకుడు కామ్రేడ్ గోపాల్ రావును బుధవారం సీపీఎం నాయకులు పరామర్శించారు. ఇటీవల గోపాల్‌రావు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న సీపీఎం పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ మెంబర్ కామ్రేడ్ డిజి నరసింహారావు, పట్నం రాష్ట్ర నాయకులు ప్రసాద్, సీపీఎం నాయకులు కిషోర్‌లు బడంగ్‌పేటలోని తన నివాసంలో గోపాల్ రావును కలిసి, పరామర్శించారు. అనంతరం గోపాల్‌రావు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

డ్రయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతా

- అధ్యక్షుడు రమేష్ రెడ్డి



నవతెలంగాణ- సంతోష్ నగర్

దుర్గా భవానీ నగర్ పరిధిలో నెలకొన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానని అధ్యక్షుడు రమేష్ రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం కాలనీ నాయకులతో కలిసి డ్రైనేజీ మరమ్మతులను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను హెచ్ఎం డబ్ల్యూఎస్ఎస్‌బీ ఎయిర్ టెక్ మిషన్ ద్వారా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి వాడలో డ్రైనేజీ ప్రవాహాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, సమగ్రంగా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించినట్లు తెలిపారు. కాలనీ ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. స్థానిక సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ వైస్ ప్రెసిడెంట్ వెంకట్, నాయకులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత కోసం కృషిచేస్తా

- కౌన్సిలర్ శంకర్



నవతెలంగాణ-బడంగ్ పేట్

పరిసరాల పరిశుభ్రత పరిరక్షణ కోసం తన వంతు కృషి చేస్తాననని 19వ వార్డు కౌన్సిలర్ పల్లపు శంకర్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని శ్రీరాం కాలనీలో గల్పర్ మిషన్‌తో డ్రైనేజీలలో పేరుక పోయిన మట్టిని మున్సిపల్ సిబ్బందితో బుధవారం శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి రూ. కోట్ల నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి.. వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

నవతెలంగాణ 7
మల్కాజిగిరి
గురువారం 18 మే 2023

వివాహ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నాచారం



పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ డీఈ శ్రీనివాస్, శ్రీవాణి సిల్వర్ జూబ్లీ వివాహ దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి పాల్గొని దంపతులను శాలువతో సత్కరించారు. బుధవారం నాచారం కౌండిన్య నగర్ లో జరిగిన ఈ వేడుకల్లో శ్రీనివాస్ దంపతులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గడ్డం రవికుమార్, సాయిజెన్ శేఖర్, పిట్టల నరేష్ ముదిరాజ్, ఎండీ రఫీక్, అప్సర్ ఖాన్, వినోద్ పాల్గొన్నారు.

బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-కాప్రా



అమీర్ పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ కైలాస గిరికి చెందిన గోగి వర లక్ష్మి అనారోగ్యం తో మరణించడంతో వారి కుమారుడు విశాల్‌కు బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ట్రస్ట్ ప్రతినిధి గుమ్మడి జంపాల్ రెడ్డి రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా అనేక సేవా సామాజిక కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. ఆపదలో ఉన్న వారికి తమ ట్రస్టు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, నాదెండ్ల నవీన్, జోసఫ్, పిల్లికండ్ల బాల రాజు, రామకష్ణ, మల్లేశ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

అవుట్సోర్సింగ్ నర్సింగ్ సిబ్బందికి వేతనాలు పెంచాలి

- యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ యూసుఫ్, ఎం. నరసింహులు
- డైరెక్టర్ కార్యాలయం ముందు భారీ ధర్నా

నవతెలంగాణ కంటోన్మెంట్



రాష్ట్రవ్యాప్తంగా ఈఎస్ఐ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న అవుట్సోర్సింగ్ నర్సింగ్ సిబ్బందికి, అవుట్సోర్సింగ్ టెక్నీషియన్స్‌కు రాష్ట్ర ప్రభుత్వ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు పెంచాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ యూసుఫ్, ఎం నరసింహులు డిమాండ్ చేశారు. బుధవారం ఈఎస్ఐ డైరెక్టర్ కార్యాలయం ముందు తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈఎస్ఐ డైరెక్టరేట్ పరిధిలో పనిచేస్తున్న అవుట్సోర్సింగ్ సిబ్బంది వేతనాల పెంపుదల విషయంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని వహిస్తున్నారన్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేస్తున్న అవుట్సోర్సింగ్ నర్సింగ్ సిబ్బందికి ఈఎస్ఐ డైరెక్టర్ పరిధిలో పనిచేసే అవుట్సోర్సింగ్ నర్సింగ్ సిబ్బందికి సమాన వేతనాలు ఉండేవని తెలిపారు. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో పనిచేస్తున్న అవుట్సోర్సింగ్ నర్సింగ్ సిబ్బందికి రూ. 32363/-లు చెల్లిస్తుండగా ఈఎస్ఐ ఆస్పత్రిలో పనిచేస్తున్న అవుట్సోర్సింగ్ నర్సింగ్ సిబ్బందికి మాత్రం కేవలం రూ. 22750/- మాత్రమే చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా ల్యాబ్ టెక్నీషియన్స్‌కు రాష్ట్ర ప్రభుత్వ ఆస్పత్రుల్లో రూ.27,300 చెల్లిస్తుండగా ఈఎస్ఐలో మాత్రం రూ. 22,750 మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. ఈ విషయమై అధికారులను పలుమార్లు అడిగినా సమస్య పరిష్కారం కానందుకు నిరసనగా ధర్నా కార్యక్రమం చేపట్టినట్టు వారు తెలిపారు. ఈనెల 4వ తేదీన సమ్మె నోటీసు అందజేశామని అయినా స్పందించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రుల ముందు సిబ్బంది ధర్నా చేపట్టారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవుట్సోర్సింగ్ నర్సింగ్ సిబ్బందికి 35 క్యాజువల్ లీవులు అమలు చేస్తుండగా ఈఎస్ఐ ఆస్పత్రుల్లో మాత్రం 23 మాత్రమే అమలు చేయడం అన్యాయమన్నారు. ఈఎస్ఐ డైరెక్టర్ నిర్లక్ష్యం వల్ల గత రెండు సంవత్సరాలుగా అవుట్సోర్సింగ్ సిబ్బంది తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం ఈఎస్ఐ జాయింట్ డైరెక్టర్ గౌతమ్ అసిస్టెంట్ డైరెక్టర్ బాలాజీలతో సుదీర్ఘంగా జరిపారు. అనంతరం ఆయన రాతపూర్వకంగా హామీ ఇవ్వడంతో సమ్మెను వాయిదా వేసినట్టు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ఉప ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, నర్సింగ్ సిబ్బంది నాగమణి, మేరీ, సుమలత, కళ్యాణి, మంగమ్మ, స్వాతి తదితరులతోపాటు దాదాపు 200 మంది అవుట్సోర్సింగ్ సిబ్బంది ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారించకపోతే ఆందోళనలు



- నందికంటి శ్రీధర్

నవ తెలంగాణ- నేరేడ్ మెట్

సమస్యలు పరిష్కారించక పోతే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పార్టీ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు నందికంటి శ్రీధర్ అన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్ర 53 రోజులుగా కొనసాగు తుంది. అందులో భాగంగా బుధవారం మచ్చ బొల్లారం డివిజన్‌లో కొనసాగింది. నందికంటి శ్రీధర్ మాట్లా డుతూ మోసపూరిత, అమలుకు నోచుకోని ఎన్ని కల హామీలతో కేసీఆర్ సర్కార్ అధికారంలోకి వచ్చింద న్నారు. పేదలకు ఇస్తామన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. గ్యాస్ ధరలు రూ 1250 దాకా పెంచారని ధ్వజమెత్తారు. 133 డివిజన్‌లోని తుర్కపల్లి లో డ్రయినేజ్ వ్యవస్థ ప్రజలకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. అక్కడక్కడ బోర్లు ఉన్నా పని చేయకుండా మిగిలి పోయాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేస్తామని, ఆడపడుచులకు గ్యాస్ రూ. 500 కే వచ్చే విధంగా కృషి చేస్తామని, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తా మని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చంద్రశేఖర్, అశోక్ రెడ్డి, డోలి రమేష్, యాదగిరి, కష్ణ గౌడ్, శ్రీపాల్ రెడ్డి డివిజన్ ప్రెసిడెంట్ పవన్ ,సూర్య ప్రకాష్ రెడ్డి, శ్రీనివాస్, పాండు, పాతాలు రవీందర్ రెడ్డి, ఓంకార్, రాజు, వీనస్ మేరీ , ఫాహిమ, విజయలక్ష్మి, నిర్మల, నజియ తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ మిషన్ తరలించవద్దని ధర్నా



నవతెలంగాణ-కాప్రా

స్కానింగ్ మిషన్ తరలించవద్దని కోరుతూ బీజేఆర్ కాలనీ ప్రెసిడెంట్ ఎస్ఏ రహీమ్, బీఆర్ఎస్ లీడర్ షేర్ మనెమ్మ, భగర్ నగర్ కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్, జమ్మిగడ్డ వాసులు కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద జమ్మిగడ్డ వాసులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోరాడి తెచ్చుకున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత సంవత్సరం నుంచి స్కానింగ్ చేస్తున్నారని.. ఇప్పుడు ఆ స్కానింగ్ మిషన్ తరలించుతున్నారని తెలిపారు. వేలాదిమంది పేదలు నివసించే జమ్మిగడ్డ ప్రాంతంలో ఉన్న స్కానింగ్ యంత్రాన్ని జీహెచ్ఎంసీ పరిధి నుంచి తీసుకొని ఎక్కడ ఉన్న జిల్లాలోని ఆర్యోగ్య కేంద్రానికి తరలించడం శోచనీయమని పేర్కొన్నారు. స్కానింగ్ మెషిన్‌ను తరలించవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యాకయ్య, పంతులు నరసింహ, శ్యామ్ సుందర్ రెడ్డి, సత్తమ్మ, గడ్డం శ్రీను తదితరులు పాల్గొన్నారు .

బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ అహ్మద్ పాషా తమ్ముని వివాహానికి మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర నాయకులు రేగళ్ల సతీష్ రెడ్డి , రాజు వంశరాజ్ ఇతర సభ్యులు హాజరయ్యారు.

నవతెలంగాణ-కాప్రా



బాధితునికి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-నేరేడ్ మెట్

బ్రెయిన్ స్ట్రోక్ వ్యాధితో బాధపడుతున్న ఓ బాధితుడికి మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ (ఎంఎస్ఎస్ఓ) ద్వారా రూ లక్ష ఆర్థిక సహాయం అందచేశారు. నేరేడ్ మెట్ డివిజన్ పరిధిలోని డిఫెన్స్ కాలనీకి చెందిన సంజయ్ రంజన్ బ్రెయిన్ స్ట్రోక్ వ్యాధితో బాధపడుతు న్నాడు.దీనికి తోడు బాధితుడి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. దీంతో కుటుంబ సభ్యులు ఇటీవల బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును కలిశారు. ఇటీవల బాధితుడిని పరామర్శించిన సమయంలో తాను అండగా ఉంటానని, అధైర్య పడొద్దని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ మేరకు ఇచ్చిన మాట ప్రకారం మంగళవారం మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ద్వారా లక్ష రూపాయలను పేషంట్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పంపించారు. బీఆర్ఎస్ మల్కాజిగిరి సర్కిల్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి ఈ డబ్బులను బాధితుడికి అందచేశారు.ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ... ఆపద లో ఉన్న వారికి మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అండగా ఉంటుందని తెలిపారు. బాధితుడు మాట్లాడుతూ.. తనను పరామర్శించడమే గాకుండా, ఆర్థిక సహాయం ను అందజేసి, మానవత్వం ను చాటుకున్నారనిఎమ్మెల్యే కు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేరేడ్ మెట్ డివిజన్ నాయకు లు కె. చెన్నారెడ్డి, రాజు, మహేష్, బబ్లూ, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సెవెన్ హిల్స్ మోడల్ స్కూల్ ఉత్తమ ఫలితాలు





నవతెలంగాణ-మల్కాజ్‌గిరి

గౌతంనగర్ డివిజన్‌లోని మల్లికార్జున నగర్‌లో ఉన్న సెవెన్ హిల్స్ మాడెల్ స్కూల్ విద్యార్థులు 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు గొప్ప పేరును తీసుకవచ్చారని స్కూల్ కరస్పాండెంట్ బి. శేషాసాయి, ప్రిన్సిపాల్ యామిని తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ 10వ తరగతి ఫలితాల్లో వై.గౌతం 9.3 జీపీఏ, పి. గాయత్రి, ఎస్ పూజిత 9.2 జీపీఏ సాధించారని అన్నారు. నూటికి నూరు శాతం విజేతలుగా నిలిచారని అన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయ బృందం, అభినందించింది.

కానాజిగూడ శ్మశాన వాటికలో సదుపాయాలు కల్పిస్తా

నవతెలంగాణ -నేరేడ్‌మెట్



వెంకటాపురం డివిజన్ పరిధిలోని కానాజిగూడ శ్మశాన వాటికలో సదుపాయాలు కల్పిస్తానని కార్పొరేటర్ సబిత అనిల్ కిషోర్ అన్నారు. ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు అదేశాలు మేరకు బుధవారం కార్పొరేటర్, స్థానికులతో కలిసి కానాజిగూడ శ్మశాన వాటికను పరిశీలించారు. దీనిలో మౌళిక సదుపాయలు కల్పించాలని కోరుతూ స్మశాన వాటిక కమిటీ సభ్యులు, కార్పొరేటర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ కార్తీక్, వర్క్ ఇన్స్పెక్టర్ వెంకట్ రావు, బస్తీ వాసులు సదానం ద్, కన్న, నిరంజన్, వేణు, రఘు, నీతు ,రాజు, బీఆర్ఎస్ నాయకులు భాస్కర్, మోసిన్, సుధేష్, మల్లేష్, మైవన్, లక్ష్మీ నారాయణ, జాంధార్, లక్ష్మి, స్వప్న తదితరులు పాల్గొన్నా రు

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



మంత్రి మల్లారెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకురా మల్లారెడ్డి అన్నారు. కీసర మండల కేంద్రంలో కోటి రూపాయలతో చేపట్టనున్న నూతన గ్రంథాలయ భవనం నిర్మాణ పనులకు మంత్రి శంకు స్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాన్ని అన్నీ హంగులతో ఉత్తమంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మెన్ శరత్ చంద్ర రెడ్డి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ దయాకర్ రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మెన్ వెంకటేష్,ఎంపీపీ ఇందిరా, సర్పంచ్ మాధురి, మండల ఎంపీటీసీలు, సర్పంచ్లు, మండల పార్టీ అధ్య క్షులు సుధాకర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఓల్డ్ గాంధీ నగర్‌లో పర్యటించిన సాయన్న కుమార్తెలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డ్ ఏడో వార్డులోని ఓల్డ్ గాంధీనగర్‌లో సమస్యలు పరిశీలనకు గాను దివంగత ఎమ్మెల్యే జి.సాయన్న కుమార్తెలు లాస్యనందిత, నివేదిత పర్యటించారు. వార్డు అధ్యక్షుడు తేజ పాల్‌తో పాటు వారు పర్యటిస్తూ స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, బోర్‌వెల్ వాటర్‌లో డ్రైనేజ్, సీసీ రోడ్ల సమస్యలు స్థానికులు చెప్పారు. అలాగే ముఖ్యంగా బస్తీ దవాఖాన ఏర్పాటు విషయంపై స్థానికులు ప్రస్తావించారు. ఈ సందర్భంగా నివేదిత, నందితలు మాట్లాడుతూ. గాంధీనగర్ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణ పరిష్కారం కోసం అధికారుల దష్టికి తీసుకుపోయి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మెన్ శ్రీనివాస్, రవీందర్ గుప్త, సంతోష్, సదానంద్, బాస్కర్, దయాక్, శాంత మూర్తి, శ్రీధరన్, రాజేష్, రూప్, సుజాత మనీల, చంద్రకళ, తంగమ్మ పాల్గొన్నారు.

నవోదయనగర్ బస్తీలో కార్పొరేటర్ పర్యటన

నవతెలంగాణ-కాప్రా



మీర్పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోనీ నవోదయనగర్ బస్తీలో స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డిలు పర్యటించి తాగునీటి సరఫరా, డ్రయినేజీ సమస్యలపై కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుదాస్ మాట్లాడుతూ బస్తీకి ఎగువ భాగంలో ఉన్న ఇండ్ల వరకు కూడా మంచినీటి పైప్ వేయించి ప్రతీ ఇంటి వరకు మంచినీటిని చేరవేసే భాధ్యత తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ వేణుగోపాల్, లైన్ మెన్ విజయ్, కాలనీ సంక్షేమ సంఘ నాయకులు కత్తుల రాజ్ కుమార్, భూపతి అశోక్, కొయ్యడ జయపాల్, నవీన్ గౌడ్, నవీన్, లింగం, అనిల్, స్థానిక నాయకులు ఉల్లెమ్ బాలరాజు, దండెం నరేందర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం

- బీఆర్ఎస్ కీసర మండల అధ్యక్షుడు జలాల్ పురం సుధాకర్ రెడ్డి



వతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

అన్నదానం మహదానం అని బీఆర్ఎస్ కీసర మండల అధ్యక్షుడు జలాల్ పురం సుధాకర్ రెడ్డి అన్నారు. కీసర మండలం లోని నర్సంపల్లి గ్రామంలో బొడ్రాయి పండుగ సందర్భంగా 3 రోజులు అన్నదాన కార్యక్రమాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజులు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఒక సేవ అని, అన్ని దానాల కంటే అన్నదానం గొప్పది అని పేర్కొన్నారు. అన్నదానం చేసిన సుధాకర్ రెడ్డిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ బెస్త వెంకటేష్, నర్సంపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ సత్తమ్మ పెంటా చారీ, ఉప సర్పంచ్ స్వప్న శ్రీనివాస్ రెడ్డి, వార్డ్ మెంబర్ సభ్యులు వేణుగోపాల్, కృష్ణ, మల్లేష్, శేఖర్, సంజీవ కుమార్, ఉపేందర్ చారీ, సనాల సదాశివ చారీ, గ్రామ పెద్దలు బల్వంత రెడ్డి, బండారి కష్ణ, నారాయణ, కటికె నర్సింహ, కీసర మండల అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు మొరుగు రవీందర్, బీఆర్ఎస్ కీసర మండల మీడియా సెల్ అధ్యక్షులు గొరంటి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాలు పంపిణీ చేసిన కార్పొరేటర్ దీపిక

నవతెలంగాణ-కంటోన్మెంట్



సమ్మర్ క్యాంపు ముగించుకున్న హాస్టల్ విద్యార్థులకు మోండా డివిజన్ కార్పొరేటర్ దీపిక క్రీడా పరికరాలను అందజేశారు. ఆశ్రిత, స్నేహగర్, రెయిన్‌బో హోమ్స్ నాలా బజార్‌లోని ఆశ్రిత హోం, లక్ష్య ఉడాన్ హోమ్, తదితర హోమ్‌లు వారు సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించగా అతిథులుగా కార్పొరేటర్‌లు దీపిక, చీర సుచిత్ర పాల్గొన్నారు. సమ్మర్ క్యాంపులో నెల రోజులపాటు పిల్లలు నేర్చుకున్న ఆటపాటలు, కరాటే ప్రదర్శనలు, గాజుల తయారీ విధానాన్ని వారు ప్రదర్శించారు. అనంతరం పదో తరగతి, ఇంటర్ పాసైన విద్యార్థులకు కార్పొరేటర్ దీపిక శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎటువంటి సమస్య ఉన్న ఎటువంటి అవసరాలు ఉన్నా మా దృష్టికి తీసుకొస్తే తప్పకుండా పరిష్కరిస్తామని కార్పొరేటర్లు హామీ ఇచ్చారు.

పులి స్వరూపగౌడ్ సేవలు చిరస్మరణీయం

నవతెలంగాణ-ముషీరాబాద్



పులి స్వరూపగౌడ్ సేవలు చిరస్మరణీయమని పులి స్వరూప గౌడ్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షులు పులి శ్రీశైలం గౌడ్, ప్రధాన కార్యదర్శి పులి ప్రదీప్ గౌడ్, కోశాధికారి పులి సందీప్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం పులి స్వరూప గౌడ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా రెయిన్ బో అనాధాశ్రమంలోని విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆమె చేసిన కార్యక్రమాలకు ప్రతిరూపంగా ఆమె ప్రథమ వర్ధంతి సందర్భంగా అనాథ పిల్లలకు అన్నదానం చేయడం గర్వంగా ఉందన్నారు. స్వరూప గౌడ ఆశయాల సాధన కోసం తాము సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రవళిక గౌడ్, సాన్విక గౌడ్, సహస్ర గౌడ్, మల్లేష్, రమేష్, సక్కుబాయి, రేఖ గౌడ్, అరుణ, ఉమా, సతీష్, బబ్లు, సాయి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయి నుంచే మార్పు తీసుకురావాలి

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



పాఠశాల స్థాయి నుంచే విద్యార్థిని, విద్యార్థుల్లో మానసికంగా మార్పు తీసుకురావాలని మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు సూచించారు. బుధవారం తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ 6వ వార్షికోత్సవ ముగింపు వేడుకల్లో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మోతుకూరి రాంచందర్ మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావును శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమన్నారు. నేటి సమాజంలో పెట్రేగి పోతున్న విపరీత ధోరణులకు కారణంగా పాఠశాలల్లో సైకాలజిస్టుల నియామకాలను చేపట్టాలని సూచించారు.

ప్రయివేటు కాలేజీల ఫీజు దందా..!

- ఇష్టారాజ్యంగా నారాయణ విద్యా సంస్థల తీరు
- ఒక్క పర్మిషన్‌తో పదుల సంఖ్యలో కాలేజీల నిర్వహణ
- స్టార్, సూపర్ స్టార్, ఏసీ క్లాసులతో రూ.లక్షల్లో ఫీజులు వసూలు
- అధికారులకు ఫిర్యాదు చేసినా నో యాక్షన్
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న విద్యాశాఖ, ఇంటర్‌బోర్డు

నవతెలంగాణ-సిటీబ్యూరో

నారాయణ వంటి కార్పొరేట్ కాలేజీలు తీరు తాము ఆడిందే ఆట.. పాడిందే పాట.. అనేలా ఉంది. విద్యార్థుల తల్లిదండ్రుల అమాయకత్వాన్ని, నమ్మకాన్ని ఆసరగా చేసుకుని సొమ్ము చేసుకుంటున్నాయి. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టా రీతిన వ్యవహరస్తున్నాయి. ఇరుకు గదుల్లో చదువులు చెబుతూ.. అడ్డగోలుగా రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ స్టూడెంట్స్ పేరెంట్స్‌ను పీల్చి పిప్పిచేస్తున్నాయి. కనీస సౌకర్యాలు ఉండవు. ప్రత్యేక తరగతుల పేరిట రోజంతా బట్టి చదువులతో విద్యార్థులను మానసిక ఒత్తిడి గురి చేస్తున్నాయి. ఈ ఒత్తిడి తట్టుకోలేని పిల్లలు తల్లిదండ్రులకు భారం కావొద్దని భావించి ఆత్మహత్యలు ఒడిగడుతున్నారు. ఇలాంటి ఘటనలో ఏడాదిలో ఎక్కడో ఒకచోట జరుగుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదు. అందులో నారాయణ వంటి కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరిగితే అసలు పట్టించుకునే వారే లేకుండా పోయారు. విద్యాశాఖ, ఇంటర్ బోర్డుకి ఫిర్యాదు చేస్తే.. సంబంధిత అధికారులు వచ్చి.. చూసి వెళ్తారు తప్ప చర్యలు తీసుకోరని విద్యార్థి సంఘాలు నాయకులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న నారాయణ వంటి కార్పొరేట్ కాలేజీల పట్ల కఠినంగా వ్యవహరించాలని కోరుతున్నారు.

సర్కారు నిబంధనలకు.. 'నారాయణ' తూట్లు..

కాలేజీకి ఒకచోట పర్మిషన్ ఉంటే మరోచోట నిర్వహిస్తున్నారు. నారాయణగూడలోని నారాయణ కాలేజీ పర్మిషన్‌తో సికింద్రాబాద్, జూబ్లీహిల్స్, మాదాపూర్‌లో బ్రాంచీలు నడుపుతున్నారు. ఒక్క మాదాపూర్‌లో 30-40 కాలేజీలకు పర్మిషన్ లేదని విద్యార్థి సంఘాల నాయకులు అంటున్నారు. ఇలా నగరంలో ఒక్క



నారాయణ విద్యాసంస్థలకు సంబంధించి 50 కాలేజీల వరకు పర్మిషన్ లేకుండానే రన్ చేస్తున్నాయని చెబుతున్నారు. వాస్తవానికి కాలేజీకి 8 వేల చదరపు అడుగుల స్థలం ఉండాలి. ఆటస్థలం తప్పనిసరి. లేబొరేటరీతో పాటు సెక్షన్‌కు ఇద్దరు అధ్యాపకులుండాలి. 9 సెక్షన్లకు మించి ఉండకూడదు. ప్రతి సెక్షన్‌లో 88 సీట్లు అనుమతిస్తారు. భవనానికి ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ ఉండాలి. ఎక్కడో ఒకచోట తప్పిస్తే.. ఇవేమి అమలు కావడం లేదు. నగరంలో కొత్త భవనం కనిపిస్తే చాలు.. నారాయణ బోర్డు పెట్టేస్తారు. నారాయణ కాలేజీకి ఇంటర్ బోర్డు నిబంధనల పట్ల పట్టింపులేదు. ఇష్టారాజ్యంగా అదనపు సెక్షన్లు పెట్టి నడిపిస్తారు. ప్రాక్టికల్స్ చేయించిన పాపాన పోవడం లేదు. సైన్స్ గ్రూపులతో పాటు, ఆర్ట్స్, కామర్స్ గ్రూపులూ ఉండాలి. కానీ కార్పొరేట్ కాలేజీల్లో అసలు గ్రూపులే ఉండటం లేదు. ప్రయివేటు జూనియర్ కాలేజీల ఫీజులపై కచ్చితమైన చట్టం లేకపోవడం కార్పొరేట్ కాలేజీల పాలిట వరంగా మారింది. ఐఐటీ, నీట్ ఫౌండేషన్ అంటూ భారీ ఎత్తున ప్రచారంతో కాలేజీలు విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు కూడా తమ పిల్లల భవిష్యత్తుపై ఆశతో అనేక కష్టాలు పడుతూ ఆయా కాలేజీల్లో చేర్పిస్తున్నారు. దీన్ని అవకాశంగా తీసుకుని కాలేజీలు ఫీజులు పిండేస్తున్నాయి. నారాయణ వంటి కాలేజీలు స్టార్, సూపర్ స్టార్ పేరుతో రూ.లక్షల్లో ఫీజుల రూపంలో తల్లిదండ్రుల నుంచి వసూల చేస్తుండగా... ఏసీ పేరుతో రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు వసూలు చేస్తున్నారు. కానీ రోజుకు గంట కూడా ఏడి ఉండదు. అందులో ఒక రోజు పనిచేస్తే.. మరో రోజు పనిచేయదు. ఇక బుక్స్ పేరిట ఏటా రూ.కోట్లు దుండుకుంటున్నారు. అరకొరగా ఉండే అధ్యాపక సిబ్బందికి అతి తక్కువ వేతనాలిస్తూ,

పర్మిషన్ లేని కాలేజీల్లోనే విద్యార్థుల సూసైడ్



ఇంటర్ బోర్డు పర్మిషన్‌తోనే విద్యాసంస్థలను నడుపుకోవాలి. పర్మిషన్ లేకుండా నడుపుతున్నారంటే ఇంటర్ బోర్డు అధికారులు రూ. లక్షలు కార్పొరేట్ విద్యా సంస్థల దగ్గర తీసుకుంటున్నారు కాబట్టే ఆయా కార్పొరేట్ కాలేజీలు పేద, మధ్యతరగతి ప్రజలను మోసం చేస్తూ.. అడ్డగోలుగా ఫీజులు దండుకుంటున్నారు. విద్యార్థుల సూసైడ్‌లకు ఇదే కారణం. ఇప్పటి వరకు సూసైడ్ చేసుకున్న దాదాపు 300 లకుపైగా విద్యార్థులు పర్మిషన్ లేని కాలేజీల్లోనే. వీటిని అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. నారాయణ వంటి కార్పొరేట్ సంస్థలతో పాటు పర్మిషన్ లేని కాలేజీలను సీజ్ చేయాలి. లేకుంటే రూ.లక్షల ఫీజు వసూళ్లు, అరాచకాలు, చావులు ఇలాగే కొనసాగుతాయి. **అశోక్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి**

కార్పొరేట్ కాలేజీల దోపిడీని అడ్డుకోవాలి



నారాయణ సంస్థలతోపాటు ఇతర కార్పొరేట్ విద్యా సంస్థలు ఫీజుల కోసం విద్యార్థులను వేధించడం దారుణం. కొద్ది రోజుల క్రితం జరిగిన రామంతాపూర్ నారాయణ కాలేజీ వేధింపులు విద్యార్థుల ప్రాణాల మీదకు తెచ్చాయి. వేధింపులకు పాల్పడుతున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి. వెంటనే ప్రభుత్వం, ఇంటర్ బోర్డు కార్పొరేట్ కాలేజీల దోపిడీని అడ్డుకోవాలి. **జి.శ్యామ్, పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు**

ఫీజుల విషయంలో విద్యార్థుల్ని మానసిక ఒత్తిడికి గురిచేస్తూ అవ హేళనీయంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు చెబుతున్నారు. ఇక వసతుల విషయంలో పట్టింపు ఉండదని.. సరిపడ టాయిలెట్లు లేక అమ్మాయిల అవస్థలు వర్ణనాతీతం. ఇక నిబంధనల ఉల్లంఘనపై అధికారులకు ఫిర్యాదు చేస్తే.. వస్తారు.. చూస్తారు.. వెళ్తారు. తప్ప యాక్షన్ ఉండదు. ఇలా అడుగడునా ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కుతున్న నారాయణ వంటి కాలేజీలపై విద్యాశాఖ, ఇంటర్‌బోర్డు కఠినంగా వ్యవహరించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

నేటి మహాధర్నాను విజయవంతం చేయండి

- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్
- హెచ్‌యూజే ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ప్ల కార్డుల ప్రదర్శన



నవతెలంగాణ-ఓయూ

జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఇండ్లు లేదా ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నేడు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఇ.చంద్ర శేఖర్ పిలుపునిచ్చారు. హెచ్‌యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు బుధవారం సికింద్రాబాద్, సీతాఫల్ మండి అంబేద్కర్ విగ్రహం వద్ద ప్ల కార్డులు ప్రదర్శించారు. జర్నలిస్టులకు వెంటనే ఇండ్లు లేదా ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలనీ, సీఎం ఇచ్చిన హామీని అమలు చేయాలనీ, జర్నలిస్టుల ఇతర సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇస్తామని సీఎం కేసీఆర్ పలు సందర్భాల్లో హామీనిచ్చారని గుర్తు చేశారు. ఏండ్లుగా జర్నలిస్టులు ఇండ్ల స్థలాల కోసం ఎదురు చూస్తున్నారనీ, ప్రభుత్వం వెంటనే ఈ విషయంలో నిర్ణయం తీసుకోవాలని కోరారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టే మహా ధర్నాకు పెద్ద ఎత్తున తరలి రావాలని జర్నలిస్టులకు విజ్ఞప్తి చేశారు. సీనియర్ జర్నలిస్టు బ్రహ్మానందం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఉపాధ్యక్షులు రాజశేఖర్, హెచ్‌యూజే కార్యదర్శి జగదీష్, ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు టీవీయస్ పద్మరాజు, హెచ్‌యూజే నాయకులు జి.రేనయ్య, జీవన్ రెడ్డి, ప్రతాప్, తలారి శ్రీనివాసరావు, సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- త్వరలోనే రేకుల షెడ్డు నిర్మాణం
- అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నవతెలంగాణ-అంబర్‌పేట



కార్పొరేట్ విద్యా సంస్థలకు దిటుగా ప్రభుత్వ పాఠశాలలను దీర్చి దిద్దుతున్నామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. అంబర్‌పేట నియోజకవర్గం గోల్నాక డివిజన్‌లోని గంగానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ.25.3 లక్షలతో పూర్తి చేసిన ఆధునీకరణ పనులను ఉపాధ్యాయులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చే క్రమంలో విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారనీ, ఇందుకు "మన బస్తీ-మన బడి" ద్వారా వేల కోట్ల నిధులతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ తీసుకువస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగానే గంగానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తాగునీటి వసతి, టాయిలెట్ల సౌకర్యం, విద్యుత్ సరఫరాతోపాటు విద్యార్థులకు కూర్చోడానికి బెంచీలు, టెబుల్స్ వంటి సౌకర్యాలతో పాటు, తరగతి గదులను సుందరంగా తీర్చిదిద్ది, భవనానికి రంగులు వేసి ముస్తాబు చేయడమే కాకుండా పిల్లలు ఆడుకోవడానికి క్రీడా పరికరాలు ఏర్పాటు చేయడంతో పాటుగా విరివిగా మొక్కలు పెంచి పాఠశాలలో ఆహ్లాదకర వాతావరణాన్ని సృష్టించనున్నట్టు తెలిపారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని మరిన్ని పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించి ప్రయివేటుకు దీటుగా సిద్ధం చేయనున్నామని తెలిపారు. నాణ్యమైన విద్యతోపాటు ఆహ్లాదకర వాతావరణంలో పిల్లలు చదువుకుని మరింతగా రాణించాలన్నదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ఆర్.రోహిణి, డెప్యూటీ ఈఓఎం విజయలక్ష్మి, డెప్యూటీ ఐఓఎస్ ఎండీ ఖాజా నిజాముద్దీన్, సమగ్ర శిక్ష అభియాన్ కో-ఆర్డినేటర్ ఎస్.రజిత, పాఠశాల హెడ్ మిస్ట్రెస్ కె.విజయలక్ష్మి, ఎస్ఎంసీ చైర్మెన్ కె.స్వరూపరాణి, సంబంధిత ఇతర అధికారులు, గంగానగర్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వినాయక్‌నగర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ బాగ్ అంబర్‌పేట డివిజన్, వినాయక్‌నగర్‌లో రూ.22 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ పద్మా వెంకట్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దశల వారీగా అనేక అభివృద్ధి పనులు చేపడుతూ అంబర్‌పేట నియోజకవర్గం రూపురేఖలను మారుస్తూ ముందుకెళుతున్నట్టు తెలిపారు. సీసీ రోడ్డు పనుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, ప్రజలకు ఏ విధమైన ఇబ్బంది కలగకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వినాయక నగర్ లో చేపట్టాల్సిన మరిన్ని అభివృద్ధి పనుల గురించి స్థానిక నాయకులు ప్రజలతో కలిసి చర్చించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు చంద్రమోహన్, సీనియర్ నాయకులు మోర శ్రీరాములు ముదిరాజ్, పులిజాల గెలవయ్య, శివాజీ యాదవ్, కనివేట నర్సింగ్‌రావు, శ్రీనివాస్ యాదవ్, మిరియాల శ్రీనివాస్, వెంకటేశ్, హబీబ్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్‌పై నైపుణ్య శిక్షణ ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా, సెయింట్ ఆన్స్ కాలేజ్ ఫర్ ఉమెన్ సహకారంతో సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్‌పై పీఎంకేవీవై 4.0 కింద ఎన్ఎస్‌డీసీ అండ్ ఏఐసీటీఈతో నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ స్పాన్సర్ చేయబడిన స్కిల్ ట్రెనింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఈ నైపుణ్య శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు గర్వంగా ప్రకటించింది. ఔత్సాహిక విద్యార్థులను సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ రంగంలో అవసరమైన నైపుణ్యాలు, పరిజ్ఞానంతో సన్నద్ధం చేయడం, డైనమిక్ టెక్నాలజీ పరిశ్రమలో వారి కెరీర్ వద్ధిని ప్రోత్సహించడం ఈ చొరవ లక్ష్యం. ఈఎస్‌సీఐ, సెయింట్ ఆన్స్ కాలేజ్ ఫర్ ఉమెన్ మధ్య సహకారం నాణ్యమైన విద్యను ప్రోత్సహించడంలో, సాఫ్ట్‌వేర్‌లో వృత్తిని కొనసాగించడంలో, యువతులను ప్రోత్సహించడంలో భాగస్వామ్య నిబద్ధతను సూచిస్తుంది.

డిజిటల్ ల్యాండ్‌స్కేప్

షెడ్యూల్ చేయబడిన ఈ నైపుణ్య శిక్షణ కార్యక్రమం అకాడెమియా, పరిశ్రమ అవసరాల మధ్య అంతరాన్ని తగ్గించడానికి రూపొందించబడిన సమగ్ర పాఠ్యాంశాలను అందిస్తుంది. ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లు, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ మెథడాలజీలు, డేటాబేస్ మేనేజ్‌మెంట్, వెబ్ డెవలప్‌మెంట్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్‌తో సహా సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామింగ్‌లోని వివిధ అంశాలను కోర్సు కవర్ చేస్తుంది. ఈ ప్రారంభోత్సవ వేడుక నగరంలోని సెయింట్ ఆన్స్ కాలేజ్ ఫర్ ఉమెన్‌లో జరిగింది. విశిష్ట అతిథులు, డైరెక్టర్, డాక్టర్ జి.రామేశ్వర్ రావు అండ్ ఈఆర్. సాయి కిషోర్, ఈఎస్ఐ నుంచి హెడ్, అధ్యాపకులు, పరిశ్రమ టెక్ మహీంద్రా నాయకులు సాయి ప్రశాంత్, బ్లాక్‌చెయిన్ డెవలపర్ ఈ వేడుకకు హాజరయ్యారు. ఈ సహకారం గురించి ఈఎస్‌సీఐ డైరెక్టర్ డా.జి.రామేశ్వర్‌రావు మాట్లాడుతూ 'మేం థ్రిల్ అయ్యాం. సాఫ్ట్‌వేర్‌పై ఈ నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సెయింట్ ఆన్స్ కాలేజ్ ఫర్ ఉమెన్‌తో భాగస్వామి. ప్రోగ్రామింగ్, సాంకేతిక విద్య, సెయింట్ ఆన్స్ కళాశాలలో సీఎస్‌సీఐ నైపుణ్యాన్ని కలపడం ద్వారా మహిళా సాధికారత కోసం నిబద్ధత, మేం ఒక పరివర్తనాత్మక అభ్యాస అనుభవాన్ని సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ కార్యక్రమం యువతులను రాణించడానికి అవసరమైన నైపుణ్యాలను సమకూర్చుతుందని మేం విశ్వసిస్తున్నాం. సాఫ్ట్‌వేర్ అభివృద్ధి పరిశ్రమ, దేశం డిజిటల్ వృద్ధికి దోహదం చేస్తుంది' అనితెలిపారు. సెయింట్ ఆన్స్ కాలేజ్ ఫర్ ఉమెన్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఆర్.పి. అమృత మాట్లాడుతూ 'ఈఎస్‌సీఐతో మా సహకారం సంపూర్ణ విద్యను అందించడం, మా విద్యార్థులకు సాధికారత కల్పించడం మా మిషన్‌లో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. ఈ నైపుణ్య శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించడానికి మేం సంతోషిస్తున్నాం. పరిశ్రమ నిపుణుల మార్గదర్శకత్వంలో మా విద్యార్థులకు వారి సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామింగ్ నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశాన్ని అందిస్తున్నాం. ఈ కార్యక్రమం మా పాల్గొనేవారికి ఉత్తేజకరమైన కెరీర్ అవకాశాలకు తలుపులు తెరుస్తుందని మేం విశ్వసిస్తున్నాం' అని తెలిపారు. ఈఎస్‌సీఐ హెడ్ సాయి కిషోర్ సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్ ప్రాముఖ్యత, విద్యార్థులకు దాని ప్రయోజనాలపై సంక్షిప్త వివరణ ఇచ్చారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో విద్యార్థి వ్యవహారాల డీన్ మహిత దావల కృతజ్ఞతలు తెలిపారు.

94 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. 94 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గృహిణి అదృశ్యం

నవతెలంగాణ-ఓయూ



గృహిణి అదశ్యమైన ఘటన ఉస్మానియా విశ్వవిద్యాలయం పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి వివరాల ప్రకారం హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 8, జెఎస్ఎన్, కాలనీకి చెందిన ఎం.లక్ష్మి, భర్త సోమయ్య ఈ నెల 10వ తేదీన ఉదయం 7గంటలకు ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల వద్ద ఆరా తీయగా ఆచూకీ తెలియకపోవడంతో ఆమె కుమారుడు శ్రీధర్ ఓయూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు. సదరు మహిళలకు మతిస్థిమితంలేదు. వివరాలు తెలిసిన వారు 8712661263 ఈ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సైదులకు సన్మానం

నవతెలంగాణ-ఓయూ



ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ (అంసా) ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షులుగా ఎన్నికైన నామ సైదులును ఓయూ లా కళాశాల విద్యార్థులు బుధవారం సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ లా విద్యార్థులు పట్టేటి సుధాకర్, కోరే మహేష్, భూతం రఘు, వేముల శివ, కోల మహేష్, రఫీ, గుండు రాజేష్ సతీష్, నగేష్, సురేష్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని యాచకుడు మృతి

నవతెలంగాణ-అడిక్‌మెట్



గుర్తు తెలియని యాచకుడు మృతి చెందిన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల విరాల ప్రకారం వీఎస్‌టీ కట్ట మైసమ్మ ఆలయం వద్ద ఫుట్ పాత్ పై బిక్షాటన చేస్తూ జీవితం సాగిస్తున్న గుర్తు తెలియని యాచకుడు (45) మృతి చెంది పడి ఉండడాన్ని గమనించి స్థానికులు నల్లకుంట పోలీస్ స్టేషన్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని యాచకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతుడి వివరాల కోసం దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 44 వేల టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

- తెలంగాణ నిరుద్యోగ జాక్ చైర్మెన్ వెంకటేష్
- మంత్రి సబిత ఇందిరా రెడ్డితో చర్చలు



నవతెలంగాణ-అడిక్‌మెట్

ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 44 వేల టీచర్ పోస్టులు వెంటనే భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీచేయాలని తెలంగాణ నిరుద్యోగ జాక్ ఛైర్మన్ నీల వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నిరుద్యగ అభ్యర్థులతో కలిసి విద్యాశాఖ మంత్రి సబిత ఇందిరా రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నీల వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాటశాలల్లో 24 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఎయిడెడ్ పాటశాలల్లో 4900 టీచర్ పోస్టులు, ఆదర్శ పాటశాలల్లో 2000, కస్తుర్బా పాటశాలల్లో 1500 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నవి. ఇవిగాక ప్రభుత్వ పాటశాలల్లో 4 వేల కంప్యూటర్ టీచర్ పోస్టులు, 10 వేల పి.ఇ.టి. పోస్టులు, 5 వేల ఆర్ట్స్, క్రాఫ్ట్ అండ్ డ్రాయింగ్ పోస్టులు, 3 వేల లైబ్రేరియన్ పోస్టులు, 4 వేల జూనియర్ అసిస్టెంట్ పోస్టులు, 10 వేల అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నవి. ఇంత పెద్దఎత్తున ఖాళీగా ఉంటె భర్తీ చేయకుండా ఇటు విద్యార్థుల భవిష్యత్ అటు నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందన్నారు. టీచర్ పోస్టులు భర్తీ చేయకుండా ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తుందన్నారు. ఒకవైపు ప్రభుత్వం పర్మి నెంట్ టీచర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో విద్యార్థులు విద్యా ప్రమాణాలు దెబ్బ తింటున్నాయి. పర్మనెంట్ టీచర్లను నియమించకుండా టెంపరరీ టీచర్లకు రకరకాల పేర్లతో నియమించి విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్ విద్యాసంస్థలు రాష్ట్ర ప్రజలను దోచుకుని అప్పుల పాలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేటు కాలేజీలను క్రమబద్ధీకరించకపోతే ప్రజలే వాటిని మూసివేస్తారని హెచ్చరించారు. ఈ చర్చల్లో ఊర్మిళ, అనురాధ, శిరీష, రామాదేవి, స్వప్న, వెన్నల, శృతి, గీత తదితరులు పాల్గొన్నారు.

కుట్టి వెల్లోడి ప్రభుత్వ హాస్పిటల్‌ను అధునాతనంగా తీర్చిదిద్దాలి

నవతెలంగాణ-ఓయూ



సీతాఫల్‌మండిలో అన్ని అధునాతన హంగులతో కుట్టి వెల్లోడి ప్రభుత్వ హాస్పిటల్‌ను కొత్తగా ఏరియా హాస్పిటల్ తరహాలో తీర్చిదిద్దాలని డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అధికారులను ఆదేశించారు. హాస్పిటల్ కొత్త భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.12.75 కోట్లు మంజూరు చేసిన నేపథ్యంలో కొత్త భవనాల నిర్మాణ పనులను చేపట్టే అంశంపై బుధవారం పద్మారావు గౌడ్ సీతాఫల్‌మండిలోని క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. రవాణాశాఖ మంత్రి, ఆర్టీసీ చైర్మన్, ఆర్టీసీ ఎండీతో డిప్యూటీ స్పీకర్ పద్మారావు స్వయంగా సంప్రదించి కుట్టి వెల్లోడి పాత హాస్పిటల్‌ను మెట్టుగూడలోని ఆర్టీసీ బిల్డింగ్‌లోకి తాత్కాలికంగా తరలించేందుకు ఏర్పాట్లు జరిపారు. అర్బన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ తరలింపునకు కూడా వెంటనే ఏర్పాట్లు జరపాలనీ, వీలైనంత త్వరగా కొత్త భవన సముదాయం నిర్మించేందుకు ఏర్పాట్లు జరపాలని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో కొత్త హాస్పిటల్ భవనాల నిర్మాణం తీరు తెన్నులను ఈ సందర్భంగా సమీక్షించారు. అన్ని ఆధునాత హంగులు కొత్త హాస్పిటల్‌లో కల్పించాలనీ, ప్రసూతి సేవలు మొదలుకుని అన్ని వైద్య పరీక్షల నిర్వహణ, శస్త్ర చికిత్సలకు అనువుగా హాస్పిటల్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో వైద్యాధికారి డాక్టర్ సక్కుబాయి, వివిధ వైద్య కేంద్రాల అధికారులు, వైద్య విధాన పరిషత్ అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

నేడు డబుల్ బెడ్ రూం ఇండ్లు ప్రారంభం

నవతెలంగాణ-సిటీబ్యూరో

జూబ్లీహిల్స్ నియోజకవర్గం కమలానగర్‌లో నిర్మించిన 210 డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణ సముదాయాన్ని గురువారం రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించనున్నారు. ఈ ఇండ్ల నిర్మాణాన్ని మొత్తం రూ. 16 కోట్ల 27 లక్షల 50 వేల వ్యయంతో నిర్మించారు. రూ.15 .50 లక్షల వ్యయంతో మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపట్టారు. ఈ కాలనీకి 100 కె.ఎల్ లీటర్ల కెపాసిటీ గల వాటర్ ట్యాంక్, విద్యుత్ సౌకర్యంతో పాటుగా 15 షాపులు కూడా ఏర్పాటు చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ పాల్గొంటారు.

రాజ్యాధికారం కోసం బీసీలు పోరుబాట పట్టాలి

- ఎన్నాళ్లు బానిల్లా బతుకుతారు
- ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు ప్రాధాన్యం
- బీసీ బంధు ప్రవేశపెట్టాలి
- బీఆర్ఎస్ బీసీ వ్యతిరేక ప్రభుత్వం
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

నవతెలంగాణ-అడిక్‌మెట్

బీసీలు తమ జనాభా ప్రకారం వాటా కోసం, రాజాధికారం కోసం పోరుబాట పట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. బుధవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో రాష్ట్ర బీసీ యువజన సంఘం సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. బీసీలు ఆయా పార్టీల జెండాలు మోసుకుంటూ ఎన్నాళ్ళు బానిస బతుకులు బతుకుతారని ప్రశ్నించారు. ఈ రాజకీయ పార్టీలు బీసీలను జెండాలు మోసే కార్యకర్తలుగా, జిందాబాద్‌లు కొట్టే కూలీలుగా చూస్తున్నారన్నారు. పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బీసీలకు మంత్రి పదవులతోపాటు రాజ్యసభ,, ఎమ్మెల్సీ, కార్పొరేషన్ చైర్మన్‌లతో 60 శాతం పదవులు ఇచ్చి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. పార్లమెంట్ బీసీ బిల్లు పెట్టి చరిత్ర సృష్టించారు. రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు రూ.38 వేల కోట్లు కేటాయించి రికార్డు సృష్టించారని చెప్పారు. బీసీలు ముఖ్యమంత్రి ఉన్న రాష్ట్రంలో కూడా బీసీలకు అధికారం, సంపద, బడ్జెటులో గౌరవంలో ఇంత ప్రాదాన్యత ఇవ్వలేదన్నారు. మన రాష్ట్రం ప్రభుత్వం బీసీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతుంధన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీల సమస్యలపై ఉన్నత స్థాయి సమావేశం జరిపి వారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. వెంటనే "బీసీ బంధ" పథకం ప్రవేశపెట్టి ప్రతి కుటుంబానికీ రూ.10 లక్షలు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ, మల్లేష్, మోడీ రాందేవ్, వై.శ్రీనివాస్, పంజా జశ్వంతి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



నాలా పూడికతీత పనులను ముమ్మరం చేయండి



నవతెలంగాణ-అడిక్‌మెట్

రామన్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అశోక్‌నగర్ నాలాకు ఆనుకుని ఉన్న అన్ని చోట్ల నాలా పూడికతీత పనులను ముమ్మరం చేయాలని కార్పొరేటర్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అశోక్ నగర్ లో జరుగుతున్న నాలా పూడికతీత పనులను బుధవారం సంబంధిత అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న వర్షా కాలం దృష్ట్యా నాలా పరివాహక ప్రాంతాల్లో ప్రజలకు వరద నీటితో సమస్యలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముందు ఉన్న లోతు కంటే మరింత లోతుగా పూడికతీత జరిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యువ నాయకులు వినయ్ కుమార్, నాయకులు ఆకుల సురేందర్, ఎం.ఉమేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, కాంట్రాక్టర్ లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కారం

నవతెలంగాణ-అడిక్‌మెట్



ముషీరాబాద్ నియోజకవర్గంలోని అడిక్‌మెట్ డివిజన్ మదర్ హై స్కూల్లో పదో తరగతి పరీక్షల్లో 10/10 వచ్చిన విద్యార్థులకు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాంనగర్ డివిజన్ ప్రెసిడెంట్ రావులపాటి మోజస్, మాధవ్, రవి యాదవ్, రాజు చారి, సునీల్, ఎం.వి జనార్ధన్ పాఠశాల చైర్మన్ పుష్పలత పాఠశాల కరస్పాండెంట్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

మొండెం లేని మహిళ తల కలకలం..

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ మలక్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తీగలగూడలోని మూసీ కాలువ వద్ద మొండెం లేని మహిళ తల లభ్యం కావడం సంచలనం రేపింది. పోలీ సులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. బుధవారం ఉదయం 7:30 గంటలకు తీగలగూడలోని మూసీ కాలువ వద్ద నల్లటి కవర్‌లో మొండెం లేని మహిళ తలను పారిశుధ్య కార్మికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమా చారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని తలను స్వాధీనం చేసుకుని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన మహిళ వయసు 30-45 ఏండ్ల మధ్య ఉంటుందని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. పరిసర ప్రాంతాల్లో హత్య చేసి తీసుకువచ్చారా, లేక వేరే ప్రాంతం నుంచి తీసుకువచ్చి పడేశారా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. మహిళ మొండెం, ఆచూకీ కోసం గాలిస్తున్న పోలీసులు సమీపంలోని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. అలాగే సౌత్‌జోన్ అడిషనల్ డీసీపీ ఆనంద్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఈనెల 20న ఉచిత హెల్త్ క్యాంప్



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ఈనెల 20వ తేదీన కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నామని బీఆర్ఎస్ గన్ ఫౌండ్రీ డివిజన్ ఉ పాధ్యక్షులు జగదీష్ గుప్తా తెలిపారు. బుధవారం కోఠిలో ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదిన గుజరాతీ గల్లీలోని చిన్న గణపతి దేవాలయం వద్ద ఉన్న గుజ రాతీ ప్రగతి సమాజ్ భవన్ లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ హెల్త్ క్యాంపు ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నకిలీ ఇమ్మిగ్రేషన్ కన్సల్టెన్సీ గుట్టురట్టు

- నలుగురు నిందితుల అరెస్టు



నవతెలంగాణ-సిటీబ్యూరో

నకిలీ ఇమ్మిగ్రేషన్ కన్సల్టెన్సీ గుట్టును ఎల్‌బీనగర్ ఎస్‌వోటీ పోలీసులు రట్టు చేశారు. నలుగురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి ఫేక్ ఐడీకార్డులు, పాస్‌పోర్ట్స్, విదేశాలకు చెందిన పత్రాలు, బ్యాంక్ స్టేట్ మెంట్స్, రూ.18వేల నగదుతోపాటు రూ.7,02,970 నగదును బ్యాంక్‌లో ఫ్రీజ్ చేశారు. బుధవారం డీసీపీ జానకి మీడియాకు వివరాలను తెలిపారు. సికింద్రాబాద్‌కు చెందిన జీ.వీ.దుర్గా నాగేశ్వర సిద్దార్థ్, ఓల్డ్ అల్వాల్‌కు చెందిన ఎన్.ప్రభాకర్ రావు, బోడుప్పల్‌కు చెందిన జీ.నాగరాజులు ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఉన్నత చదువులకు, విజిటింగ్ వీసాపై అమెరికాతోపాటు ఇతర దేశాలకు వెళ్లేవారికి కావాల్సి వారికి నకిలీ పత్రాలను తయారుచేసి పంపిస్తున్నారు. అందుకు ఒకొక్కరి నుంచి లక్షల్లో వసూళ్లు చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ముగ్గురు నిందితులతోపాటు పత్రాలు కొనుగోలు చేసిన నిజామాబాద్‌కు చెందిన జే.నాగేశ్వర్‌ని అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు డీ.జానకీ, మురళీధర్, ఇన్‌స్పెక్టర్ ఏ.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు అగ్రీ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు ప్రారంభం

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండలంలోని రాయిలాపూర్, పూడూరు రైతు వేదికలలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను శుక్రవారం మేడ్చల్ జిల్లా జడ్జి శుక్రవారం ప్రారంభిస్తారని మండల వ్యవసాయ అధికారి అర్చన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూడూరు గ్రామంలో ఉదయం 9గంటలకు, రాయిలాపూర్ గ్రామంలో 10 గంటలకు ప్రారంభిస్తారని అన్నారు. పారా లీగల్ వాలంటీర్ల ద్వారా రైతుల హక్కులు, భాధ్యతలు ,సమస్యల పరిష్కారానికి చట్టపరమైన మార్గాల గురించి అవహన కల్పించినట్టు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని డీపీ కాలనీలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ 26వ వార్షికోత్సవంలో బుధవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శంకర్ శాస్త్రి, మాజీ కౌన్సిలర్ బొబ్బ రంగారావు , బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు వెంకటస్వామి, యూసుఫ్, అనిల్ , ప్రభాకర్ , పద్మజ రెడ్డి , కాలనీ ప్రెసిడెంట్ శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

మేడ్చల్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాథోడ్ సంతోష్



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తానన్న హామీని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి నిలబెట్టుకోని కాలేజ్ ప్రారంభం అయ్యేటట్టు చూడాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాథోడ్ సంతోష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మేడ్చల్ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని అనేక సంవత్సరాల నుంచి విద్యార్థులు, ఎస్ ఎఫ్ఐ పోరాటాలు చేస్తున్నా పాలకులు పట్టించుకో లేదన్నారు.మంత్రి మల్లారెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తీసుకొచ్చి బిల్డింగు కట్టించేంతవరకు తన సీఎంఆర్ కళాశాలలో నడిపిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల గురించి ఇప్పుడు ఎక్కడా మాట్లాడట్లేదని విమర్శించారు. మేడ్చల్ నియోజకవర్గంలో మండలనికి ఒక్క జూనియర్ కళాశాల,డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామన్న మంత్రి హామీ నిల్లబెట్టుకోవలని కోరారు. విద్యార్థుల, నియోజకవర్గాల్లో ఉన్న సమస్యల్ని మర్చిపోయి తన వ్యక్తిగత కళాశాల గురించి ప్రచారం చేసుకోవడం సిగ్గు చేటని ఆగ్రహం వ్యక్తం చేశారు.మేడ్చల్ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నియోజవర్గంలోని ప్రతి మండలంలో ఒక్క జూనియర్ కళాశాల ఏర్పాటు చేయకపోతే మంత్రిని అడుగడుగున అడ్డుకుంటామన్నారు.

సమస్యలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్
- సుభాష్ నగర్ డివిజన్ డీపీ కాలనీలో 61 రోజు పాదయాత్ర



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని డీపీ కాలనీలో "ప్రగతి యాత్ర"లో భాగంగా 61వ రోజు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పర్యటించారు. ఈ సందర్భంగా పాదయాత్ర చేస్తూ పూర్తి చేసిన అభివృద్ధి పనులను పరిశీలించి.. చేపట్ట వలసిన పనులను తెలుసుకున్నారు. కాగా పార్క్ అభివృద్ధి, సీసీ రోడ్ల ఏర్పాటుకు కృషి చేయాలని ఎమ్మెల్యే దృష్టికి కాలనీవాసులు తీసుకురాగా అక్కడే ఉన్న అధికా రులకు ఎమ్మెల్యే ఆదేశాలు ఇచ్చారు. వాటి వ్యయ ప్రణాళికలు సిద్ధం చేసి త్వరలోనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ పాపమ్మ , డీజీఎం అప్పల నాయుడు, మాజీ కౌన్సిలర్ బొబ్బ రంగారావు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్ , సీనియర్ నాయకులు వెంకటస్వామి, యూసుఫ్ , మన్నన్, అనిల్ ప్రభాకర్ , పద్మజా రెడ్డి ,విష్ణు, శేఖర్, కాలనీ ప్రెసిడెంట్ శేఖర్ గౌడ్ , సుధీర్ రెడ్డి, రంగస్వామి, ఖాజా , శ్రీనివాస్, పద్మి , వీరేశం గౌడ్ ,వాసు, లలిత గౌడ్ , శీను , లలిత్ కుమార్, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.



శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన బీజేపీ రాష్ట్ర యువ నాయకుడు రవి కుమార్ యాదవ్ జన్మ దిన వేడుకలు, బుధావారం మసీదు బండలోని ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్, బీజేపీ కూకట్ పల్లి సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు పాల్గొన్నారు. కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సత్కరించారు. స్థానిక బీజేపీ నాయకులు, మహిళా నాయకురాళ్ళు, కార్తకర్తలుపాల్గొని రవి కుమార్ యాదవ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ - కూకట్ పల్లి

'కల్యాణ లక్ష్మి'తో పేదలకు పెద్దన్నగా సీఎం కేసీఆర్

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ - కూకట్ పల్లి

రాష్ట్రంలో అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాయని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయంలో 137 మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా నిరు పేద ఆడబిడ్డ పెండ్లికి 1 లక్ష 116 రూపాయలు అందించి సీఎం కేసీఆర్ వారికి పెద్దన్నగా మారారని తెలిపారు. దేశంలో మరెక్కడా ఈ పథకం లేదన్నారు. అనేక ప్రాజెక్టుల ద్వారా బీడువారిన భూములను పచ్చని పంట పొలాలుగా మార్చిన ఘనత కేసీఆర్ చెల్లుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పండాల సతీష్ గౌడ్, పగుడాల శిరీష బాబురావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

ఈనాటి యువతే రేపటి భవిష్యత్తు అనిఎమ్మెల్యే మాధవరం కష్ణారావు అన్నారు. కూకట్ పల్లి శేషాద్రి నగర్ కమ్యూనిటీ హాల్లో బుధవారం చైతన్య యాదవ్, సంతోష్, మహేష్ ఆధ్వర్యంలో జరిగిన యూత్ ఇంట్రాక్షన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. నేడు రాజకీయ నాయకులు తీసుకునే నిర్ణయాలే యువత భవిష్యత్తుకి మార్గదర్శకాలు కూడా అవుతాయని అనడంలో సందేహం లేదన్నారు. ఇందుకు నిదర్శనం.. మంత్రి కేటీఆర్ ఎన్నోవేల పరిశ్రమలను నేడు ముందుచూపుతో హైదరాబాద్ మహానగరానికి తీసుకువచ్చి భవిష్యత్తులో యువతకు ఉద్యోగ అవకాశాలు లభించే విధంగా చర్యలు తీసుకోవడం గొప్ప పరిణామం అన్నారు .అలాగే భవిష్యత్తును దష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం వంటి నీటి ప్రాజెక్టులు నిర్మించి ఒకప్పుడు బీడు భూములుగా ఉండే నేలలను పంట భూములుగా మార్చారని చెప్పారు. ఫణి ముదిరాజ్, శ్రీధర్, విశ్వనాథరెడ్డి ,లడ్డు, 130 మంది యువకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.



సునీల్ శర్మను కలిసి టీఎస్‌పీఈఏ బృందం

నవతెలంగాణ-సిటీబ్యూరో



నూతన సచివాలయం ప్రారంభమైన తర్వాత మొదటిసారిగా తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్(టీఎస్‌పీఈఏ) బృందం బుధవారం ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆయనకు బొకే అందించి శాలువా సన్మానించారు. టీఎస్‌పీఈఏ ఇన్‌చార్జి ప్రెసిడెంట్ వెంకట నారాయణ రెడ్డి సెక్రటరీ జనరల్ సదానందం, శివశంకర్, శ్రీధర్, జనప్రియ, గోపాల్ రావు, కిషోర్ కుమార్, శ్యాంసుందర్ రెడ్డి, సురేష్ కుమార్ , పి.వి.రావు, పవన్ కుమార్, ప్రశాంత్, విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

నేడు దంపనబోయిన శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



శెట్టిబలిజ సంఘం జంట నగరాల అధ్యక్షులు(వై. ఎఫ్. సి. ఏ.) మల్లారెడ్డి నగర్ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు, సంఘ సేవకులు, దంపనబోయిన శ్రీనివాస్ జన్మదిన వేడుకలు గురువారం సాయంత్రం మల్లారెడ్డి నగర్‌లోని ఆయన నివాసం వద్ద నిర్వహి స్తున్నట్టు బుధవారం ప్రకటనలో తెలిపారు. తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ కులస్తులు, పలు జిల్లాల, నియోజకవర్గ, కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరవ డంతోపాటు ప్రజా ప్రతినిధులు, సన్నిహితులు, పాల్గొం టారని తెలిపారు.

ఏఐటీయూసీ మున్సిపల్ కార్మిక సంఘ రాష్ట్ర మహా సభలు జయప్రదం చేయాలి

- రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్య దర్శులు కే .ఏసురత్నం, మంద వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట.

జూన్ 6,7 తేదీల్లో మేడ్చల్ పట్టణంలో జంగా లక్ష్మయ్య పంక్షన్ హాల్ లో జరగబోయే తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్ష కార్య దర్శులు కే .ఏసురత్నం, మంద వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం మేడ్చల్ జిల్లాలో విస్తతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యే కె.పి. వివేకానందలకు వేరువేరుగా కరపత్రాలు అందజేసి మహా సభల విజయవంతానికి సహకరించాలని కోరారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మున్సిపల్ కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ ఉద్యోగ కార్మిక సిబ్బంది పక్షాన ప్రభుత్వంపై పోరాటాలు నిర్వహిస్తూ 10వ పీఆర్సీ, 11వ పీఆర్సీ జీఓ. నెంబర్ 14 వేతనాలు పెంపు కోసం సిబ్బంది విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిండలో అలుపెరుగని పోరాట పటిమ కలిగిన సంఘం ఏఐటీయూసీ అని కొనియాడారు. భవిష్యత్తు ఉద్యమాల నిర్వహణ కోసం ఏఐటీయూసీ మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర మహా సభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.మహాసభలను ఉద్యోగ, కార్మిక సిబ్బంది జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. రవిచంద్ర, జిల్లా అధ్యక్షులు డాక్టర్. రాములు తదితరులు పాల్గొన్నారు.

పెలికాన్ సిగ్నల్స్ ఎంతో ఉపయోగకరం

- నగర సీపీ సీవీ ఆనంద్
- ట్యాంక్‌బండ్‌పై పెలికాన్ సిగ్నల్స్‌ను ప్రారంభించిన నగర సీపీ సీవీ ఆనంద్



నవతెలంగాణ-సిటీబ్యూరో

పెలికాన్ సిగ్నల్స్ ఎంతో ఉపయోగ కరమని నగర సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. బుధవారం ట్యాంక్‌బండ్‌పై పెలికాన్ సిగ్నల్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు సీపీ సుధీర్‌బాబుతో కలిసి సీపీ మాట్లాడారు. నగరంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ప్రజలు ఉపయోగించడం లేదన్నారు. ట్రాఫిక్‌లో రోడ్ దాటేందుకు పెలికాన్ సిగ్నల్స్ చాలా ఉపయోగపడుతాయన్నారు. హైదరాబాద్‌లో 30 పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రతీ పెలికాన్ సిగ్నల్ వద్ద వాలెంటీర్స్ ఉన్నారని చెప్పారు. ప్రతీ ఏడాది రోడ్డు ప్రమాదాల్లో 45 శాతానికి పైగా పాదాచారులే చనిపోతున్నారని, ఈ ఏడాది ఇప్పటి వరకు 50 మంది పాదాచారులు మృతి చెందినట్టు తెలిపారు. రోడ్డు దాటుతున్న సమయాల్లోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పెలికాన్ సిగ్నల్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సేఫ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా మహిళల భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు.పెలికాన్ సిగ్నలింగ్ సిస్టమ్ ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందన్నారు. మూడు కమిషనరేట్ పరిధిల్లో సిగ్నల్ సిస్టమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. కొన్ని దేశాల్లో ఇలాంటి సిస్టమ్ ఆటోమేటిక్‌గా పనిచేస్తున్నాయని తెలిపారు. ఫుట్‌పాత్‌లు, పెలికాన్ సిగ్నల్స్ ఉపయోగంపై ప్రజల్లో అవగాహన తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసుల కోసం బ్యాగ్ కిట్, బాడీ ఓన్ కెమెరాలు కిట్స్ అందజేశారు. ఈ కార్యాక్రమంలో జాయింట్ సీపీ గజారావుభూపాల్‌తోపాటు జీహెచ్ఎంసీ నోడల్ ఆఫీసర్ ప్రియాంకా, ట్రాఫిక్ ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



శర్వా .. పెళ్ళి సందడి మొదలైంది

హీరో శర్వానంద్ పెళ్ళి సందడి మొదలైంది. రక్షితతో ఆయన వివాహం రాజస్థాన్‌లోని జైపూర్ లీలా ప్యాలెస్‌లో జూన్ 3న అంగరంగవైభవంగా జరుగనుంది. జూన్ 2న మెహందీ ఫంక్షన్, మరుసటి రోజు పెళ్లి కొడుకు ఫంక్షన్‌ని వేడుకగా చేయబోతున్నారు. అదే రోజు వివాహ మహోత్సవం రాత్రి 11 నుండి ప్రారంభమవుతుంది. శర్వానంద్, రక్షితల నిశ్చితార్థం జనవరిలో జరిగిన విషయం విదితమే. హైదరాబాద్‌లో జరిగిన వేడుకలో ఇరు కుటుంబసభ్యులు, పలువురు ప్రముఖుల సమక్షంలో వీళ్ళిద్దరి ఎంగేజ్‌మెంట్ జరిగింది.

బిచ్చగాడు 2 హిట్ ఖాయం

విజయ్ ఆంటోనీ స్వీయ దర్శకత్వంలో 'బిచ్చగాడు 2' సినిమా ఈనెల 19న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతోంది. విజయ్ ఆంటోని ఫిల్మ్


అడివిశేష్, విజయ్ ఆంటోని, ఆకాష్ పూరి

కార్పోరేషన్ బ్యానర్ పై ఫాతిమా విజయ్ ఆంటోని ఈ సినిమాను నిర్మించారు. కావ్యా థాపర్ నాయికగా నటించారు. తెలుగులో ఈ సినిమాను ఉషా పిక్చర్స్ బ్యానర్‌పై విజయ్‌కుమార్, వీరనాయుడు సంయుక్తంగా రిలీజ్ చేస్తున్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరోలు అడివి శేష్, ఆకాష్ పూరిలు ముఖ్య అతిథులుగా వచ్చారు. అడివి శేష్ మాట్లాడుతూ, 'ఈ సినిమా కోసం ఫాతిమా, విజయ్ ప్రాణం పెట్టారు' అని అన్నారు. "బిచ్చగాడు' సినిమా ఓ చరిత్రను సృష్టించింది. అలాగే ఈ సినిమా కూడా పెద్ద హిట్ అవ్వాలి' అని ఆకాష్ పూరి చెప్పారు. విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ, 'తెలుగు ప్రేక్షకులు చూపిస్తున్న అభిమానానికి. ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్న వీరమనాయుడు, విజయ్‌కి థాంక్స్. భాషా శ్రీ, గౌరవ్, నన్ను ప్రమాదం నుంచి కాపాడిన కావ్యకు, నా భార్య ఫాతిమాకు థ్యాంక్స్. ఫస్ట్ పార్ట్‌లో ఉన్న ఎలిమెంట్స్ అన్నీ కూడా రెండో పార్ట్‌లోనూ ఉంటాయి. బిచ్చగాడు మొదటి పార్ట్ నచ్చిన అందరికీ కూడా రెండో పార్ట్ నచ్చుతుంది' అని తెలిపారు.

నవచిత్రం

యూత్‌ఫుల్ సిరీస్


నిహారిక

నిహారిక కొణిదెల, వైవా హర్ష , అక్షయ్, సాయి రోనక్, భావనలు ప్రధాన పాత్రలో తెరకెక్కిన వెబ్ సిరీస్ 'డెడ్ పిక్సెల్'. అక్షయ్ పూల్ల అందించిన కథతో ఆదిత్య మందల ఈ ప్రాజెక్ట్‌ని రూపొందించారు. బీబీసీ స్టూడియోస్ ఇండియన్ ప్రై.లి., తమడా మీడియా ప్రై.లి బ్యానర్ల మీద సమీర్ గోగటే, సాయిదీప్ రెడ్డి బొర్ర, రాహుల్ తమడా ఈ వెబ్ సిరీస్‌ను నిర్మించారు. డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో ఈ వెబ్ సిరీస్ శుక్రవారం నుంచి స్ట్రీమింగ్ కాబోతోంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో దర్శకుడు ఆదిత్య మాట్లాడుతూ, 'ఇది యువతకు ఎక్కువగా కనెక్ట్ అయ్యే వెబ్ సిరీస్. ఒక్కో పాత్రకు ఒక్కో కారెక్టరైజేషన్ ఉంటుంది. జీవితంలోని ఒక్కో దశకు ఒక్కో పాత్ర ప్రతీకగా ఉంటుంది. నిహారిక చేసిన పాత్రలో గ్రే షేడ్స్ ఉంటాయి' అని తెలిపారు.'ఇది నాకు ఎంతో ప్రత్యేకం. నన్ను నేను కూడా గాయత్రి పాత్రలో ఊహించుకోలేను. కానీ మా దర్శకుడు ఆదిత్య నన్ను నమ్మి నాకు ఈ పాత్రను ఇచ్చారు. ఏ వయసు వాళ్లైనా ఈ వెబ్ సిరీస్‌ను చూడొచ్చు. అయితే యంగ్ జనరేషన్‌కు ఎక్కువగా కనెక్ట్ అవుతుంది' అని నిహారిక చెప్పారు.

నా ఫ్రెండ్‌దేమో పెళ్ళి..


జయతి

గత రెండేళ్ళలో తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ భాషల్లో నివృతి సంస్థ 50కి పైగా మ్యూజిక్ వీడియో సాంగ్స్‌ను అందించింది. వీటిలో 'జరీ జరీ పంచెకట్టి, గుంగులు, సిలక ముక్కుదానా, జంజీరే, వద్దన్నా గుండెల్లో 'సేరి' వంటి పాటలు మంచి రెస్పాన్స్‌ని రాబట్టుకున్నాయి. లేటెస్ట్‌గా 'నా ఫ్రెండ్‌దేమో పెళ్లి..' అనే పాటను నటుడు జేడీ చక్రవర్తి రిలీజ్ చేశారు. నివృతి వైబ్స్ నుంచి మరో తెలంగాణ జానపద పాట మ్యూజిక్ వీడియోగా మన ముందుకు వచ్చింది. ఈ పాటలో జయతి ప్రధాన భూమికను పోషించి, అద్భుతమైన హావ భావాలతో, మూమెంట్స్‌లో కట్టి పడేసింది. మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ సిసిరోలియో ఈ సాంగ్‌కు సంగీత సారథ్యాన్ని వహించారు. శ్రావణ భార్గవి అద్భుతంగా పాడి ఈ పాటకు ప్రాణం పోశారు. భాను మాస్టర్ సాంగ్‌కి చక్కని కొరియోగ్రఫీ చేశారు. లిరిసిస్ట్ కాసర్ల శ్యామ్ మరోసారి తన పెన్ పవర్ ఎలా ఉంటుందో చూపించారు. జయతి విజన్స్ సమర్పణలో శ్రీకోనేటి ఈ పాటను డైరెక్ట్ చేశారు. 2024 పూర్తయ్యేసరికి దాదాపు 150కి పైగా మ్యూజిక్ వీడియో సాంగ్స్‌ను అందించటానికి సన్నాహాలు చేస్తున్నట్లు నివృతి వైబ్స్ సంస్థ తెలిపింది.


విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య, రష్మిక మందాన్న, ఆనంద్ దేవరకొండ

అలరించే మ్యూజికల్ ఫిల్మ్

మాస్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఎస్కేఎన్ నిర్మాణంలో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య, విరాజ్ అశ్విన్ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'బేబీ'. 'ప్రేమిస్తున్నా' అనే మూడో పాటను కథానాయిక రష్మిక మందాన్న రిలీజ్ చేసి, ఈ సాంగ్ తనకెంతో బాగా నచ్చిందని చెప్పారు. ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ, 'ఇదొక మ్యూజికల్ ఫిల్మ్. ఓ నలభై, యాభై ఏళ్ల తరువాత కూడా 'ప్రేమిస్తున్నా' పాటని వింటాం' అని అన్నారు. సాయి రాజేష్ మాట్లాడుతూ,'ఈ పాట బ్లాక్ బస్టర్ అవుతుంది, సినిమాను జూలై 14న రిలీజ్ చేయబోతోన్నాం' అని చెప్పారు. 'ఈ సినిమాకు ఇంత మంచి మ్యూజిక్ రావడానికి కారణం విజయ్ బుల్గానిన్, పవన్ కళ్యాణ్. విజయ్ టాలెంట్ వల్లే ఈ సినిమా పాటలు ఇంతగా హిట్ అయ్యాయి' అని నిర్మాత ఎస్‌కేఎన్ అన్నారు.

దర్శకురాలు నందిని రెడ్డి దర్శకత్వంలో సంతోష్ శోభన్, మాళవిక నాయర్ జంటగా రూపొందిన చిత్రం 'అన్నీ మంచి శకునములే'. నేడు (గురువారం) ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నేపథ్యంలో దర్శకురాలు నందిని రెడ్డి బుధవారం మీడియాతో ముచ్చటించారు. 'ఇది కొత్త పాయింట్‌తో ఉండే సినిమా. సంతోష్, మాళవికతో పాటు మిగిలిన పాత్రలకూ ప్రాధాన్యత ఉన్న కథ ఇది. విక్టోరియా పురం అనే ఊరి కథ. ఆ ఊరికి ఈ పాత్రలకు సంబంధం ఏమిటి?, లవ్ స్టోరీకి ఏమిటి సంబంధం? ఇలా అన్ని లింక్‌తోనూ ఉంటాయి. ఆంధ్ర, తమిళనాడు బోర్డర్‌లో ఉన్నదే

బెస్ట్ క్లైమాక్స్


నందిని రెడ్డి

విక్టోరియా పురం. కాఫీ తోటలకు ప్రసిద్ధి. అక్కడ చెఫ్ పెట్టే కాఫీని రాణి చాలా ఇష్టంగా తాగుతారు. అలా ఆ ఊరు ఫేమస్ అయింది. కాఫీ ఎస్టేట్, రెండు కుటుంబాలు, నాలుగు జనరేషన్స్, కోర్టు కేసు ఇలా అన్ని అంశాలతో ఫ్యామిలీ ఎమోషన్స్‌తో ప్రేక్షకులను కట్టిపడేసేలా ఈ సినిమా ఉంటుంది. అసలు ఇలాంటి కథకు చాలా పాత్రలు ఉండటం, వారికి తగిన న్యాయం చేయడం అనేదే గొప్ప ఛాలెంజ్. ఇప్పటివరకు చేసిన సినిమాల్లో బెస్ట్ క్లయిమాక్స్ ఈ సినిమాకు రాశాననుకుంటున్నా. చివరి 20 నిముషాలపై నా కెరీర్ ఆధారపడి ఉంటుంది. ఇప్పటికే 30మందికిపైగా బయటివారు, సెన్సార్ వారూ చూశాక ది బెస్ట్ అన్నారు. ఇందుకు చాలా గర్వంగా ఫీలవుతున్నా. ఈ సినిమాకు మిక్కీ సంగీతం చాలా హెల్ప్ అయింది' అని తెలిపారు.

భారత్‌కు ఊరట!

4-1తో ఆస్ట్రేలియాపై ఘన విజయం

సుదీర్మన్ కప్ ఫైనల్స్ 2023

సుజౌ (చైనా) : సుదీర్మన్ కప్ ఫైనల్స్‌లో టీమ్ ఇండియాకు ఊరట విజయం లభించింది. పతక ఆశలతో చైనాకు వెళ్లిన టీమ్ ఇండియా షట్లర్ల బృందం.. కఠినమైన గ్రూప్-సిలో వరుస పరాజయాలు చవిచూసింది. అగ్రశ్రేణి షట్లర్లు రేసులో నిలిచినా.. చైనీస్ తైపీ, మలేషియా చేతిలో భారత్ పరాజయం పాలైంది. వరుస ఓటములతో నాకౌట్ అవకాశాలు చేజార్చుకున్న టీమ్ ఇండియా నామమాత్రపు చివరి గ్రూప్ మ్యాచ్‌లో ఊరట దక్కించుకుంది. గ్రూప్-సిలో ఆస్ట్రేలియాపై 4-1తో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో గ్రూప్-సిలో భారత్ మూడో స్థానంలో నిలిచింది. మూడు మ్యాచుల్లోనూ ఓడిన ఆస్ట్రేలియా చివరి స్థానానికి పరిమితమైంది. తొలుత మిక్స్‌డ్ డబుల్స్‌లో సాయిప్రతీక్, తనీశ జంట 21-17, 14-21, 18-21తో మూడు గేముల పోరులో పోరాడి ఓడింది. దీంతో ఆస్ట్రేలియా 1-0 ఆధిక్యం సాధించింది. తాజాగా డబ్ల్యూబిఎఫ్ ర్యాంకింగ్స్‌లో కెరీర్ అత్యుత్తమ ర్యాంక్ 7 సాధించిన హెచ్.ఎస్ ప్రణయ్ వరుస గేముల్లో మెరుపు విజయం సాధించాడు. 21-8, 21-8తో జాక్ వుపై మెన్స్ సింగిల్స్ మ్యాచ్‌లో విజయం సాధించాడు. మహిళల సింగిల్స్‌లో అనుపమ ఉపాధ్యాయ్ 21-16, 21-18తో టిఫానీపై పైచేయి సాధించింది. నామమాత్రపు మ్యాచ్‌లో పి.వి సింధు బరిలోకి దిగలేదు. మెన్స్ డబుల్స్ విభాగంలో ఎం.ఆర్ అర్జున్, ధ్రువ్ కపిల జోడీ 21-11, 21-12తో రిక్కీ ట్యాంగ్, రేన్ వాంగ్‌లను చిత్తు చేశారు. మహిళల డబుల్స్‌లో తానీశ, అశ్విని పొన్నప్ప జోడీ 21-19, 21-13తో గెలుపొందారు. దీంతో 4-1తో ఆస్ట్రేలియాపై భారత్ ఘన విజయం సాధించింది.



గ్రామీణ ప్రతిభకు పట్టం

- ముగిసిన మండల స్థాయి సిఎం కప్ పోటీలు
- జిల్లా స్థాయి పోటీలకు 85000 మంది అథ్లెట్ల ఎంపిక
- శాట్స్ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ ప్రకటన

నవతెలంగాణ-హైదరాబాద్ : 'ప్రతిభావంతులైన గ్రామీణ క్రీడాకారులను గుర్తించటం, గ్రామీణ క్రీడల్లో నైపుణ్యం కలిగిన క్రీడాకారులను వెలికితీయటంలో మండల స్థాయి సిఎం కప్ పోటీలు విజయవంతం అయ్యాయి. మూడు రోజుల పాటు జాతర వాతావరణంలో సాగిన మండల స్థాయి సిఎం కప్ పోటీల్లో గ్రామీణ ప్రతిభకు పట్టం కట్టారు. సిఎం కప్ 2023 తొలి అంచె పోటీలను విజయవంతంగా నిర్వహించిన మండల స్థాయి నిర్వహణ కమిటీలకు కృతజ్ఞతలు' అని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మెన్ డాక్టర్ ఈడిగ ఆంజనేయ గౌడ్ పేర్కొన్నారు.



మే 16, 17, 18న మూడు రోజుల పాటు సిఎం కప్ మండల స్థాయి పోటీలు బుధవారంతో ముగిశాయి. మండల స్థాయి పోటీల ముగింపు సందర్భంగా నిర్వహణ కమిటీలకు శాట్స్ చైర్మెన్ ఆంజనేయ గౌడ్ ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. 618 మండలాల్లో మూడు రోజుల పాటు సాగిన క్రీడా పోటీల్లో 85000 మంది క్రీడాకారులను జిల్లా స్థాయి సిఎం కప్ పోటీలకు ఎంపిక చేశారు. మండల స్థాయి పోటీల్లో సుమారు 2 లక్షల మంది క్రీడాకారులు పోటీపడ్డారు. మహిళలు, పురుషుల విభాగంలో అథ్లెటిక్స్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, ఫుట్‌బాల్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. మే 22-24న మూడు రోజుల పాటు జిల్లా కేంద్రాల్లో జరుగనున్న జిల్లా స్థాయి సిఎం కప్ పోటీలను సైతం ఇదే తరహాలో దిగ్విజయం చేసేలా జిల్లా స్థాయి నిర్వహణ కమిటీలతో శాట్స్ యంత్రాంగం సమన్వయం చేసుకోవాలని ఆంజనేయ గౌడ్ ఆదేశించారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి సిఎం కప్ పోటీలకు ఎంపికైన 85000 మంది క్రీడాకారులకు ఈ సందర్భంగా శాట్స్ చైర్మెన్ అభినందనలు తెలిపారు.



ఆటలు

బెంగళూర్‌కు ఎదురుందా?

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2023 లీగ్ దశ చివరి వారంలోకి ప్రవేశించింది. ప్లే ఆఫ్స్‌లో రేసులో ఢిల్లీ క్యాపిటల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆశలు ఆవిరి కాగా.. మూడు స్థానాల కోసం ఏడు జట్లు పోటీపడుతున్నాయి. అందులో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ ఒకటి. చివరి రెండు మ్యాచుల్లో విజయాలతో నేరుగా ప్లే ఆఫ్స్‌కు చేరుకునేందుకు కోహ్లి గ్యాంగ్ సిద్ధమవుతోంది. నేడు ఉప్పల్ మైదానంలో బెంగళూర్‌కు హైదరాబాద్ షాక్ ఇస్తుందా? ప్లే ఆఫ్స్ దిశగా కోహ్లి గ్యాంగ్ ఓ అడుగు ముందుకేస్తుందా? ఆసక్తికరం.

నవతెలంగాణ-హైదరాబాద్

- సన్‌రైజర్స్‌తో కోహ్లిగ్యాంగ్ ఢీ నేడు
- రాత్రి 7:30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



రాజస్థాన్ రాయల్స్‌పై 112 పరుగుల భారీ తేడాతో గెలుపొందిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్.. ఋణాత్మక నెట్ రన్‌రేట్ నుంచి బయటపడింది. మరోవైపు బెంగళూర్ కంటే ఓ స్థానం ముందున్న ముంబయి ఇండియన్స్ ఋణాత్మక నెట్‌రన్‌రేట్ కలిగి ఉంది. దీంతో వరుస రెండు మ్యాచుల్లో విజయాలు రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌కు ప్లే ఆఫ్స్ స్థానం ఖాయం చేయనుంది. సీజన్ ఆరంభం నుంచి నిలకడలేని ప్రదర్శనలు చేసిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్.. కీలక దశలో తుది జట్టులో విప్లవాత్మక మార్పులు చేసింది. విదేశీ ఆటగాళ్లను తెలివిగా ఎంచుకుంది. ఈ ఎత్తుగడ బెంగళూర్‌కు గొప్పగా పని చేస్తోంది!. అదే ఉత్సాహంలో నేడు సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడేందుకు సిద్ధమైంది. 12 మ్యాచుల్లో ఎనిమిది పరాజయాలతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లే ఆఫ్స్ ఆశలు ఆవిరి చేసుకుంది. ఒత్తిడి లేని సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ ఎలా ఎదుర్కొంటుందో చూడాలి. సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ మ్యాచ్‌కు ఉప్పల్ మైదానం ముస్తాబైంది.

ఆ నలుగురు అదుర్స్

రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ ఎప్పుడూ టాప్-3 ఆటగాళ్లపైనే ఆధారపడుతుంది. విరాట్ కోహ్లి, గ్లెన్ మాక్స్‌వెల్ సహా కెప్టెన్ డుప్లెసిస్ ప్రదర్శనపై ఆ జట్టు విజయావకాశాలు ఆధారపడ్డాయి. విదేశీ ఆటగాళ్ల ఎంపికలో ఆర్‌సీబీ జట్టు మేనేజ్‌మెంట్ రెండు మార్పులు చేసింది. వానిందు హసరంగ, జోశ్ హేజిల్‌వుడ్ స్థానాల్లో మైకల్ బ్రాస్‌వెల్, వేర్నీ పార్నెల్‌లు తుది జట్టులోకి వచ్చారు. ఈ ఇద్దరు ఆటగాళ్ల రాకతోనే రాజస్థాన్ రాయల్స్‌పై బెంగళూర్ ఎదురులేని విజయం నమోదు చేసింది. బ్యాటింగ్ విభాగంలో డుప్లెసిస్, గ్లెన్ మాక్స్‌వెల్ గొప్పగా రాణిస్తున్నారు. విరాట్ కోహ్లి అంచనాలను అందుకోవటం లేదు. ఉప్పల్ మైదానంలో తిరుగులేని రికార్డులు నమోదు చేసిన విరాట్ కోహ్లి.. నేడు ఇక్కడ స్పెషల్ ఇన్నింగ్స్‌తో అలరిస్తాడేమో చూడాలి. ఒత్తిడిలో మరింత దూకుడుగా రాణించే కోహ్లి.. ప్లే ఆఫ్స్ అవకాశాల ముంగిట బ్యాట్‌తో మ్యాజిక్ చేస్తాడనే ఆర్‌సీబీ అభిమానులు ఆశిస్తున్నారు. లోకల్ హీరో మహ్మద్ సిరాజ్ బెంగళూర్ బౌలింగ్‌కు నాయకత్వం వహించనున్నాడు. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌కు కీలక ఆటగాడిగా ఎదిగిన మహ్మద్ సిరాజ్ సొంతగడ్డపై చెలరేగేందుకు ఎదురు చూస్తున్నాడు.

ఊరట లభించేనా?

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈ సీజన్లో తీవ్రంగా నిరాశపరిచింది. ఆటగాళ్ల వేలంలో నాణ్యమైన క్రికెటర్లను సొంతం చేసుకున్నప్పటికీ.. మైదానంలో ప్రదర్శన ఏమాత్రం మారలేదు. కోట్లు పెట్టి కొనుగోలు చేసిన క్రికెటర్లు కోటికో పరుగు చేయటంలోనూ విఫలమయ్యారు. విదేశీ ఆటగాళ్లలో హెన్రిచ్ క్లాసెన్, మార్కో జాన్సెన్‌లు మాత్రమే నిలకడగా రాణించారు. కెప్టెన్ ఎడెన్ మార్క్‌రామ్ అటు నాయకత్వంలో, ఇటు బ్యాటర్‌గా విఫలమయ్యాడు. హ్యారీ బ్రూక్ కోల్‌కతపై శతకంతో మురిపించినా.. ఆ తర్వాత మళ్లీ వైఫల్య బాట పట్టాడు. అభిషేక్ శర్మ, రాహుల్ త్రిపాఠి, మయాంక్ అగర్వాల్ నిలకడగా నిరాశపరిచారు. సులువుగా నెగ్గాల్సిన మ్యాచుల్లోనూ సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓటమిని కౌగిలించుకుని ప్లే ఆఫ్స్ రేసుకు దూరమైంది. ఈ సీజన్లో సొంతగడ్డపై సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఇదే చివరి మ్యాచ్. ఈ మ్యాచ్‌లోనైనా నెగ్గి.. పాయింట్ల పట్టికలో కాస్త పైకి ఎగబాకుతుందేమో చూడాలి.

కోహ్లి కోసం అభిమానులు! :

విరాట్ కోహ్లి కోసం హైదరాబాద్ అభిమానులు ఉప్పల్ స్టేడియానికి పోటెత్తనున్నారు. లక్నో సూపర్‌జెయింట్స్ మెంటార్ గౌతం గంభీర్ ఇటీవల విరాట్ కోహ్లితో ఘర్షణ దిగగా.. హైదరాబాద్‌కు వచ్చిన గంభీర్‌పై కోహ్లి అభిమానులు ప్రతీకారం తీర్చుకునే ప్రయత్నం చేశారు. ఈ సీజన్లో ఎం.ఎస్ ధోని హైదరాబాద్‌కు రాలేదు. దీంతో విరాట్ కోహ్లి కోసం అభిమానులు ఎన్నో అంచనాలతో ఎదురు చూస్తున్నారు. భావోద్వేగంతో ఉన్న ఆర్‌సీబీ అభిమానులు నేడు ఉప్పల్‌లో విరాట్ కోహ్లి స్పెషల్‌ను ఆశిస్తున్నారు. కోహ్లి రాకతో నేడు ఉప్పల్ స్టేడియం హౌస్‌ఫుల్ కానుంది. హైదరాబాద్, బెంగళూర్ మ్యాచ్ టికెట్లు ఆన్‌లైన్‌లో అర్థగంటలోనే అమ్ముడు కాగా.. బ్లాక్ మార్కెట్‌లో నాలుగైదు రెట్లు అధిక రేట్లకు టికెట్లను సొంతం చేసుకునేందుకు సైతం అభిమానులు వెనుకాడటం లేదు.

ఇదిలా ఉండగా, హైదరాబాద్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌పై సన్‌రైజర్స్‌కు గొప్ప రికార్డుంది. ఇక్కడ బెంగళూర్‌పై సన్‌రైజర్స్ ఆరు మ్యాచుల్లో గెలుపొందింది. అందులో ఓ సూపర్ ఓవర్ విక్టరీ సైతం ఉంది. 2015 ఐపీఎల్‌లో వర్షం ప్రభావిత మ్యాచ్‌లో బెంగళూర్ విజయం సాధించింది. ఈ సీజన్లో హైదరాబాద్‌లో జరిగిన మ్యాచుల్లో సగటు తొలి ఇన్నింగ్స్ స్కోరు 172. ఆరు మ్యాచుల్లో నాలుగింట తొలుత బ్యాటింగ్ చేసిన జట్టే విజయం సాధించింది.

ఢిల్లీ ధనాధన్

- రొసో,పృథ్వీ, వార్నర్ మెరుపుల్
- పంజాబ్ కింగ్స్‌పై ఢిల్లీ గెలుపు



ధర్మశాల : పేలవ ప్రదర్శనతో ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన ఢిల్లీ క్యాపిటల్స్.. సీజన్ చివర్లో చిచ్చరపిడుగల్లె చెలరేగుతుంది. ఇటీవల రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌పై ఛేదనలో చెలరేగిన క్యాపిటల్స్.. తాజాగా పంజాబ్ కింగ్స్‌పై పంజా విసిరింది. 214 పరుగుల ఛేదనలో పంజాబ్ కింగ్స్ 198 పరుగులే చేయగా.. ఢిల్లీ క్యాపిటల్స్ 15 పరుగుల తేడాతో గెలుపొందింది. ఛేదనలో లియాం లివింగ్‌స్టోన్ (94, 48 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్స్‌లు), అథర్వ (55 రిటైర్డ్ హర్ట్, 42 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించినా పంజాబ్ కింగ్స్‌కు పరాజయం తప్పలేదు. లివింగ్‌స్టోన్, అథర్వ మినహా పంజాబ్‌లో ఎవరూ రాణించలేదు. ధావన్ (0), జితేశ్ (0), షారుక్ (6), కరణ్ (11) విఫలమయ్యారు. తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ రిలీ రొసో (82 నాటౌట్, 37 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లు) అజేయ అర్ధ సెంచరీకి తోడు ఓపెనర్లు పృథ్వీ షా (54, 38 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్), డెవిడ్ వార్నర్ (46, 31 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించటంతో 20 ఓవర్లలో 2 వికెట్లకు 213 పరుగుల భారీ స్కోరు సాధించింది. పంజాబ్ కింగ్స్ పేసర్ శామ్ కరణ్ (2/36) రెండు వికెట్లు పడగొట్టాడు.

టాస్ నెగ్గిన పంజాబ్ కింగ్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఓపెనర్లు పృథ్వీ షా (54), డెవిడ్ వార్నర్ (46) క్యాపిటల్స్‌కు తిరుగులేని ఆరంభాన్ని అందించారు. పృథ్వీ షా బౌండరీలతో విరుచుకపడగా.. వార్నర్ సావధానంగా రాణించాడు. పవర్‌ప్లేలో 61/0తో నిలిచిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఓపెనర్లు 94 పరుగుల భారీ భాగస్వామ్యం అందించారు. ఓపెనర్లు నిష్క్రమించినా.. రిలీ రొసో, ఫిల్ సాల్ట్ ఎదురుదాడి ఆపలేదు. ఆరు ఫోర్లు, ఆరు సిక్సర్లతో వీరవిహారం చేసిన రిలీ రొసో..25 బంతుల్లోనే అర్ధ సెంచరీ నమోదు చేశాడు. మరో ఎండ్‌లో ఫిల్ సాల్ట్ (24) సైతం రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో డెత్ ఓవర్లలో దంచి కొట్టాడు. టాప్-4 బ్యాటర్లు వచ్చీ రాగానే బౌండరీల మోత మోగించటంతో పంజాబ్ కింగ్స్ బౌలర్లు బేజారిపోయారు. ఫిల్ సాల్ట్, రొసోలు మూడో వికెట్‌కు అజేయంగా 65 పరుగులు జోడించారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

రైతు చైతన్య యాత్రల జాడేది!

ఉత్సవ విగ్రహాల్లా రైతు వేదికలు

- ముంచుకొస్తున్న ఖరీఫ్ సీజన్
- సాగు ప్రణాళికలు, విత్తనాలు, ఎరువులు..
- పంట రుణాలన్నీ పై ఆదేశాల మేరకే అమలు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మారుతున్న వాతావరణ పరిస్థితులను బట్టి సాగు విధానంలోనూ పంటల మార్పు అనివార్యం. నూతన వంగడాలు, సాంకేతికత, పంటల సాగుకు ప్రభుత్వాల ప్రోత్సాహకాలతో పాటు అనుకూల వాతావరణం ఉంటేనే వ్యవసాయం గిట్టుబాటు అయ్యేది కష్టం. కానీ.. ఎండా కాలంలో వానలు పడడం, వానాకాలంలో ఎండలు కాయడం వంటి అసమతుల్య వాతావరణ పరిస్థితుల్లో రైతులకు వివిధ ఆంశాల పట్ల అవగాహన కల్పించి, శిక్షణ ఇవ్వాలి. అందుకే వారి వద్దకెళ్లి పలు సూచనలు, సలహాలిచ్చేందుకు రైతు చైతన్య యాత్రల ద్వారా అధికారులందరూ గ్రామాలకెళ్లేది. ఆ యాత్రలను ఆపేసి ప్రత్యామ్నాయంగా నిర్మించిన రైతు వేదికలు ఉత్సవ విగ్రహాలయ్యాయి. అధికారులెవ్వరూ ఆ భవనాలకు వెళ్లడం లేదు. విపత్కర పరిస్థితుల్లోనూ అధికారులు రైతులకు రైతు వేదికల్లో అందుబాటులో ఉండటం లేదు.

రైతు చైతన్య యాత్రల వల్ల మేలు

రైతు చైతన్య యాత్రల వల్ల రైతులకు ఎన్నో ఉపయోగాలున్నాయి. వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్, పశుసంవర్థక, విద్యుత్, ఇరిగేషన్ శాఖ లీడ్, డీసీసీబీ, ఇతర బ్యాంకు అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతు చైతన్య యాత్రల్లో పాల్గొనేవారు. రాష్ట్రంలోని ప్రతి మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించేలా 15 రోజుల పాటు షెడ్యూల్ ఖరారు చేసి అధికారుల బృందాలు పర్యటించేవి. 12,500 గ్రామాల్లో యాత్రలు జరిపితే సుమారు 13 లక్షల మంది రైతులు హాజరయ్యేవారు. ఊర్లల్లో రైతులతో సమావేశం జరిపి వ్యవసాయ సీజన్ సన్నద్ధతపై ఖరీఫ్ ప్రణాళికల్ని వివరించేవారు. మార్కెట్‌లోకి వచ్చిన కొత్త వంగడాలు, విత్తనాలు ఎప్పుడు వేసుకోవాలి, ఏఏ పంటకు ఎంత మద్దతు ధర, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంట లేవనే విషయాలు వివరించేవారు. సాగులో తీసు కోవాల్సిన జాగ్రతలు, సస్యరక్షణ, వాతావరణ పరిస్థితులు, వర్ష పాతం, సాగునీటి వనరులు, విద్యుత్ సరఫరా, ఎరువులు, విత్తనాల స్టాక్, ధరల పట్టిక వంటి విషయాలు చెప్పేవారు. ఏ పంటకు ఎంత రుణమి స్తారనేది బ్యాంకర్లు వివరించే వారు.. చెరువులు, ప్రాజెక్టుల కింద నీటి విడుదల, వ్యవసా యానికి 24 గంటల కరెంట్ సరఫరా, విద్యుత్ కనెక్షన్ల మంజూరీ, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలకు పరిష్కారం చూపేవారు.. రైతు బంధు, రైతు బీమా, పంట నష్టం, బీమా పథకాలపై అవగాహన కల్పింవారు.. భూ సమస్యలకూ పరిష్కారం చూపేవాళ్లు. పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం చేపడుతున్న పథకాల్ని వివరించేవారు.. వివిధ శాఖల అధికారులు మాట్లాడి అవగాహన కల్పించడం, పలు సూచనలు, సలహాలు ఇవ్వడం వల్ల రైతులకు ఎంతో మేలు జరిగేది. ప్రభుత్వం చైతన్య యాత్రల్ని జరపాలని రైతులు కోరుతున్నారు.



చైతన్య యాత్రల వల్లనే
రైతుకు లాభం

రైతు చైతన్య యాత్రలు నిర్వహిం చాలి. గతంలో వీటి వల్ల రైతులకు అనేక విషయాల్లో అవగాహన కలిగేది. అధికారులు ఊర్లకొచ్చి రైతుల సమస్యలు విని పరిష్కరించేవారు. వాటిని జరపకుండా రైతు వేదికలే ప్రత్యామ్నాయం అంటే లాభంలేదు. వాటిని చూసుకుని మురియడం తప్ప అక్కడికి అధికారులు రావట్లేదు. రైతులకు శిక్షణ, అవగాహన సమావేశాలు జరగట్లేదు. ఏఈఓలు వచ్చినప్పుడు రైతులు వెళ్లి కలిసే పరిస్థితి లేదు. రైతు వేదికల్లో గ్రీవెన్స్ డే నిర్వహించాలి.



రాజయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

ఉత్సవ విగ్రహాల్లా రైతు వేదికలు

రైతులందరికీ ఉపయోగపడేలా రాష్ట్రవ్యాప్తంగా 2500 రైతు వేదికల్ని రాష్ట్రప్రభుత్వం నిర్మించింది. వీటిల్లో రైతులు సమావేశాలు జరుపుకోవడం, వ్యవసాయ అధికారులు వర్క్‌షాప్‌లు పెట్టి వివిధ అంశాలపై రైతులకు శిక్షణ, అవగాహనా కల్పించడం కోసం వీటిని నిర్మించారు. రైతు చైతన్య యాత్రలకు ప్రత్యామ్నాయంగా రైతు వేదికలు కట్టామని ప్రభుత్వం చెబుతోంది. వాస్తవంగా రైతు వేదికలు ప్రత్యామ్నాయం కాకుండా ఉత్సవ విగ్రహాల్లా నిరూప యోగంగా మారాయి. క్షేత్రస్థాయికి వెళ్లి వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఏఈఓలు రైతుల్ని కలవడంలేదు. వ్యవసాయ, మత్స్య, ఉద్యాన, విద్యుత్, ఇరిగేషన్, పశుసంవర్ధక, మార్కెటింగ్, మదర్ డైయిరీ, లీడ్, డీసీసీబీ, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు అధికారులెవ్వరూ రైతు వేదికలకు రావడంలేదు. వచ్చినా అలా వచ్చి ఇలా వెళ్తున్నారు. తాళాలు వేసి ఉంటున్నాయి. ఇటీవల రాష్ట్రంలో అకాల వడగండ్ల వానలొచ్చి అపారమైన పంట నష్టమేర్పడింది. ధాన్యం రాలిపోయింది. కల్లాల్లో తడిసింది. లక్షలాది ఎకరాల్లో పంట నష్టం జరిగితే ఏ అధికారులు వెళ్లలేదు. సీఎం కేసీఆర్ నష్టపరిహారం ప్రకటించి నివేదికలు కోరినా క్షేత్రస్థాయికి అధికార యంత్రాంగం వెళ్లలేదు.



ముంచుకొస్తున్న ఖరీఫ్ సీజన్

ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తుంది. ఖరీఫ్ పంటల సాగు కోసం రైతులు మే నెలలో వేసవి దుక్కులు దున్నుకుంటున్నారు. ఇటీవల వర్షాలు కురిశాయి. ఖరీఫ్‌లో అధికంగా పంటలు సాగవుతాయి. వరి, పత్తి, మొక్కజొన్న, జొన్న, శనగ, చెరకు, కూరగాయల సాగు కోసం విత్తనాలు సమకూర్చుకుంటున్నారు. జూన్ నుంచే వివిధ పంటల విత్తనాలు వేస్తారు. నైరుతీ రుతుపవనాల ప్రభావం ఎలా ఉన్నా సన్నద్ధమయ్యేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. కాగా, గతేడాది సాగు విస్తీర్ణంకు అటుఇటుగా అంకెల్ని మార్చడం తప్ప క్షేత్ర స్థాయిలో రైతులతో మాట్లాడి వారి ప్రాంతాల్లో ఏఏ పంటలు వేస్తే లాభం, వారికి కావాల్సిన అవసరాలేమిటీ.. అనేది చర్చించడం లేదు. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో మెదక్ జిల్లాలో 3,42,838 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో వరి 2,83,590 ఎకరాలు, పత్తి 48,000 ఎకరాల్లో సాగైంది. ఇతర పంటలు కలిపి 11,248 ఎకరాల్లో వేశారు. సిద్దిపేట జిల్లాలో 3,61,000 ఎకరాల్లో వరి, 2.10 లక్షల ఎకరాల్లో పత్తి, ఇతర పంటలు మరో లక్ష ఎకరాల్లో సాగైంది. సంగారెడ్డి జిల్లాలో వివిధ పంటలు కలిపి 7,02,789 ఎకరాల్లో సాగయ్యాయి. వీటిల్లో వరి 1,38,349 ఎకరాలు, పత్తి 3,44,570 ఎకరాలు, కంది 78,157, సోయా చిక్కుడు 79,361, ఇతర పంటలు 62,352 ఎక రాల్లో సాగయ్యాయి. ఈ ఏడాది ఖరీఫ్‌కు కూడా అవే లెక్క ల్ని ఖరీఫ్ ప్రణాళికలుగా అధికారులు చెబుతున్నారు. క్షేత్ర స్థాయిలో రైతుల్ని కలిసి గతేడాది సాగు అనుభవాలు, నష్టా లు, లాభాల గురించి చర్చించి పంట సాగు విస్తీర్ణాన్ని అంచనా వేయాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

దోస్త్‌కు 9,648 రిజిస్ట్రేషన్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీకాం ఒకేషనల్, బీకాం ఆనర్స్, బీబీఏ, బీసీఏ, బీబీఎం, బీఎస్‌డబ్ల్యూ, బీసీఏ కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్)కు 9,648 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఉన్నత విద్యామండలి చైర్మెన్, దోస్త్ కన్వీనర్ ఆర్ లింబాద్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు వచ్చేనెల 10వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు గడువున్నదని తెలిపారు. ఈనెల 20 నుంచి వచ్చేనెల 11వ తేదీ వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశమున్నదని పేర్కొన్నారు. వచ్చేనెల 16వ తేదీన తొలివిడత సీట్ల కేటాయింపు ఉంటుంది. విద్యార్థులు పూర్తి వివరాలకు https://dost.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

జూన్ 8,9,10 తేదీల్లో ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్

- మంత్రి తలసాని వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సీఎం కేసీఆర్ ఆదేశాలమేరకు జూన్ 8,9,10 తేదీల్లో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ను పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్టు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. బుధవారం బీఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మృగశిర కార్తెను పురస్కరించుకుని 'ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్' నిర్వహణ, ఏర్పాట్లపై మంత్రి సమీక్షించారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఆధర్ సిన్హా, మత్స్య శాఖ కమిషనర్ లచ్చిరాం భూక్యా ఉన్నారు. ఈ సందర్భంగా మత్స్య సహకార సంఘాల సొసైటీ చైర్మెన్‌గా నియమితులైన పిట్టల రవీందర్ మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన్ను శాలువాతో సత్కరించారు. శుభాకాంక్షలు తెలిపారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం 10వ వసంతంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో జూన్ 2 వ తేదీ నుంచి 21 రోజులపాటు రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించాలని ఆదేశించారని వివరించారు. చేపలతో తయారు చేసిన ఫిష్ ఫ్రై, కర్రీ, బిర్యానీ వంటి అన్ని రకాల వంటకాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్వయం ఉపాధి పొందేలా అన్ని జిల్లాలకు చెందిన మహిళా మత్స్యకారులకు చేపలతో వివిధ రకాల వంటకాల తయారీపై ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర పండుగను తలపించే విధంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఇందుకోసం పశుసంవర్ధక, మత్స్య, డెయిరీ అధికారులతోపాటు గోపాలమిత్రలకు కూడా భాగస్వాములను చేయాలని సూచించారు. నూతనంగా లక్ష మందికి మత్స్య సొసైటీలలో సభ్యత్వాలు కల్పించే విధంగా స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్న విషయాన్ని కూడా మంత్రి గుర్తుచేశారు. రాష్ట్రంలోని మత్స్యకారులు ఎంతో సంతోషంగా ఉన్నారని ఆయన వివరించారు.

రెండు ప్రాణాలను బలిగొన్న సెల్ఫీ

- ఎస్సారెస్పీలో పడి ఇద్దరు మృతి

నవతెలంగాణ-మెండోర

ఎస్సారెస్పీ గేట్ల కింద సెల్ఫీ తీసుకునేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు గోదావరి నీటి గుంటలో ఒకరు మునిగిపోతుండగా.. రక్షించేందుకు వెళ్లి మరొకరు మృతిచెందిన ఘటన నిజామాబాద్ జిల్లా పోచంపాడ్‌లోని ఎస్సారెస్పీ వద్ద బుధవారం జరిగింది. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని పూణేకు చెందిన అబ్దుల్ బార్, నిర్మల్ జిల్లా కురానాపేటలో ఉంటున్న తన పెద్దనాన్న అబ్దుల్ ఫయిమ్ ఇంటికి వచ్చాడు. కాగా, బుధవారం వారంతా కలిసి పోచంపాడ్ శ్రీరాంసాగర్ ప్రాజెక్టును చూడటానికి వచ్చారు. ప్రాజెక్టు దిగువన ఉన్న ఎస్కేప్ గేట్ల దగ్గర అబ్దుల్ బార్ (12) సెల్ఫీ ఫొటో దిగుతుండగా నీటి గుంటలో పడ్డాడు. డి మునిగిపోతున్న అతన్ని రక్షించడానికి అబ్దుల్ ఫయిమ్ (38) ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఇద్దరూ నీటి గుంటలో మునిగి మరణించారు. వారితో వచ్చిన ఫయీమ్ కుమారుడు స్థానికులకు చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ శ్రీనివాస్ యాదవ్ ఘటనా స్థలానికి చేరుకుని వారిని నీటినుంచి బయటకు తీయించి ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని.. ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి ఆత్మహత్య


(ఫైల్)

నవతెలంగాణ -తాడ్వాయి

ఈనెల 10న వెలువడిన ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ కాగా బాగా చదివి సప్లమెంటరీ పరీక్షల్లోనైనా పాస్ అవ్వాలని తల్లిదండ్రులు మందలించడంతో.. విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలం వీరాపూర్‌లో బుధవారం జరిగింది. తాడ్వాయి ఎస్ఐ వెంకటేశ్వర రావు తెలిపిన వివరాల ప్రకారం.. రంగాపూర్ గ్రామపం చాయతీ పరిధి వీరాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు పెనక విశ్వనాథంకు కుమారుడు, కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు పెనక వివేక్(17) హనుమకొండలోని జ్యోతిరావు పూలే ఆశ్రమ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. కాగా ప్రథమ సంవత్సరం ఫెయిల్ అయ్యాడు. దీంతో ఇంటర్ సప్లమెంటరీ పరీక్షల్లో బాగా కష్టపడి చదివి పాస్ కావాలని మందలించారు. దాంతో మనస్తాపానికి గురైన వివేక్ ఈ నెల 15న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బీరెల్లి సర్పంచ్ జాజ చంద్రం హుటాహుటిన ములుగు ఏరియా హాస్పిటల్‌కి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించగా.. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

జూన్ 12 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

- షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 12వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ బుధవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. అదేనెల 20వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తామని వివరిం చారు. అదేనెల ఐదు నుంచి తొమ్మిదో తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిస్తామని పేర్కొ న్నారు. జూన్ 21న ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నైతికత, మానవ విలువల పరీక్ష, 22న పర్యా వరణ విద్య పరీక్షను నిర్వహి స్తామని తెలిపారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజు చెల్లింపు గడువు ఈనెల 19 వరకున్న విషయం తెలిసిందే.

పేదలకు విద్యను దూరం చేసే కుట్రలో బీఆర్ఎస్ : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పేదలకు విద్యను దూరం చేసే కుట్రలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నదని బహుజన సమాజ్‌పార్టీ(బీఎస్పీ)అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని విమర్శించారు. తమ రాజకీయ ఎదుగుదల కోసం కేసీఆర్ నిబంధనలకు విరుద్ధంగా ఆంధ్రకు చెందిన బీఆర్ఎస్ నేతకు మియాపూర్ ప్రభుత్వ భూములను అమ్ముకున్నారని పేర్కొన్నారు. 111జీవోను ఎత్తేసి హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న వేల ఎకరాల భూములను బినామీ కంపెనీలకు అప్పజెప్పారని తెలిపారు. ఉచిత విద్యనందిస్తామంటూ గద్దెనెక్కిన కేసీఆర్ పేదలను విద్యకు దూరం చేస్తున్నారని పేర్కొన్నారు. మన ఊరు మన బడి నిధులను పక్కదారి పట్టించారని తెలిపారు. ఉన్న సచివాలయాన్ని కూల్చి రూ. 1400 కోట్లు ఖర్చుచేసి కొత్త సచివాలయాన్ని నిర్మించటంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు.

గన్నీ సంచులు ఇచ్చి ధాన్యం కొనాలి

ఖమ్మం, హన్మకొండ జిల్లాల్లో రైతుల ధర్నా

నవతెలంగాణ-శాయంపేట/తిరుమలాయపాలెం

ఐకేపీ సెంటర్‌లోని ధాన్యంను వెంటనే కొను గోలు చేయాలని, గన్నీ సంచుల కోసం పడిగాపులు కాస్తున్న అధికారులు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు పట్టించుకోవడం లేదని, వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం, హన్మకొండ జిల్లాల్లో రైతులు ధర్నా నిర్వహించారు.

హన్మకొండ జిల్లా శాయంపేట మండలం మైలారంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం అయినప్పటికీ రైతులకు గన్నీ సంచులు ఇవ్వటం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రం వద్దకు లారీల్లో గన్నీ సంచులు వచ్చాయని, గోదాముల్లో సంచులు నిల్వ చేస్తున్నారని తెలిపారు. పెద్దకోడపాక క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి శివకుమార్, మండల వ్యవసాయ అధికారి గంగా జమున సెలవుల్లో ఉండటంతో రైతులకు టోకెన్లు ఇచ్చేవారు లేక పీఏసీఎస్ సిబ్బంది గన్నీ సంచులు ఇవ్వటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ ఉన్నతాధికారులు సెలవులపై వెళ్తూ ఇన్‌చార్జి ఏఈఓలను నియమించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తోడు, మరల వర్షాలు కురిస్తే వరి ధాన్యం, మక్కలు తడిచే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనూ గన్నీ సంచులు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడ్డామని, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, పీఏసీఎస్ చైర్మెన్ శరత్ దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం గ్రామం సమీపంలోని ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిపై బుధవారం రైతులు ధర్నా నిర్వహించారు. ధర్నాకు పలు పార్టీలు మద్దతు తెలిపాయి.

ఈ-గరుడలో ఛార్జీల తగ్గింపు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హైదరాబాద్-విజయవాడ రూట్‌లో తిరుగుతున్న 'ఈ-గరుడ' ఎలక్ట్రిక్ బస్సుల్లో ప్రారంభోత్సవ ఆఫర్‌గా చార్జీలు తగ్గిస్తున్నట్టు టీఎస్ఆర్టీసీ రంగారెడ్డి రీజియన్ మేనేజర్ శ్రీధర్ తెలిపారు. నెలరోజులు ఈ తగ్గింపు వర్తిస్తుందని పేర్కొన్నారు. 'ఈ-గరుడ' బస్సుల్ని మంగళవారం మియాపూర్‌లో రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించిన విషయం తెలిసిందే. తొలి విడతగా పై రూట్‌లో పది ఎలక్ట్రిక్ బస్సుల్ని నడుపుతున్నారు. మియాపూర్ నుంచి విజయవాడకు టిక్కెట్ ధర రూ.830గా నిర్ణయించారు. ఇప్పుడు దాన్ని రూ.760కి తగ్గించినట్టు తెలిపారు. అలాగే ఎంజీబీఎస్ నుంచి విజయవాడకు రూ.780గా ఉన్న టికెట్ ధరను రూ.720కి తగ్గించారు. ఈ ఏడాది చివరి నాటికి మరో 40 ఎలక్ట్రిక్ బస్సుల్ని ఈ రూట్‌లో నడపాలని ప్రణాళికలు రూపొందించిన విషయం తెలిసిందే. ఈ బస్సుకు టిక్కెట్లు ఆన్‌లైన్ ద్వారా సంస్థ వెబ్‌సైట్‌లో రిజర్వేషన్లు చేసుకోవచ్చు.

చెక్ కార్మికుల చారిత్రాత్మక సమ్మె

పొదుపు చర్యలపై పోటెత్తిన ప్రజాగ్రహం

ప్రేగ్ : నయా ఉదారవాద విధానాల్లో భాగమైన పొదుపుచర్యలకు వ్యతిరేకంగా పూర్వ కమ్యూనిస్టు దేశం చెక్ రిపబ్లిక్‌లో కార్మికవర్గం ఉద్యమించింది. కార్పొరేట్లకు వరాలు, సామాన్యులపై భారాలు మోపుతూ ప్రభుత్వం పలు ప్రతిపాదనలను తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించింది. దీనిపై కార్మిక సంఘాలు సోమవారం నుంచి దేశవ్యాపితంగా మెరుపు సమ్మెకు దిగాయి.. కమ్యూనిజం నుంచి వైదొలగిన తరువాత చెక్ రిపబ్లిక్‌లో ఇంత పెద్ద యెత్తున నిరసనలు చోటుచేసుకోవడం ఇటీవల కాలంలో ఇదే ప్రథమం. ఆర్థిక సంస్కరణల పేరుతో బడ్జెట్‌లో సంక్షేమ రంగానికి భారీగా కోతలు పెట్టడం, సామాన్యులకు పన్నుల వాతలు, నిరుద్యోగం, అధిక ధరలు, వీటికి తోడు ఉద్యోగుల వయోపరిమితిని 68 సంవత్సరాల కు పెంపు వంటి ప్రజా వ్యతిరేక చర్యలకు పీటర్ ఫియాలా ప్రభుత్వం ఒడిగట్టింది. దీనికి వ్యతిరేకంగా దేశంలోనే అతి పెద్ద కార్మిక సంఘమైన చెక్ మొరావి యా కార్మిక సంఘాల సమాఖ్య (సిఎంకెఓఎస్) సమ్మెకు పిలుపునిచ్చింది. దీనికి అన్ని వర్గాల ప్రజల నుంచి అపూర్వమైన మద్దతు లభించింది. సికెఎంఓ ఎస్ ప్రతినిధి జోసెఫ్ స్ట్రెడులా మంగళవారం నాడు మాట్లాడుతూ, సంస్కరణలపై తాడో పేడో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. చెక్ రిపబ్లిక్ చరిత్రలోనే ఎన్నడు లేని రీతిలో అత్యంత ఎక్కువగా వున్న ద్రవ్య లోటును తగ్గించేందుకు పొదుపు చర్యలు చేపట్టింది. ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 65 నుంచి 68 ఏళ్లకు పెంచేసింది. వ్యాట్ జీరో రేటును రద్దు చేసి, దాదాపు అన్ని ఉత్పత్తులపై వ్యాట్‌ను 10నుండి 21శాతానికి పెంచేసింది. ఈ చర్యలన్నింటి వల్ల ఒక్కో కుటుంబంపై ఏడాదికి సగటున 4వేల యూరోలు అదనపు భారం పడుతోందని ఆయన తెలిపారు. పిల్లల సంఖ్యను బట్టి తల్లులు ఇంకొంచెం ముందుగా రిటైర్ కావచ్చు. అయితే పార్లమెంట్‌లో తనకున్న మెజారిటీని ఆసరా చేసుకుని ఈ పొదుపు చర్యలకు ఆమోదం పొందవచ్చని ప్రభుత్వం భావిస్తున్నది.

పేదల ఇండ్ల కూల్చివేత అన్యాయం

అర్హులైన వాళ్లకు రెగ్యులరైజ్ చేయాలి

- ఐలాపురం భూముల వివాదంపై సమగ్ర విచారణ జరపాలి
- కూల్చిన ఇండ్లను పరిశీలించిన సీపీఐ(ఎం) బృందం
- బాధితులకు అండగా ఉంటామని భరోసా



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలంలోని ఐలాపురం, ఐలాపురం తండా గ్రామాల పరిధిలో పేదలు కట్టుకున్న ఇండ్లను కూల్చివేయడం అన్యాయమని సీపీఐ(ఎం) నేతలు అన్నారు. బుధవారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మాణిక్, నాయిని నర్సింహారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వరావు ప్రతినిధి బృందం కూల్చిన ఇండ్లను పరిశీలించి, నష్టపోయిన బాధితులతో మాట్లాడారు. 119 సర్వేనెంబర్‌లో ఉన్న భూముల పూర్వాపరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ.. వివిధ ప్రాంతాల నుంచి జీవనోపాధి కోసం వలస వచ్చిన పేదలు తక్కువ ధరకు లభిస్తుందని ప్లాట్లు కొనుగోలు చేసి ఇండ్లు కట్టుకున్నారని తెలిపారు. ప్రభుత్వపరంగా ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్థానిక నాయకులు చెప్పడంతో పేదలు ఇండ్లు కట్టుకొని ఉంటున్న సమయంలో అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అర్ధరాత్రి ఇండ్లను కూల్చివేయడం అన్యాయమన్నారు. ఇంట్లో ఉంటున్న వాళ్లను బయటికి ఈడ్చుకొచ్చి పడేసి జేసీబీ, ఇటాచీలతో ఇండ్లను పూర్తిగా ధ్వంసం చేయడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐలాపుం, ఐలాపురం తండాలో ఎన్నో ఏండ్లుగా ప్లాట్ల విక్రయాలు జరుగుతున్నాయని, కాయకష్టం చేసి పోగేసుకున్న సొమ్ముతో ప్లాట్లు కొనుకున్న పేదలు ఇండ్లు నిర్మించుకున్నారన్నారు. ప్లాట్ల కొనుగోళ్లు, ఇండ్ల నిర్మాణాలు జరుగుతుంటే ప్రభుత్వం గానీ ప్రభుత్వ అధికారులు కానీ ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. ఇండ్లు కట్టుకున్న ప్రాంతంలో రోడ్లు వేసి, ఇండ్లకు ఇంటి నెంబర్లు ఇచ్చి పన్నులు వసూలు చేశారని తెలిపారు. విద్యుత్ శాఖ నుంచి ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంబాలేసి కరెంట్ మీటర్లు పెట్టింది అధికారులు కాదా అని ప్రశ్నించారు. ఐలాపురం భూముల క్రయవిక్రయాల్లో వేల కోట్ల కుంభకోణం దాగి ఉందని,. ఇట్టి భూముల వివాదంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో ఇండ్లు కట్టుకున్న వాళ్లకు రెగ్యులరైజ్ చేస్తున్న ప్రభుత్వం.. ఐలాపురం పేదలకు కూడా వాళ్ల కొనుగోలు చేసిన ప్లాట్లను రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

ఇండ్లు కూల్చినందుకు నష్ట పోయిన బాధితులకు ప్రభుత్వమే తిరిగి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, మధ్యవర్తుల మోసపు మాటలు నమ్మి ప్లాట్లు కొనుగోలు చేసి ఇండ్లు కట్టుకున్న పేదలకు ప్రభుత్వం న్యాయం చేయాలని, మోసం చేసిన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పేదలను సమీకరించి సీపీఐ(ఎం) పోరాడుతుందని స్పష్టంచేశారు.

ఆ పంచాయతీలను తెలంగాణలో కలిపేందుకు కృషి చేస్తా..

ఆదివాసీల అభివృద్ధికి కలిసి పనిచేయాలి

- భద్రాద్రిలో గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ ఆదివాసీలతో ముఖాముఖి



నవతెలంగాణ-భద్రాచలం

ఆంధ్రాలో విలీనమయిన ఐదు గ్రామ పంచాయతీలు కన్నాయిగూడెం, పిచుకలపాడు, పురుషోత్తపట్నం, గుండాల, ఎటపాక గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆయా గ్రామాలను తెలంగాణలో కలిపేందుకు తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ తెలిపారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలోని వీరభద్ర ఫంక్షన్ హాల్‌లో ఆదివాసీలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి గవర్నర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆంధ్రాలో కలిసిన ఐదు పంచాయతీ గ్రామాల ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆదివాసీల అభివృద్ధికి తన వంతుగా బైక్ అంబులెన్సులు, విద్యుత్ ఆటోలు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఆదివాసీల పిల్లల విద్యాభివృద్ధికి అదనపు తరగతి గదులు, అంగన్వాడీ కేంద్రాలు నిర్మించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆదివాసీల ఆర్థిక, ఆరోగ్య పరిరక్షణ చర్యల్లో భాగంగా గిరిరాజా కోళ్ల, చిరుధాన్యాలతో కూడిన ఆహారం అందించడంలో పాలు పంచుకోవడం చాలా సంతోషమని చెప్పారు. ఆర్థిక అభివృద్ధికి స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాలు, మహిళా సాధికారత కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్య పరిరక్షణా చర్యలో భాగంగా.. అనీమియా, మలేరియా, మాల్ న్యూట్రిషన్ల బారి నుంచి ప్రజలను కాపాడేందుకు మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, రెడ్ క్రాస్ ద్వారా సేవలు అందిస్తామని తెలిపారు. తెలంగాణకు సరిహద్దునున్న రాష్ట్ర ప్రజలకు వైద్య సేవలు అందించుటలో భద్రాచలం ఏరియాస్పత్రి ప్రధానమైనదని, దాంట్లో డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది. ఖాళీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, భద్రాచలం శాసనసభ్యులు భర్తీకి చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యేను కోరారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల అభివృద్ధికి ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని, అయినప్పటికీ వారి జీవితాల్లో ఆశించిన స్థాయిలో మార్పులు రాకపోవడానికి గల కారణాలపై అన్వేషణ చేస్తామన్నారు. కాగా, తెలుగులో ప్రసంగం ప్రారంభించిన గవర్నర్ తాను తమిళనాడు ఆడబిడ్డనని, తెలంగాణకు అక్కనని చెప్పారు. కార్యక్రమంలో భద్రాచలం శాసనసభ్యులు పోదెం వీరయ్య, గవర్నర్ ప్రయివేటు కార్యదర్శి భవాని శంకర్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ మధుసూదన్, ఉద్యాన అధికారి జినుగు మరియన్న, సహకార అధికారి వెంకటేశ్వర్లు, ఇంటర్మీడియట్ అధికారి సులోచనా రాణి, గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి, మైనార్టీ సంక్షేమ అధికారి సంజీవరావు, ఏపీఓ జనరల్ డేవిడ్ రాజు, ఆర్డీఓ రత్నకళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి రామున్ని దర్శించుకున్న గవర్నర్

శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ దర్శించు కున్నారు. గవర్నర్‌కు పూర్ణ కుంభంతో ఆలయ అర్చ కులు, అధికారులు స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రత్యేక పూజలు అనంతరం శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయంలో వేద పండితుల ఆశీర్వాదం అందుకున్నారు. అనంతరం దర్శనానికి విచ్చేసి క్యూ లైన్‌లో ఉన్న భక్తులను గవర్నర్ పలకరించారు. ఇదిలా ఉండగా జిల్లా పర్యటనకు వచ్చిన గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ అనుదీప్, ఎస్పీ డాక్టర్ వినీత్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ గౌతమ్ పొట్రూ, భద్రాచలం ఆర్డీవో రమాదేవి, ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్ తదితరులు పుష్పగుచ్చం అందించి ఘనంగా స్వాగతించారు.



'మీడియా స్వేచ్ఛ'ను హరించొద్దు

భారతదేశంలో గత కొన్ని సంవత్సరాలుగా పౌరులు అనుభవిస్తున్న స్వేచ్ఛ క్రమంగా దిగజారిపోతుంది. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛలో అంతర్భాగమైన మీడియా(పత్రికా) స్వేచ్ఛకు స్వయం ప్రతిపత్తి కల్పించడం జరిగింది. తద్వారా మీడియా స్వతంత్రంగా వ్యవహరిస్తూ వాస్తవాలు చెప్పే హక్కు కలిగి ఉంది. దీన్ని అడ్డుకుంటే ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదం ఏర్పడనుంది. అందుకే ప్రజాస్వామ్యానికి మీడియా స్వేచ్ఛను నాలుగో స్తంభం (ఫోర్త్ ఎస్టేట్)గా పేర్కొంటారు. ఈ మీడియా (పత్రికా) స్వేచ్ఛ యాజమాన్యాలకు ఇచ్చింది కాదు. ప్రభుత్వాల, వ్యవస్థీకృత వర్గాల నుండి ఆంక్షలు, ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, సరైన రీతిలో సంపూర్ణంగా వార్తలను సేకరించడం, ప్రచురించడంలో నిజాయితీగా వ్యవహరించాలి. మీడియా, పత్రికాస్వేచ్ఛ అంటే? దేశ పౌర, రాజకీయ, మత, స్వాతంత్ర్య, స్వేచ్ఛ పరిరక్షణ "కల్పవృక్షం". ఈ ప్రజా కల్పవృక్షాన్ని ప్రశ్నించడానికి న్యాయస్థానాలకు, చట్టసభలకు కూడా వీలుండదు. ఎంతో విశిష్టతను, స్వతంత్రతను కల్పించారు రాజ్యాంగ నిర్మాతలు. ప్రజలకు వాస్తవాలు తెలిపే హక్కు మీడియాకు ఉంది. కఠిన వాస్తవాలను ప్రజల ముందు ఉంచితేనే వారు సరైన ప్రత్యామ్నాయాలను ఎంపిక చేసుకుంటారు. అలా మీడియా ఎన్నో సంస్కరణలకు, సామాజిక, రాజకీయ మార్పులకు దోహద పడింది... పడుతుంది. ఈమధ్య మళయాల వార్త ఛానల్ "మీడియా వన్"పై కేంద్ర ప్రభుత్వం విధించిన నిషేధాన్ని తొలగిస్తూ, ప్రజాస్వామ్య మనుగడకు... మీడియా స్వతంత్రత ముఖ్యమని "సుప్రీం" భావించి తీర్పును వెలువరించింది. విమర్శిస్తే ప్రభుత్వ వ్యతిరేకత అంటే ఎలా అని ప్రశ్నించింది. ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువైన మీడియా స్వేచ్ఛలో ప్రభుత్వాలు జోక్యం చేసుకోవడం భావ్యం కాదు.

ప్రపంచంలో భారత దేశ స్థానం మీడియా స్వేచ్ఛలో దిగజారి(వడి)పోతుంది... ప్రభుత్వాన్ని విమర్శించే మీడియా సంస్థలు, స్వతంత్ర మీడియా సంస్థలను, సంపాదకీయ వర్గాన్ని, జర్నలిస్టుల మీద ఉగ్రవాదం, రాజద్రోహం లాంటి కఠిన శిక్షల కింద తప్పుడు కేసులను బనాయించడమే కాకుండా దాడులు, హత్యలు జరుగుతున్నాయని హ్యూమన్ రైట్స్ వాచ్ (హెచ్ఆర్‌డబ్ల్యు) పేర్కొంది. అలాగే ఈ మధ్య అధ్యయనం చేసిన పారిస్ చెందిన స్వంతంత్ర ఎన్‌జీఓ రిపోర్ట్స్ విత్‌అవుట్ బోర్డర్స్, రిపోర్టర్స్ సాన్స్ ఫ్రాంటియర్స్(ఆర్ఎస్ఎఫ్) అనే సంస్థ రాజకీయ, ఆర్థిక, లెజిస్లేటివ్, సామాజిక మరియు భద్రత లాంటి ప్రధాన అంశాలు, మీడియా స్వేచ్ఛ సూచీల మీద "ప్రపంచ పత్రిక దినోత్సవం మే-3న" నివేదికను విడుదల చేసింది. ఆ మేరకు 21వ ఎడిషన్ వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్‌లో ప్రపంచంలోని 180దేశాల్లో భారత్ 2023లో 161స్థానంతో బలహీన ర్యాంకులో ఉంది. మన కన్న చిన్న దేశాల కన్నా దిగజారి పోవడంతో... ఇది ప్రజాస్వామ్య వాదులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇలా గతంలో 2009లో 105వ ర్యాంకులో ఉండేది. 2019 నాటికి దాని పరిస్థితి 140వ ర్యాంకుకు దిగజారిపోయింది. ఆ తరువాత 2020-21 నాటికి భారత ర్యాంకు 142కు, 2022 నాటికి 150వ స్థానానికి పడిపోయింది. తాజాగా 2023కి వచ్చేసరికి ఇంతకన్నా 11స్థానాలు దిగజారి 161వ స్థానానికి కుదేలయింది. మన పొరుగు దేశాలు భూటాన్, నేపాల్, ఆఫ్ఘనిస్తాన్, మయన్మార్ కన్నా తక్కువ స్థానాల్లో ఉండటం గమనార్హం.



మేకిరి దామోదర్
9573666650

మూడు దశాబ్దాల నుండి ప్రపంచీకరణలో భాగంగా పెట్టుబడి దారీ విధానాలు పాలన లోకి మన దేశంలో ప్రవేశించడంతో ప్రజా ప్రయోజనాలు కాపాడాల్సిన మీడియా కార్పొరేట్ల ప్రయోజనాలకు వత్తాసు పలుకుతుంది. ఈ కాలంలో ప్రభుత్వ విధానాలు ప్రయివేటీకరణకు పూనుకోవడంతో పెద్ద మీడియా అతిపెద్ద మీడియాగా ఎదిగి యాజమాన్యాలకు లబ్ధి చేకూర్చింది. దీంతో పెద్ద కార్పొరేట్ శక్తులే మీడియా అధిపతులుగా చలామణి అవుతున్నారు. అనేక భిన్న పరిశ్రమలతో మీడియా సంబంధాలు పెనవేసుకుని పోయింది. ప్రభుత్వాలు ప్రజాధనాన్ని కార్పొరేట్లకు ఇస్తున్నా... ప్రజల మీద అన్యాయంగా పన్నులు, సెస్సుల రూపంలో ఆర్థిక భారాలు మోపుచున్నా చూసీచూడనట్లు మౌనంగా వ్యవహరిస్తుంది. కేంద్రం రాష్ట్రాల హక్కులను, సమాఖ్య స్ఫూర్తిని హరిస్తూ, స్వయం ప్రతిపత్తి గల సంస్థలను వారి రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంటూ, ప్రతిపక్షాలను వేధింపులకు గురిచేస్తుంది... అయినా ఉదాసీనంగా వ్యవహరిస్తుంది. ప్రజా ప్రతినిధులను సంతలో సరుకుల్లా కొనుగోలు చేస్తూ, ప్రభుత్వాలను అప్రజాస్వామ్యంగా కూలదోస్తున్నా ఈ మీడియా పట్టించుకోవడం లేదు. కార్పొరేట్ మీడియా ప్రభుత్వాలకు వత్తాసు (వంత) పాడుతూ స్వప్రయోజనాలను పొందుతుంది. ఈ మీడియా ప్రజల బాధలు, రైతుల ఆత్మహత్యలు, నిరుద్యోగ యువత, కార్మికులు, మధ్య తరగతి, విద్యార్థులు, పేదల బాధలు పట్టించుకోకుండా పక్షపాతంగా వ్యవహరిస్తుంది. కార్పొరేట్ మీడియా నేడు ఆర్థిక పరిపుష్టితో నూతన సాంకేతికతను పుణికి పుచ్చుకొని ఆ మాయాజాలపు కబంధహస్తాల్లో మీడియా స్వేచ్ఛ బందీ అయిందని ప్రజాస్వామ్యవాదులు భావిస్తున్నారు. అయినా నేటికీ పత్రిక(మీడియా) విలువల కోసం నిబద్ధతతో వ్యవహరిస్తూ, పాలకుల నిర్బంధాలను ఎదుర్కొంటూ ప్రజల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న పత్రిక (మీడియా) సంస్థలు చాలానే ఉన్నాయి. ప్రజల కోసం రాజ్యాంగం ప్రసాదించిన మీడియా స్వేచ్ఛను కాపాడుతుంది. వారి ఆకాంక్షలకు, ఆశయాలకు కట్టుబడి రాస్తున్నాయి. వినిపిస్తున్నాయి. మీడియా స్వేచ్ఛను అడ్డుపెట్టుకొని కార్పొరేట్ మీడియా చేసే అసత్య ప్రచారాలు ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరం.

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా కీర్తించబడుతున్న వేళ... రాజ్యాంగ బద్ధంగా ప్రజా పాలన సాగించాల్సిన చట్టసభ(సభ్యు)లు పదవీ ప్రమాణాలకు కట్టుబడి మీడియా స్వేచ్ఛలో తలదూర్చకుండా సంక్షేమ, శ్రేయో రాజ్యంగ పాలన అందించాలి. లేదంటే నాటి బ్రిటిష్ పాలకులను నేటి ప్రజాపాలకులు మించిపోతున్నారనే అపకీర్తిని మోయాల్సి వస్తుంది. మన దేశ స్వేచ్ఛ, స్వాతంత్ర్యానికై పరితపించిన ఆనాటి ఉద్యమ నాయకుల, భరత జాతి ఆకాంక్షలైన సమభావన, భావ ప్రకటనా స్వేచ్ఛ, పౌర స్వేచ్ఛలను పరిరక్షించాలి. పౌర సమాజం ఆకాంక్షల్ని పాలకుల అకృత్యాన్ని చెప్పని చూపని మీడియా ఉన్నా ఒకటే లేకున్నా ఒక్కటే అని ప్రజాస్వామ్యవాదులు భావి స్తున్నారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా సరే భావ ప్రకటనా స్వేచ్ఛను, మీడియా (పత్రిక)స్వేచ్ఛను హరించడానికి, విమర్శలను తొక్కిపట్టడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. వాస్తవంగా నిర్మాణాత్మక విమర్శలు ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు లాంటివి. ప్రజల భావవ్యక్తీకరణ హక్కును పరిరక్షించడం... ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు ఉండాల్సిన అతి ముఖ్యమైన లక్షణం. మన రాజ్యాంగం పౌరులకు ఆ భరోసానిస్తుంది. అందుకే మీడియా స్వేచ్ఛ దిగజారడం వలన పౌర సమాజం గతి ఏమవుతుంది? పాలకులు వెంటనే నిర్బంధం, ఒత్తిడిలేని ప్రజా జీవనానికి పాటుపడుతూ మీడియా స్వేచ్ఛ పరిరక్షణలో ప్రపంచంలోనే అగ్ర భాగాన నిలవాలి. ■



'హిందూత్వ'కు తగ్గిన ఆదరణ- లౌకికస్ఫూర్తే ప్రేరణ

కర్నాటకలో కాంగ్రెస్ భారీ విజయాన్ని ప్రభావితం చేయడానికి కారణం, బీజేపీ ఎందుకు పతనమైందనే చర్చ నేడు దేశవ్యాప్తంగా నడుస్తోంది. కర్నాటక ఫలితాలతో మిగతా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ప్రణాళికలు సిద్ధం చేయడానికి హస్తం పార్టీ శరవేగంగా ముందుకు సాగుతోంది. కాంగ్రెస్ జాతీయ స్థాయి రాజకీయ సైద్ధాంతిక కూటమిని నిర్మించడం ద్వారా బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఎదుర్కొనే శక్తికి రంగం సిద్ధం చేస్తోంది. కర్నాటక ఎన్నికల ఫలితాల్లో వైఫల్యాలు ఎదుర్కొన్న బీజేపీకి ప్రధానంగా హిందుత్వ ప్రచారణకు తగ్గిన ఆదరణ. అది ఇప్పుడు కర్నాటకలోనే కాదు, దక్షిణ భారతదేశంలోని అన్ని రాష్ట్రాలకు వర్తిస్తుంది. తెలంగాణ, తమిళనాడు, కేరళ ఏ రాష్ట్రమైనా కేవలం మతపరమైన మార్గాల్లో ఓటర్లను ప్రభావితం చేసే ఉదేశ్యంతో నడిచే ప్రచారం ఇక చెల్లదని కర్నాటక ఫలితాలు తేల్చిచెప్పాయి. అంతే కాకుండా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదరణ కూడా పరిమితమైంది. రాజకీయ సమీకరణలు, పార్టీ సత్ఫలితాలు కోసం మత రాజకీయాల కథనం ఏ మాత్రం పని చేయవని అర్థమవుతున్నది. కర్నాటక రాష్ట్ర ఎన్నికల్లో ఎన్నికల ఫలితాల్లో అంశాల వారిగా పరిశీలించినట్టయితే మొదటగా కాంగ్రెస్ ఎన్నికల నిర్వహణ వికేంద్రీకరణ, స్థానిక నాయకులకు అధికారం ఇవ్వడం కీలక పరిణామం. దీనికితోడు లౌకికవాదం బాగా పనిచేసింది. భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ పాదయాత్రలో అట్టడుగు స్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నుండి పెద్ద వారి వరకు, క్యాడర్ మొత్తం సంఘీభావం ప్రకటించింది. ఒకే భావాన్ని కలిసికట్టుగా పంచుకోవడానికి కొత్త ఉత్సాహాన్ని ప్రేరేపించడానికి సహాయపడింది. ఒక సమానమైన మంచి అనుభూతి పార్టీ కేడర్ మొత్తం పంచుకోవడం రాష్ట్ర స్థాయి ఎన్నికల విజయానికి పధాన కారణంగా చెప్పుకోవచ్చు. సిద్ధరామయ్య, డి.కె. శివకుమార్‌ల కూడుకున్న దృఢ మయిన పార్టీ అంతర్గత ఎన్నికల యంత్రాంగం ఒక ఎత్తయితే, ధరల పెరుగుదల, నిరుద్యోగం, అవినీతి వంటి సామాజిక-ఆర్థిక కారణాల పాత్ర బీజేపీకి వ్యతిరేకంగా నిరసన ఓటును సమీకరించింది.



సంపత్‌కృష్ణ దన్నంనేని
9849097835

వివాదాస్పద అంశాలతోనే బీజేపీ ఓటమి

బీజేపీకి వ్యతిరేకంగా పనిచేసిన కొన్ని అంశాలను తీసుకున్నట్టయితే మొదటిది లింగాయత్‌ల బలమైన వ్యక్తి బిఎస్ యడ్యూరప్ప పట్ల పార్టీ వ్యవహరించిన తీరు. లింగాయత్‌ల మద్దతును దెబ్బతీసింది. 2021లో బీజేపీ బసవరాజ్ బొమ్మైని సీఎంగా నియమించినప్పుడు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయవలసి వచ్చిన సమయం దాదాపు 1990లో పాటిల్ వ్యవహారం కాంగ్రెస్‌కు జరిగినటువంటిదే. రాజీనామా అందజేసే సమయంలో యడ్యూ రప్ప కన్నీళ్లు పెట్టుకోవడంతో లింగాయత్‌ల మద్దతు పూర్తిగా దెబ్బతిన్నది. హిందుత్వ ధోరణిని అనుసరించకుండా కాంగ్రెస్ ప్రచార వ్యూహం అభివృద్ధి ప్రణాళికలపై దృష్టి సారించడం కలిసొచ్చింది. చాలా కాలంగా బీజేపీ ప్రచారం అంతా టిప్పు సుల్తాన్ వివాదం, హలాల్, హిజాబ్‌కు సంబంధించిన సమస్యలపై కేంద్రీకృతమై ఉంది. ఎన్నికల దగ్గర పడ్డ సమయంలో మాత్రమే అభివృద్ధి గురించి మాట్లాడటం మొదలుపెట్టారు. బీజేపీ పరాజయానికి చివరి కారణం ముఖ్యమంత్రి బొమ్మైకి ఆదరణ లేకపోవడమే. ఉత్తర భారత రాష్ట్రాలలో మోడీకి ఉన్న ప్రజాదరణపై వరుసగా ఎన్నికలను గెలిచినప్పటికీ కర్నాటక విషయంలో ఆ ఫలితాన్ని పునరావృతం చేయలేకపోయింది. పాత మైసూరు ప్రాంతంలో కేంద్రీకృతమై ఉన్న వొక్కలిగ సామాజికవర్గం ఓట్లపై జేడీఎస్ చాల కాలంగా ఆధిక్యత కనబరుస్తోంది. అయితే జేడీఎస్ నాయకులు ఎంత ప్రయత్నించినప్పటికీ అక్కడ ప్రభావితం చేయలేకపోయారు. జేడీఎస్ పరస్పరం బీజేపీ, కాంగ్రెస్ ఇరువైపులా అవకాశాన్ని బట్టి మారడం ఆ పార్టీ ప్రతిష్టను దెబ్బతీసింది. అయితే కర్నాటక ఎన్నికలు కాంగ్రెస్ శ్రేణులకు, లౌకికవాదం కోరుకునే ప్రజాతంత్ర శక్తులకు ఈ విజయం అమూల్యమైనది. ఆహ్వానించదగినది. ■

కామన్ విద్యా విధానాన్ని అమలు చేయాలి

మన దేశంలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని విద్యా విధానంలో వివిధ మేనేజ్‌మెంట్లు ఉండటం వల్ల విద్యా విధానం గందరగోళంగా మారుతుంది. దేశవ్యాప్తంగా కామన్ విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. దేశ వ్యాప్తంగా ఒకేసారి పరీక్షలు నిర్వహించడం ఒకేసారి ఫలితాలు ప్రకటించడం ఒకేసారి ఉన్నత చదువులు చదువుకోవడానికి అవకాశం ఉంటుంది. ప్రస్తుత విద్యా విధానంలో ప్రభుత్వ పంచాయతీ రాజ్, మున్సిపల్, ఎయిడెడ్, కార్పొరేట్, మైనార్టీస్, మోడల్ స్కూల్, పబ్లిక్ స్కూల్‌లు, నవోదయ స్కూల్‌లు, కేంద్రీయ, గురుకుల పాఠశాలలు, స్పోర్ట్స్ స్కూల్‌లు, మిలిట్రీ స్కూల్, సైనిక్ స్కూల్‌లు, ప్రయివేటు స్కూల్‌లు అనేకం ఉన్నాయి. భారతీయ విద్యా విధానంలో త్రిభాషా సూత్రంను అమలు చేస్తున్నారు. ప్రథమ భాషగా మాతృభాష (తెలుగు రాష్ట్రాలలో తెలుగు, ఉర్దూ) ద్వితీయ భాషగా హిందీ, తృతీయ భాషగా ఇంగ్లీష్ అనేక పాఠశాలలలో త్రిభాషా సూత్రంను పాటించకుండా ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలలో మాతృభాష తెలుగును తప్పనిసరి చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులను జారీ చేసింది. పదవ తరగతి వరకు తెలుగును తప్పని సరిగా అభ్యసించాలనే నియమ నిబంధనలు రూపొందించినది. అనేక పాఠశాలలలో ప్రభుత్వ ఉత్తర్వులను ఏ మాత్రం ఖాతరు చేయకుండా పదవ తరగతి వరకు తెలుగు చదవకుండానే పదవ తరగతి పూర్తి చేస్తున్నారు. తెలుగుకు బదులుగా సంస్కృతం, రష్యన్, ఫ్రెంచ్, చైనీస్ మిగతా భాషలను చదువుతున్నారు. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పదవ తరగతి వరకు తెలుగు భాషను అమలు చేయని పాఠశా లలపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవడానికి అవ కాశం ఉంది. అధికారుల నిర్లక్ష్య, నిర్లిప్త ధోరణి, అవినీతి వలన ప్రయివేటు పాఠశాలలో ఆడిందే ఆటగా మారింది.



ప్రభుత్వ పాఠ్యపుస్తకాల అమలేది?

మన దేశంలో జాతీయ స్థాయిలో రాష్ట్ర స్థాయిలో ఎస్‌సిఆర్‌టి ఉన్నాయి. విద్యార్థుల స్థాయిని బట్టి పాఠ్య పుస్తకాలను రూపొందిస్తారు. విద్యార్థుల స్థాయిని బట్టి, వారి తరగతిని బట్టి పాఠ్య పుస్తకాలను సబ్జెక్టులో అను భవం కలిగిన సబ్జెక్టులో నిష్ణాతులైన వారి చేత పాఠ్య పుస్తకా లను రూపొందించి జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఎస్‌సిఆర్‌టి పుస్తకాలను ఒకటి నుండి పదవ తరగతి వరకు అమలు చేయాలనే ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయి. కొన్ని పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను ఏ మాత్రం పాటించకుండా పాఠశాల స్థాయిలో పుస్తకాలను రూపొందించి తమ స్వీయ ఎజెండా అమలు చేస్తున్నారు. పదవ తరగతిలో పబ్లిక్ ఎగ్జామ్స్ ఉన్నందున అనేక ప్రయివేటు పాఠశాలలు పాఠ్య పుస్తకాలను చదివించకుండా కేవలం ప్రశ్న జవాబులను మాత్రమే చదివిస్తూ విద్యార్థులకు మంచి గ్రేడింగ్ రావడానికి ప్రయత్నిస్తు న్నారు. విద్యార్థులకు మార్కులు, గ్రేడిం గ్ విధానంపై దృష్టిని కేంద్రీకరిస్తున్నా రు. విద్యార్థుల మానసిక, భౌతిక విషయాలపై దృష్టిని కేంద్రీకరించడం లేదు. పదవ తరగతి పబ్లిక్ ఎగ్జామ్స్ తరువాత ఇంటర్మీడియట్ ఆ తర్వాత జరగ నున్న ఐఐటి కోసం మూడు, నాలుగవ తరగతి నుండే ఐఐటి బోధన పేరిట విద్యార్థులకు మానసిక ఒత్తిడికి గురి చేస్తు న్నారు. దీనికితోడు పబ్లిక్ స్కూల్స్‌లో, ప్రయివేటు పాఠశాలల్లో ప్రతి సంవత్సరం ఫీజులను తమకు ఇష్టానుసారం పెంచుకుంటుపోతున్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఫీజుల భారం ఎక్కువగా ఉంది. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పాఠశాలల్లో ఫీజులను ఖరారు చేసింది. ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ ఉత్తర్వులను ఖాతరు చేయకుండా అధిక మొత్తాల్లో డబ్బులను ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నారు. విద్యా వ్యాపార సంస్థగా మారింది.

కామన్ విద్యా విధానాన్ని అమలు చేయాలి...

జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలలో అధికారులు పిల్లలు, నాయకుల పిల్లలు, పేద, మధ్యతరగతి ప్రజల పిల్లలు చదవడానికి కామన్ విద్యా విధానంను అమలు చేయాలి. జాతీయ స్థాయిలో కేంద్ర కేబినెట్ 2023-24 విద్యా సంవత్సరానికి ఆమోదించిన 1+5+3+4 విద్యా విధానం అన్ని పాఠశాలల్లో అమలు అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ పాఠశాలలలో తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలలో ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన 2022-23 విద్యా సంవత్సరం నుంచి అమలు జరపడం వల్ల అనేక మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదవడానికి ఆసక్తిని చూపిస్తున్నారు. మన ఊరు - మన బడి కార్య క్రమాలు ప్రభుత్వ పాఠశాలకు కొత్త ఊపిరిని పోస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యా సంబంధిత అధికారులు జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో కామన్ విద్యా విధానంపై దృష్టిని కేంద్రీకరించి విద్యా వ్యాపారంను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

- డాక్టర్.ఎస్.విజయభాస్కర్, 9290826988

ప్రపంచ గమనం

సమ్మెకే బీబీసీ జర్నలిస్టుల ఓటు

లండన్: బీబీసీ లోకల్ రేడియో చానల్‌కి నిర్వాహకులు చేయతల పెట్టిన మార్పులను వ్యతిరేకిస్తూ 48గంటల పాటు సమ్మె నిర్వహించేందుకు అనుకూలంగా ఇంగ్లండ్‌లోని బిబిసి జర్నలిస్టులు ఓటు వేశారని నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఎన్‌యూజే) తెలిపింది. జూన్ 7, 8తేదీల్లో ఈ సమ్మె జరగనుంది. "లోకల్ రేడియోని లోకల్‌గానే వుంచాలి" అన్న ప్రచారంలో భాగంగా బీబీసీలోని ఎన్‌యూజే సభ్యులు పార్లమెంట్ సభ్యులను కలిసి, బీబీసీ జరపతలపెట్టిన మార్పులపై ఒత్తిడి తేవాల్సిందిగా కోరారు. స్థానిక సర్వీసులను ఆధునీకరించాలని బీబీసీ యోచిస్తోందని ఎన్‌యూజే తెలిపింది. ఈ ప్రతిపాదనల వల్ల స్థానిక వార్తలు ప్రజలకు తెలియకుండా పోతాయని పేర్కొంది. ఇప్పటివరకు జరిగిన చర్చల్లో కొన్ని రాయితీలు ఇచ్చినా అవి ఏమాత్రమూ సరిపోవని యూనియన్ పేర్కొంది. నేషనల్ బ్రాడ్ కాస్టింగ్ ఆర్గనైజర్ పాల్ సిగర్ట్ మాట్లాడుతూ, స్థానిక వార్తలు చాలా కీలకమని, స్థానికంగా జరిగే కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొనేందుకు వీలు కలుగుతుందని అన్నారు. కమ్యూనిటీలని ఒక్క తాటిపై కలిపి వుంచుతుం దని అన్నారు. బీబీసీ బడ్జెట్ రీత్యా చూసినట్లైతే లోకల్‌రేడియో అనేది పెద్ద ఖర్చుతో కూడిన వ్యవహారం కాదని అన్నారు. ఈ వివాదాన్ని బీబీసీ చాలా సులభంగా పరిష్కరించగలదని నమ్ముతున్నామన్నారు. ఎన్‌యుజె ఎన్నికల ఫలితం పట్ల తాము నిరాశ చెందామని బీబీసీ ప్రతినిధి వ్యాఖ్యానించారు. అయినా యూనియన్‌తో చర్చలు జరుపుతామని తెలిపారు. ఈ ప్రణాళికల్లో భాగంగా సిబ్బంది సంఖ్యను తగ్గించడం లేదా నిధుల్లో కోత విధించడం వుండదన్నారు.

31వరకు ఇమ్రాన్‌ను అరెస్టు చేయొద్దు

- గడువు పొడిగించిన ఇస్లామాబాద్ హైకోర్టు

ఇస్లామాబాద్ : మాజీ ప్రధాని ఇమ్రాన్‌పై ఈనెల 9 తర్వాత నమోదైన ఏ కేసులోనూ మే 31వరకు అరెస్టు చేయకుండా పాక్ సుప్రీం కోర్టు గడువును పొడిగించింది. ఇమ్రాన్‌పై దాఖలైన కేసులకు సంబంధించిన సమాచారం ఇవ్వడానికి మరికొంత సమయం కావాలని ప్రభుత్వం తరపు న్యాయవాది కోరడంతో ఇస్లామాబాద్ హైకోర్టు పై రూలింగ్ ఇచ్చింది. ఆ సమయంలో ఖాన్ కోర్టు గదిలో లేరు. మాజీ ప్రధానిపై వున్న కేసుల వివరాలు అందచేయాలని కోరుతూ పీటీఐ పెట్టిన పిటిషన్‌పై కోర్టు విచారణ జరిపింది. దేశవ్యాప్తంగా వందకు పైగా కేసులను ఇమ్రాన్‌పై నమోదు చేశారని పీటీఐ చెబుతోంది.

ప్రభుత్వం చేసిన అభ్యర్థనను ఆమోదించిన కోర్టు మే 31నాటికి విచారణను వాయిదా వేసింది. మే 15వరకు అరెస్టు చేయకుండా తొలుత ఇచ్చిన ఆదేశాలను 31కి పొడిగిస్తూ రూలింగ్ ఇచ్చింది. అలాగే పీటీఐ నేతలు మలీక బుఖారి, అలీ మహ్మద్ ఖాన్‌ల అరెస్టు చట్టవిరుద్ధమని వ్యాఖ్యానిస్తూ వెంటనే వారిని విడుదల చేయాల్సిందిగా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఖాన్ అరెస్టు నేపథ్యంలో దేశంలో చెలరేగిన హింసాత్మక నిరసనల సమయంలో శాంతి భద్రతల నిర్వహణ పేరుతో వీరిద్దరిని అరెస్టు చేశారు.

కార్మికులపై అత్యంత దారుణమైన దాడి

- సీడబ్ల్యూయూ నేత డేవ్ వార్డ్

లండన్ : మెరుగైన వేతనాలు, పని పరిస్థితుల కోసం నెలల తరబడి రాయల్ మెయిల్ కార్మికులు పోరాడుతున్నారు. రాయల్ మెయిల్ కార్మికుల కొరకు కుదిరిన కొత్త ఒప్పందం వివరాలను తెలియచేసేందుకు కమ్యూనికేషన్స్ వర్కర్స్ యూనియన్ (సీడబ్ల్యూయూ) ప్రధాన కార్యదర్శి డేవ్ వార్డ్ దేశవ్యాప్తంగా పర్యటిస్తున్నారు. అందులో భాగంగా ఆయన మంగళవారం గ్లాస్గోలో బుధవారం బెల్‌ఫాస్ట్‌లో పర్యటించారు. ఈ పర్యటనలు ఆశించిన ఫలితాన్ని ఇస్తున్నాయన్నారు.

ఈ సందర్భంగా ఆయన రాయల్ మెయిల్ భవితవ్యం, కార్మికుల కొత్త ఒప్పందం, లేబర్ పార్టీతో యూనియన్ సంబం ధాలు తదితర అంశాలపై మాట్లాడుతున్నారు. 'చీఫ్ ఎగ్జిక్యూటివ్ సైమన్ థాంప్సన్ వెళ్ళిపోయారని, ఇంకా కొంతమంది వైదొలగాల్సిన అవసరం వుందని వార్డ్ అన్నారు. మార్పు రావాల్సిన ఆవశ్యకత వుందని స్పష్టం చేశా రు. అయితే ఆ సంస్కృతిని విచ్ఛిన్నం చేయడం కష్టమే అయినా మార్పు తప్పదన్నారు.

ఆత్మనిర్భరత ఏది?

రక్షణ రంగంలో తగ్గుతున్న పెట్టుబడులు

- దిగుమతుల పైనే ఆధారం
- పట్టించుకోని మోడీ ప్రభుత్వం





చండీఘర్ : దేశ భద్రతకు అత్యంత కీలకమైన రక్షణ రంగంలో బీజేపీ ప్రవచిస్తున్న 'ఆత్మనిర్భరత' ఎక్కడా కానరావడం లేదు. ప్రధాని నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చి తొమ్మిది సంవత్సరాలు గడిచినా మూడు త్రివిధ దళాలనూ సైనిక సామగ్రి కొరత వేధిస్తూనే ఉంది. భారత సైనిక పాటవంపై ఇది ప్రతికూల ప్రభావం చూపుతోంది. పొరుగున ఉన్న అణు, శత్రు దేశాల నుండి అణుక్షణం భద్రతాపరమైన ముప్పు పొంచి ఉన్న తరుణంలో ఈ పరిణామం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రక్షణ సామగ్రి కొరత అధికంగా ఉంటోందని త్రివిధ దళాలు 2014 నుంచి పదేపదే ప్రభుత్వానికి మనవి చేసుకుంటూనే ఉన్నాయి. అయితే ఆ కొరతను కనీసం పాక్షికంగా తీర్చేందుకు కూడా ప్రయత్నాలు జరగలేదు. ఇప్పటి వరకూ భారత సాయుధ దళాలకు రష్యా కీలకమైన ఆయుధ సామగ్రిని, విడి భాగాలను సరఫరా చేస్తోంది. అయితే ఉక్రెయిన్ యుద్ధం కారణంగా అమెరికా విధించిన ఆంక్షల నేపథ్యంలో ఆ దేశం నుంచి సరఫరాలు సరిగా జరడం లేదు.

దేశ రక్షణ విషయంలో మోడీ ప్రభుత్వ అలసత్వంపై సైనిక విశ్లేషకుడు మేజర్ జనరల్ ఏపీ సింగ్ మండిపడ్డారు. జాతీయవాదం గురించి బీజేపీ పదేపదే గొప్పలు చెబుతోందని, అయితే అదే సమయంలో భారత సైనిక సామర్థ్యాన్ని పెంచలేకపోతోందని ఆయన చెప్పారు. 2014 తర్వాత భారత స్థూల జాతీ యోత్పత్తి (జీడీపీ)లో సైనిక దళాలకు వార్షిక కేటాయింపులు రెండు శాతం కూడా దాటలేదని ఓ అధికారి తెలిపారు. దేశీయంగా సైనిక అవసరాలను తీర్చేందుకు ఉద్దేశించిన ఆత్మనిర్భరత చర్యలు అందుకు ఏ మాత్రం దోహదపడలేదని ఆయన విమర్శించారు. భారత వైమానిక దళంలో యుద్ధ విమానాల కొరత అధికంగా ఉంది. రెండు లేక అంతకంటే ఎక్కువ యుద్ధ విమానాలను, వాటిని నడిపేందుకు అవసరమైన సిబ్బందిని కలిపి స్క్వాడ్రన్ యూనిట్ అంటారు. వైమానిక దళానికి ఇలాంటి యూనిట్లు 42 అవసరం కాగా ప్రస్తుతం 29 మాత్రమే ఉన్నాయి. వీటి సంఖ్య కూడా రానురానూ మరింత తగ్గిపోతోంది. వీటితో పాటు మిడ్-ఎయిర్ రిఫ్యుయలర్స్, రోటరీ వింగ్ యుద్ధ విమానాలు, అదనపు యుద్ధ పరికరాలు కూడా తగిన సంఖ్యలో లేవు. ఇక నౌకాదళం విషయానికి వస్తే సముద్ర జలాలలో కార్యకలాపాలు సాగించే సంప్రదా యక యుద్ధ నౌకల కొరత ఎక్కువగానే ఉంది. ఐఎన్ఎస్ విక్రాంత్‌లో పని చేసేందుకు విశ్వ సనీయమైన సిబ్బంది లేకుండా పోయారు. వ్యూహాత్మక హిందూ మహాసముద్రంలో కార్య కలాపాల కోసం అరవై ఐదు వేల టన్నుల బరు వుండే యుద్ధ విమానాన్ని తీసికెళ్లే సామర్థ్యం కలిగిన వాహక నౌకను దేశీయ పరిజ్ఞానంతో తయారు చేయాల్సిన అవసరం ఉన్నదని నౌకా దళం కోరుతున్నా పట్టించుకున్న నాథుడు లేడు.

ఇక సాయుధ దళాల డిమాండ్ల చిట్టా చాంతాడంత బారున ఉంది. తుపాకులు, యుద్ధ ట్యాంకులు, పదాతి దళాలకు అవసరమైన వాహనాలు కావాలని సాయుధ దళం అడుగుతోంది. అత్యాధునిక ఆయుధాలు అవసరమని కోరుతున్నప్పటికీ రక్షణ శాఖ పట్టించుకోవడం లేదు. ఇది సాయుధ దళాల సామర్థ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేసేందుకు విదేశీ ఉత్పత్తి దారులతో కలిసి స్థానిక ప్రైవేటు లేదా ప్రభుత్వ విక్రేతతో వ్యూహాత్మక భాగస్వామ్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే అది ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. అసలు ఈ కార్యక్రమంతో ఒరిగేదేమీ ఉండదని, సమయం వృథా అవడం తప్పించి ఏమీ జరగదని బ్రిగేడియర్ భోన్స్లే వ్యాఖ్యానించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేయడానికి విదేశీ ఉత్పత్తిదారులు ఇష్టపడరని ఆయన చెప్పారు. త్రివిధ దళాల అవసరాల కోసం విదేశాల నుండి దిగుమతులను తగ్గించుకొని దేశీయ ఉత్పత్తులపై దృష్టి సారిస్తామని, దీనివల్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుందని ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంది. అయితే దేశీయంగా ఉత్పత్తి చేస్తామని చెబుతున్న జాబితాలో నట్లు, బోల్టులు, స్క్రూలు, వాషర్లు, బుష్‌లు, క్లాంపులు, గాస్కెట్లు వంటి చిన్న చిన్న సామగ్రి ఉండడం భారత్ వంటి పారిశ్రామిక దేశానికి అవమానకరమని సైనిక విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఆత్మనిర్భరత గురించి పదే పదే వల్లె వేస్తున్నప్పటికీ రక్షణ దిగుమతులలో మన దేశం అగ్రస్థానంలో ఉంది. 2018-22 మధ్యకాలంలో ప్రపంచవ్యాప్తంగా జరిగిన ఆయుధ దిగుమతులలో భారత్ వాటా 11 శాతంగా ఉంది. 2014లో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత సాయుధ దళాల కోసం గుండుసూది మొదలుకొని యుద్ధ విమానం వరకూ కొనుగోలు చేశామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గత సంవత్సరం మార్చ్‌లో పార్లమెంటుకు తెలిపారు. యుపీఏ ప్రభుత్వం తన హయాంలో రక్షణ దళాల కోసం ఏమీ కొనలేదని కూడా చెప్పారు. అయితే యుపీఏ హయాంలో 142 రక్షణ ఒప్పందాలు కుదిరాయి. ఆ కాలంలో త్రివిధ దళాల కోసం 600 యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు కొనుగోలు చేశారు. అయితే ఈ వాస్తవాన్ని కప్పిపెట్టి పార్లమెంట్ సాక్షిగా ఆర్థిక మంత్రి అసత్యాలు వల్లె వేశారు. దేశీయ పరిజ్ఞానంతో రక్షణ అవసరాలను తీర్చుకునే విషయంపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని రక్షణ నిపుణులు అభిప్రాయపడ్డారు. స్థానికంగా నట్లు, బోల్టులు తయారు చేసే విషయంపై శ్రద్ధ పెడితే రక్షణ రంగంలో స్వావలంబన ఎలా సాధ్యపడుతుందని వారు ప్రశ్నించారు. ఆత్మనిర్భరత కార్యరూపం దాల్చాలంటే ఈ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు,పరిశోధనలు అవసరమవుతాయి.

జగన్ సర్కారుకు చుక్కెదురు

ఎన్జీటీ స్టేని ఎత్తివేసేందుకు సుప్రీం నిరాకరణ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఏపీలోని ఆవులపల్లి, ముదివీడు, నేతిగుంటపల్లి ప్రాజెక్టుల నిర్మాణాలపై ఎన్జీటీ స్టేని ఎత్తివేసేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. చిత్తూరు జిల్లాలోని ఆవులపల్లి రిజర్వాయర్‌కు పర్యావరణ అనుమతిని ఎన్జీటీ కొట్టి వేసింది. ఎన్జీటీ ఆదేశాలను సవాలు చేస్తూ సుప్రీంలో ఏపీ ప్రభుత్వం పిటిషన్ దాఖలు వేసింది. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. ఎన్జీటీ విధించిన రూ.100 కోట్ల జరిమానాలో ముందుగా రూ.25 కోట్లను వెంటనే కృష్ణా బోర్డులో డిపాజిట్ చేయాలని కోర్టు ఆదేశించింది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. రూ.100 కోట్ల జరిమానా విధించవచ్చా? అన్న అంశంపై మాత్రం పాక్షికంగా సుప్రీం ధర్మాసనం స్టే విధించింది. ఏపి ప్రభుత్వం తరపున న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ఏపీ ప్రభుత్వ పిటిషన్‌పై ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. దీంతో తదుపరి విచారణ న్యాయస్థానం అక్టోబర్‌కు వాయిదా వేసింది.

ఎన్జీటీ రూ.100 కోట్లు జరిమానా విధించడం చట్టబద్ధం కాదని ప్రభుత్వ తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ప్రాజెక్టులను మీకు అనుకూలంగా విడగొట్టడం ఎలా చట్టబద్ధమని సుప్రీం ప్రశ్నించింది. ఏపీ కొత్తగా ఏర్పడిన రాష్ట్రమని, రూ.100 కోట్ల జరిమానా భారం అవుతుందని రోహత్గీ వాదించారు. రూ.100 కోట్ల జరిమానా నిలుపుదల చేయాలని కోర్టును ముకుల్ రోహత్గీ కోరారు. దీంతో ప్రస్తుతానికి రూ.25 కోట్లు కృష్ణా బోర్డులో జమ చేయాల్సిందేనని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసి, తదుపరి విచారణను అక్టోబర్‌కు వాయిదా వేసింది.

పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చే హక్కు ప్రభుత్వానికి ఉంది.. ఆర్-5 జోన్‌పై సుప్రీం కోర్టు

ఏపీ రాజధాని అమరావతి ప్రాంతంలోని ఆర్-5 జోన్‌ను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆర్-5 జోన్‌లో పట్టాలు ఇస్తే కనుక అది తుది తీర్పునకు లోబడి ఉంటుందని స్పష్టం చేసింది. అమరావతిలో పేదలకు ఇండ్ల స్థలాలను ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ కె.ఎం జోసెఫ్, జస్టిస్ అరవింద్ కుమార్ లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ చేపట్టింది. ఆర్5 జోన్‌లో పట్టాల పంపిణీపై సుదీర్ఘంగా వాదనలు జరిగాయి. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న రిట్ పిటిషన్ తీర్పునకు లోబడే పట్టాల చెల్లుబాటు ఉంటుందని తేల్చి చెప్పింది. పట్టాదారులకు థర్డ్ పార్టీ హక్కు ఉండబోదని ఉద్ఘాటించింది. రైతులు, ప్రభుత్వం తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఇరు వైపులా వాదనలు విన్న ధర్మాసనం కీలక తీర్పు వెలువరించింది. పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చే హక్కు ప్రభుత్వానికి ఉందని ధర్మాసనం పేర్కొంది. చట్టం ప్రకారమే ఐదు శాతం ఈడబ్ల్యూఎస్ కు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, అయితే కేసు తుది ఉత్తర్వులకు లోబడే ఇండ్ల పట్టాలపై హక్కులుంటాయని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది.

ఆర్-5 జోన్‌లో ఇప్పటికే ప్లాట్ల కేటాయింపులు జరిగాయని ప్రభుత్వం, సీఆర్‌డీఏ తరపు న్యాయవాది నిరంజన్ రెడ్డి పేర్కొనడంతో, ప్లాట్ల కేటాయింపుపై అభ్యంతరం చెప్పమన్నది. కానీ, మూడు రాజధానులపై హైకోర్టు రిట్ పిటిషన్ తీర్పునకు లోబడే పట్టాల చెల్లుబాటు ఉంటుందని, పట్టాదారులకు థర్డ్ పార్టీ హక్కు ఉండదని తేల్చి చెప్పింది. పిటిషనర్ల తరపున వాదనలు వినిపించిన న్యాయవాదులు రాష్ట్రం, దేశ ప్రయోజనాల కోసమే రైతులు భూములు ఇచ్చారని సుప్రీం కోర్టుకు తెలిపారు. ఒక మహానగరం వస్తుందని హామీ ఇచ్చారని రైతుల తరపు న్యాయవాది అన్నారు. ఉద్యోగాలు, అనుబంధ పరిశ్రమలు వస్తాయని ఆశచూపినట్టు తెలిపారు. 29 గ్రామాల ప్రజలు ఆ మాటలు నమ్మి.. ఎలాంటి ఆర్థిక పరిహారం తీసుకోకుండా వేల ఎకరాల భూములు ఇచ్చారని గుర్తు చేశారు.

మాస్టర్ ప్లాన్ ప్రకారం అధికారులు వెళ్లి అభివృద్ధిపై ప్రచారం చేశారన్నారు. మాస్టర్ ప్లాన్ లో నవనగరాలు ప్రతిపాదించారని అన్నారు. అవి అభివృద్ధి చెందితే ఎన్నో అవకాశాలు వస్తాయన్నారు. ఆర్థిక కార్యకలాపాలు పెరిగి రూపు రేఖలు మారతాయన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి 5 శాతం భూములు ఇవ్వాలని రైతుల తరపు న్యాయవాది అన్నారు. రెసిడెన్షియల్ జోన్ల నిబంధనల ప్రకారం కేటాయింపులు ఉండాలన్నారు. నవ నగరాల్లోని ప్రతి నగరంలో రెసిడెన్షియల్ జోన్ ఉందన్నారు. ప్రభుత్వాలు మారితే ఇచ్చిన హామీలు పక్కన పెట్టలేరన్నారు. కోర్టు తీర్పులకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని గట్టిగా వాదించారు. జులైలో తుది విచారణ జరగాల్సి ఉందని రైతుల తరపు న్యాయవాది అన్నారు. అంతకు ముందే పట్టాలు ఇస్తే ఇక చేయడానికి ఏముంటుందని ప్రశ్నించారు. ఈ సమయంలో విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు వాదనలు తిరిగి ప్రారంభమయ్యాయి.

ఏపీ ప్రభుత్వం తరపున అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. 2023 మార్చి 21న ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ నోటిఫికేషన్ ఇచ్చిందని ఆయన కోర్టుకు తెలిపారు. 34వేల ఎకరాల్లో 900 ఎకరాలే అంటే 3.1 శాతమే ఈ ఈడబ్ల్యూఎస్‌కి ఇచ్చారని పేర్కొన్నారు. సుప్రీంకోర్టులో ఆర్-5 జోన్ పై ఉన్న కేసులన్నీ వ్యక్తిగతంగా వేసినవేనని సింఘ్వీ అన్నారు. వీటిలో ఏవి ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు కావన్నారు. ఆర్-5 జోన్‌లో ప్లాట్ల కేటాయింపు పూర్తయిందని, వారి తరపునే తాము వాదిస్తున్నామన్నారు. కావాలంటే ఎలక్ట్రిక్ సిటీకి మరో 900 ఎకరాలు కేటాయించుకోవచ్చని చెప్పారు. ఆర్-5 జోన్ లో మాత్రమే భూమి తీసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఎలక్ట్రిక్ సిటీకి ఇచ్చిన 6,500 ఎకరాల్లో 900 ఎకరాలు తీసుకోవద్దంటే ఎలా? అని సింఘ్వీ ప్రశ్నించారు.